PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 265 | విజయవాడ, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 30 April 2024 | Rs

వేధింపులకు నిండు కుటుంబం బలి

- ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య
- వైఎస్ఆర్ జిల్లా చెన్నూరులో విషాదం

2



ఢిల్లీని కట్టడి చేసిన 'వరుణ్'

- ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతా ఘన విజయం

8

రేవంత్‌పై 'ఢిల్లీ పోలీస్'

రేపు విచారణకు రావాలని నోటీసులు ● భయపడేది లేదన్న తెలంగాణ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నేతలను వేధించడానికి ఐటి, ఇడి, సిబిఐలను అడ్డగోలుగా వాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం వాటికి తోడు ఢిల్లీ పోలీసులనూ రంగంలోకి దింపింది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్ట్ తరువాత మరో కీలక బాధ్యతను వారికి అప్పగించింది. సాక్షాత్తు కేంద్ర హోంశాఖే ఫిర్యాదు చేయడంలో ఢిల్లీ పోలీసులు హుటాహుటిన కదిలారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. బుధవారం (మే ఒకటవ తేది) విచారణకు ఢిల్లీకి రావాలని నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వచ్చి నోటీసులు అందచేశారు. సోమవారం అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామం కలకలం రేపింది. ఈ తరహా బెదిరింపులకు భయపడేది లేదని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. లిక్కర్ కేసులో ఢిల్లీ పోలీసుల తీరును తీవ్రంగా తప్పు పడుతున్న బిఆర్ఎస్ తాజా వ్యవహారంలో అందుకు భిన్నంగా ఉంది. ఆ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీష్‌రావు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఏం జరిగింది....?

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టిలకు ఉన్న రిజర్వేషన్లను రద్దు చేస్తారని, దానికోసమే 400 సీట్లు కావాలని అడుగుతున్నారని రెండు, మూడు రోజుల క్రితం తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారంటూ ఒక వీడియోను కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. దీంతో ఆ వీడియో వైరల్ అయింది. ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం బిజెపి నేతలను ఇరుకున పెట్టింది. తాము రిజర్వేషన్లకు అనుకూలమేనంటూ ఆ పార్టీ అగ్రనేతలు పదేపదే వివరణ ఇవ్వాల్సివచ్చింది.

మరోవైపు రంగంలోకి దిగిన కేంద్ర హోంశాఖ దీనిని డీప్ ఫేక్ వీడియోగా పేర్కొంటూ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన ఢిలీ స్పెషల్ సెల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 153/153/465/469/171జి ల కింద కేసు నమోదు చేశారు. డీప్ ఫేక్ వీడియో షేర్ చేశారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, పలువురు కాంగ్రెస్ నేతలకు నోటీసులు పంపారు. వీడియోను షేర్ చేయడానికి వాడిన సెల్‌ఫోన్లతో పాటు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా తీసుకుని మే ఒకటవ తేది ఢిల్లీలో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం, ఇన్‌సెట్‌లో రేవంత్‌రెడ్డి


ప్రశ్నించినందుకే...

బిజెపిని ప్రశ్నించినందుకే తనకు నోటీసులు జారీ చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పోలీసుల నోటీసులపై స్పందించిన ఆయన ఎన్నికలు వచ్చినప్పుడల్లా మోడీ ప్రభుత్వం ఇడి, సిబిఐ, ఐటి అధికారులను పంపిస్తున్నారని, ఈ సారి ఢిల్లీ పోలీసులను పంపారని చెప్పారు. ఇటువంటి వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. 'సోషల్ మీడియాలో బిజెపిని ప్రశ్నించా... దీనికి తెలంగాణ ముఖ్యమంత్రినైన నాకూ, గాంధీ భవన్‌లోని ఇతర నేతలకూ అమిత్‌షా నోటీసులు పంపుతున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

అసెంబ్లీ బరిలో 2705 మంది

లోక్‌సభకు 503 మంది

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- స్వతంత్ర అభ్యర్థులకు గ్లాస్ గుర్తు
- ఆందోళనలో కూటమి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ఈ నెల 18 నుంచి 25వ తేది వరకు అభ్యర్థులు నామినేషన్ల వేయగా ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీకి కలిపి మొత్తం 6001 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 4,210 మంది ఎన్నికల బరిలో నిలిచారు. రాష్ట్రంలో 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 1103 నామినేషన్లు రాగా వీరిలో 503 మంది పోటీలో ఉన్నట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2705 మంది బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీకి అత్యధికంగా 46 మంది, తక్కువగా నగరిలో ఆరుగురు బరిలో నిలిచారు. కుప్పంలో చంద్రబాబుతో సహా 13 మంది పోటీలో ఉండగా, పులివెందులలో జగన్‌తో కలిపి 27 మంది పోటీలో నిలిచారు. నారా లోకేష్ పోటీచేస్తున్న మంగళగిరిలో 40 మంది పోటీ చేస్తున్నారు.

జనసేన పార్టీ గుర్తు గ్లాస్ ఫ్రీ సింబల్ కావడంతో ఎన్నికల కమిషన్ కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థులకు కూడా కేటాయించింది. పొత్తులో భాగంగా జనసేన 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లో పోటీలో ఉంది. మిగిలిన చోట ఆ పార్టీకి అభ్యర్థులను నిలపలేదు. దీంతో ఆ పార్టీ గుర్తు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడంతో టిడిపి-జనసేన-బిజెపి కూటమిలో ఆందోళన నెలకొంది. కూటమి నుంచి టికెట్ దక్కని ఆశావాహులు పలుచోట్ల రెబల్స్‌గా బరిలోకి దిగారు. విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, మైలవరం స్వతంత్ర అభ్యర్థి వల్లభనేని నాగ పవన్‌కుమార్, విజయవాడ సెంట్రల్‌లో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థి గొల్లపల్లి ఫణిరాజ్, టెక్కలిలో స్వతంత్ర అభ్యర్థి అట్టాడ రాజేష్, కాకినాడ జిల్లా జగ్గంపేట స్వతంత్ర అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కుమారుడు నంబూరు కళ్యాణ్ బాబు, గన్నవరంలో స్వతంత్ర అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కృష్ణ, మంగళగిరిలో రావు సుబ్రహ్మణ్యం, మదనపల్లెలో షాజహాన్‌లకు ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు గ్లాస్ గుర్తును కేటాయించారు. అదేవిధంగా అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న దళిత బహుజన పార్టీకి చెందిన వి.కృష్ణస్వరూపకు కూడా గ్లాస్ గుర్తును ఎన్నికల అధికారి కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులతో పాటు కూటమి అభ్యర్థులకు కూడా గాజు గ్లాసు గుర్తు కేటాయించడంతో కూటమిలో గుబులు పట్టుకుంది.

మరో 'సూరత్'

- ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ

ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటాం

- సిపిఎం బృందానికి ఇసి హామీ
- బిజెపి అక్రమాలను వివరించిన సుభాషిణీ అలీ, మురళీధరన్

వడదెబ్బకు ముగ్గురు మృతి

- మృతుల్లో ఇద్దరు ఉపాధి కార్మికులు..
- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

నగదు సిద్ధం చేసుకోండి

పింఛన్లపై బ్యాంకులకు ఆర్థికశాఖ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీకి కావాల్సిన నిధులపై ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. ఈసారి పింఛన్లను నేరుగా బ్యాంకు ఖాతాలకే జమ చేయాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బ్యాంకులు కూడా సిద్ధంగా ఉండాలని ఆర్థికశాఖ సూచించింది. పంచాయితీ రాజ్‌శాఖ నుంచి వచ్చిన లేఖ మేరకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బిసి) ద్వారా అన్ని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తాజాగా లేఖ రాశారు.

మే, జూన్ నెల పింఛన్ల పంపిణీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆ రెండు నెలల పింఛన్లకు కావాల్సిన నగదును బ్యాంకుల్లో సిద్ధంగా ఉంచుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. దివ్యాంగులు, నడవలేని పరిస్థితుల్లో ఉన్నవారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మినహా మిగిలిన వారికి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని లేఖలో ఆర్థికశాఖ సూచించింది. ప్రతి నెలా 66 లక్షల మందికి పింఛన్ల కోసం సుమారు మూడు వేల కోట్లు కావాల్సి ఉంటుంది. ఇన్నాళ్లూ ఈ నిధులను అధికారులు వాలంటీర్లకు ఇచ్చేవారు. వారు లబ్ధిదారులకు అందించేవారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బ్యాంకు ఖాతాలకే నిధులు జమ చేయాల్సి ఉండడంతో ఆ మూడు వేల కోట్లను బ్యాంకులకే జమ చేయాలి. ఇదే సమయంలో లబ్ధిదారుల జాబితాను వారి బ్యాంకు ఖాతాల వివరాలతో సహా బ్యాంకులకు అందించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. అది కూడా గ్రామాల వారీగా జాబితాను సిద్ధంచేసి, వారి బ్యాంకు ఖాతాల నంబర్లతో ఆ ప్రాంత బ్యాంకులకు అందించడం కొంత కష్టమైన ప్రక్రియగానే చెబుతున్నారు. అందువల్ల ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ ఎంతవరకు సంపూర్ణంగా జరుగుతుందన్నది వేచి చూడాల్సిందే.

సిద్ధం చేస్తున్నది 1932 కోట్లే

కాగా బుధవారం నాటికి 1932 కోట్లు సిద్ధం చేయాల్సి ఉంటుందని ఎస్ఎల్‌బిసి పేర్కొంది. ఈ మేరకు బ్యాంకులకు కావాల్సిన నిధులను ఖరారుచేస్తూ సర్క్యులర్ పంపించింది. అత్యధికంగా స్టేట్ బ్యాంకుకు రూ. 673 కోట్లు, యూనియన్ బ్యాంకుకు రూ. 464 కోట్లు తో పాటు మరో 18 బ్యాంకులకు కూడా లక్ష్యాన్ని నిర్దేశించింది.

ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి

- తిండి, బట్ట, పెళ్లి మీదా ఆంక్షలు
- మోడీకి సాగిలపడిన చంద్రబాబు, జగన్ : బివి రాఘవులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బిజెపి ధ్వంసం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే దేశం కుక్కలు చింపిన విస్తరిలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి, జనసేన, వైసిపి... బిజెపి పక్షానే ఉన్నాయని వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పోటీ ఇండియా వేదిక, బిజెపి మధ్యేనని పేర్కొన్నారు. 'ఎన్నికలు-వర్తమాన పరిస్థితి'పై తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవులు మాట్లాడుతూ ముస్లిముల రిజర్వేషన్లు తీసేస్తామని ఎన్నికల ప్రచారం సందర్భంగా బిజెపి ప్రకటిస్తే... టిడిపి, వైసిపిలు వ్యతిరేకించకపోవడం శోచనీయమన్నారు. పౌరసత్వ చట్టసవరణ పేరుతో దేశవ్యాప్తంగా ఒకే మతం, ఒకే యూనిఫారం, ఒకే ఫుడ్ అనేలా బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆఖరికి తిండి, బట్ట, పెళ్లిమీద కూడా ఆంక్షలు విధిస్తోందని, ప్రజల జీవితాన్ని, ఇంటిని కూడా నియంత్రిస్తోందని వివరించారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను తుంగలో తొక్కిందని గుర్తు చేశారు. అయినా, రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వానికి సాగిలపడుతున్నాయన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి వైసిపితో పోటీ పడుతున్నట్లు నటిస్తున్నాయని, వాస్తవానికి షాడో బాక్సింగ్‌లో మాదిరిగా కొట్టుకుంటున్నారని వివరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటంలో టిడిపి, వైసిపి చేసింది ఏమీలేదన్నారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. రాజధాని అమరావతిలో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయని, గతంలో ఐదేళ్లు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం రాజధానిని అభివృద్ధి చేయలేకపోయిందన్నారు. రాజధాని పేరుతో భూములను కబ్జా చేసిందని విమర్శించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మిగతా 7లో



సదస్సులో మాట్లాడుతున్న బివి.రాఘవులు

గండె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కల్పనా సోరెన్ నామినేషన్

రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఉప ఎన్నిక జరుగుతున్న గండె అసెంబ్లీ నియోజక వర్గం నుంచి జెఎంఎం తరపున బరిలోకి దిగిన ఆమె సోమవారం గిరిదహ్‌లో ఎన్నికల అధికారి వద్ద తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ సిఎం చంపయీ సోరెన్, జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, మంత్రులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, తన భర్త హేమంత్ సోరెన్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా ఆరెస్టు చేయించిందని అన్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం)కు చెందిన ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ డిసెంబర్‌లో తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అవసరమైంది.



నామినేషన్ అనంతరం ప్రసంగిస్తున్న సోరెన్

మల్కాపురం సిఐపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)



విశాఖ నగర పరిధి మల్కాపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో సిఐగా పనిచేస్తున్న ఎన్.సన్యాసి నాయుడుపై సస్పెన్షన్ వేటు పడింది. విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కొయ్యలాడ వెంకటేశ్వర జగదీష్ నామినేషన్ దాఖలు చేశారు. తనను రౌడీ షీటర్ కౌన్సెలింగ్ కోసం మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు సిఐ పిలిచారని, మిగతా రౌడీ షీటర్లందరినీ పంపించిన తర్వాత తనను పోలీస్ స్టేషన్ భవనంలోని మొదటి ఫ్లోర్‌పైకి తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి దూషించారని ఎన్నికల కమిషన్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై వీడియో క్లిప్/ఆడియో క్లిప్ ఆధారంగా నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ విచారణ చేపట్టారు. క్రమశిక్షణ చర్యలో భాగంగా సిఐని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.



విశాఖ మల్కాపురంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న వడ్డే శోభనాదీశ్వరరావు

మోడీ కాళ్లు మొక్కే పార్టీలను సాగనంపాలి

- చైతన్య యాత్రలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో/మల్కాపురం

మోడీ కాళ్లు మొక్కే పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేనలను సాగనంపాలని భారత రాజ్యాంగ హక్కుల వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు కోరారు. ఎపి చైతన్య యాత్రలో భాగంగా విశాఖలోని మల్కాపురంలో సోమవారం జరిగిన సభలో వారు మాట్లాడారు. ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న సిపిఎం గాజువాక అభ్యర్థి జగ్గునాయుడును, సిపిఐ విశాఖ పశ్చిమ అభ్యర్థి విమలను, కాంగ్రెస్ పార్టీ విశాఖ ఎంపి అభ్యర్థి సత్యారెడ్డిని గెలిపించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను గుజరాతీయులకు అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతుంటే, నీతి, నిజాయితీ, నిబద్ధతతో దాన్ని ఆపేందుకు కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాడుతున్నారని వివరించారు. జగ్గునాయుడు, విమల వంటి పోరాడే నాయకులు కావాలో, మోడీ కాళ్ల దగ్గర కూర్చున్న నాయకులు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఎంతోమంది విశాఖ వచ్చి స్థిరపడడానికి స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, బిహెచ్‌పివి, పోర్టు, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఉండడమే కారణమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర మిగతా 7లో

ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలు

- పార్టీ నుంచి సస్పెండ్ చేస్తాం : కుమారస్వామి
- కఠిన చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ప్రధాని దేవెగౌడ మనువడు, హసన్ ఎంపి, ప్రస్తుత జెడి (ఎస్) అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వీడియోలు దేశవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి హెచ్ డి కుమార స్వామి సోదరుడు హెచ్‌డి రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ అమ్మాయిలతో వున్న అభ్యంతరకర వీడియోలు మూడు వేల దాకా ఉన్నాయి. బాధితురాలు, రేవణ్ణ ఇంటి పని మనిషి (47) ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ, ఎంపి ప్రజ్వల్‌పైన పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ఇంటి పనిమనిషి, బంధువే కావడం గమనార్హం. రేవణ్ణ మంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు పాల కేంద్రంలో, వసతి గృహంలో పని కల్పించాడు. ఆ తరువాత 2015లో ఆమెను వారి ఇంట్లో పనికి చేర్పించారు. రేవణ్ణ నివాసంలో ఆరుగురు మహిళలు, యువతులు పని చేసేవారు. వారందరూ లైంగిక దాడులకు గురయ్యారని బాధిత మహిళ తెలిపింది. రేవణ్ణ మహిళలను తన గదికి తరచూ పిలిపించుకునేవాడని, భార్య ఇంట్లో లేని సమయంలో స్టోర్ రూమ్‌కు రప్పించుకునేవాడని, ఆ రాసలీలల వీడియోలను చూపి బ్లాక్‌మెయిల్ చేస్తూ మళ్లీ అలాంటి చర్యలకే పాల్పడేవాడని బాధితురాలు తెలిపారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇప్పుడు ఆయన దాష్టీకాలను బయటపెడుతున్నానని బాధితురాలు తెలిపారు. తనపైనా, తన కుమార్తెపైనా ప్రజ్వల్ , ఆయన తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదు చేసింది. కొన్నాళ్లకు పని మానేసి బయటకి వచ్చేశానని.. వీడియోలు బయటకు రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మాట్లాడుతున్నానని బాధితురాలు వాపోయింది.



బిజెపి, జెడిఎస్ ఉమ్మడి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ

వీడియోలు తీసి బెదిరింపులు..

పజ్వల్ వీడియోలు తీసి వాటి ఆధారంగా అమ్మాయిలను లోబరుచుకునేవాడని కొందరు ఆరోపిస్తున్నారు. అలా ఏకంగా మూడు వేలకుపైగా వీడియోలు తీశాడని, వెయ్యి మందికిపైగా మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

సిట్ ఏర్పాటు

జెడిఎస్ ఎంపి రాసలీల ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఎడిజిపి బికె సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ ప్రకటించారు. అశ్లీల వీడియోల అంశం హల్‌చల్ చేస్తున్న సమయంలోనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీలోని ఫ్లాంక్‌ఫర్ట్‌కు ఉడాయించడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. సిట్ దర్యాప్తులో భాగంగా ఆయన్ని వెనక్కి తీసుకువచ్చి విచారిస్తామని పరమేశ్వర్ తెలిపారు.

వీడియోలు వెలుగులోకి రావడంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని టివి చానళ్లు, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజ్వల్ అశ్లీల వీడియోలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి సిఎంకు లేఖ రాశారు. ఈ విషయమై మిగతా 7లో

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

మతతత్వ బిజెపిని వ్యతిరేకించిన వైఎస్ఆర్ ● ఎపి న్యాయ్ యాత్రలో వైఎస్ షర్మిల

రాష్ట్రాన్ని బిజెపి చేతిలో పెడితే సర్వనాశనం : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం

టిడిపి, వైసిపి ప్రభుత్వాల పదేళ్ల పాలనలో రాష్ట్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, అభివృద్ధి శూన్యమని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. మతతత్వ బిజెపిని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వ్యతిరేకించారని, గోద్రా ఘటనలో ఉతికి ఆరేశారని వివరించారు. మణిపూర్‌లో ఘోరం జరిగినా సిఎం జగన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అటువంటి బిజెపితో అక్రమ పొత్తు పొట్టుకున్న జగన్ మోహన్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి వారుసుడా..? అంటూ ప్రశ్నించారు. ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా సోమవారం కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా, ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెంలో నిర్వహించిన సభల్లో షర్మిల మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తును చంద్రబాబు, జగన్‌హన్‌రెడ్డి బిజెపికి తాకట్టు పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను నట్టేట ముంచారని మండిపడ్డారు. గత పదేళ్లుగా పోలవరం ప్రాజెక్టును ఓ ఎటిఎంగా మార్చుకున్నారని, రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను బిజెపికి తాకట్టు పెట్టారని విమర్శించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అభివృద్ధి చేసిందేమీ లేదని, ఇసుక మాఫియా, మట్టి మాఫియాలను పెంచి పోషించారని ఆరోపించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రబాబు కూటమికి ఓటేసినా, వైసిపికి ఓటేసినా ఢిల్లీ నుంచి మోడీ, అమిత్ షా రాష్ట్రాన్ని పాలిస్తారని తెలిపారు.



ఎపి న్యాయ్ యాత్ర సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాజమండ్రి ఎంపి అభ్యర్థి గిడుగు రుద్రరాజు తదితరులు

రాష్ట్రంలో బిజెపికి కనీస ఓటు బ్యాంకు లేకపోయినప్పటికీ పోటీపడి ఆ మూడు పార్టీలు మద్దతు తెలపడంలో ప్రజాప్రయోజనం లేదని వివరించారు. రాష్ట్రాన్ని బిజెపి చేతిలో పెడితే సర్వనాశనం చేస్తారని హెచ్చరించారు. మతసామరస్యం, దేశసమైక్యత వంటి ఎన్‌టిఆర్ ఆశయాలకు తూట్లు పొడిచి మతతత్వ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురందేశ్వరిని ఓడించాలని కోరారు. వైసిపి ప్రకటించిన మేనిఫెస్టో తుస్సుమనిపించా రని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే మేనిఫెస్టో కావాలన్నారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి గిడుగు రుద్రరాజు, రంపచోడవరం సిపిఎం అసెంబ్లీ అభ్యర్థి లోతా రామారావు, కాంగ్రెస్ రాజమండ్రి సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్ల మురళి, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి. మధు పాల్గొన్నారు.

వడదెబ్బకు ముగ్గురు మృతి

- మృతుల్లో ఇద్దరు ఉపాధి కార్మికులు.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ప్రజాశక్తి-యంత్రాంగం

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్రంలో వేర్వేరుచోట్ల వడదెబ్బకు ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు ఉపాధి కార్మికులు, ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉన్నారు. కుటుంబ సభ్యులు, ఉపాధి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పెదరాజుపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు చెకుముఖి రామచంద్రుడు (51) రోజులాగే అందరితోపాటు ఉపాధి పనులకు వెళ్లారు. ఎండకు తాళలేక పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. తోటి కార్మికులుఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం నల్లగుంట్లకు చెందిన మండ్ల బాలయ్య (70) గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనికి వెళ్లారు. పని చేస్తున్న క్రమంలో అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి కార్మికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీ సత్య సాయి జిల్లా ముదిగుబ్బ మండలం ముదిగుబ్బ పాతూరుకు చెందిన ఎం.ప్రణీత్‌కుమార్ (24) సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇటీవల ఇంట్లో ఉండే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రణీత్‌కుమార్ మరణించారు.

బిజెపిని ఓడించి స్టీల్‌ప్లాంటును కాపాడుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

రాబోవు ఎన్నికల్లో బిజెపిని ఓడించి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1173వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ టిపిపి, పిఇఎం, స్టోర్స్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ.. అశేష త్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్ట్రాటజిక్ సేల్ పేరుతో నూరు శాతం అమ్మకానికి పెట్టి ప్రజాద్రోహానికి పాల్పడిందన్నారు. ఈ ద్రోహానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం, విశాఖ జిల్లా కార్మికులు, ప్రజాసంఘాలు, ప్రజలు గత మూడేళ్లుగా సమైక్య ఉద్యమం నిర్వహిస్తున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి, కావాలనే నష్టాల్లోకి నెట్టి కారు చౌకగా మోడీ అనుకూల కార్పొరేట్ల చేతిలో పెట్టేందుకు కుట్ర జరిగిందని విమర్శించారు. ఈ కుట్రలను ఉక్కు కార్మికవర్గం, జిల్లా ప్రజానీకం తిప్పి కొట్టాలని కోరారు.

చెత్తపన్ను రద్దు చేస్తాం

- భూములు కొట్టేయడానికి ప్రణాళిలు సిద్ధం చేశారు
- ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి -గూడూరు, కర్నూలు ప్రతినిధి

అధికారంలోకి రాగానే సిపిఎస్‌పై నిర్దిష్ట విధానం తీసుకొస్తామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేస్తామని, పిఆర్‌సి వేసి ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం నంద్యాల జిల్లా డోన్, నందికొట్కూరులో నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్ల బటన్ నొక్కే పేరుతో నాటకాలు ఆడారని విమర్శించారు. ఈ ఎన్నికలు విధ్వంస పాలనకు, అభివృద్ధికి సవాల్ అని, ధర్మానికి అధర్మానికి మధ్య పోరాటమని తెలిపారు. జగన్‌కు అహంకారం ఎక్కువైందని, వ్యవస్థలన్నీ నాశనం చేశారని విమర్శించారు. ప్రజల జీవితాలను చితికిపోయేలా చేసిన దొంగ వారిని వదిలిపెడదామా? అని ప్రశ్నించారు. శాశ్వతంగా ఉండిపోదామని అనుకున్నారని, మళ్లీ ప్రజల దగ్గరకు వెళ్ళాలని మరిచిపోయారని విమర్శించారు. పరదాలు కట్టుకు తిరిగిన వ్యక్తి ఎన్నికల ముందు ప్రజల దగ్గరకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. సచివాలయానికి రాని వారు ముఖ్యమంత్రా? అని ప్రశ్నించారు. సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని, రాయలసీమకు ఏమైనా చేశారా? ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? ఒక పరిశ్రమ అయినా తెచ్చారా? మరి ఎందుకు వారికి ఓటేయాలని ప్రశ్నించారు. భూములన్నీ జగన్ పేరుతో రాసుకుంటున్నారని, భూములు కొట్టేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని, ఇది చాలా ప్రమాదకరమన్నారు.



నంద్యాల జిల్లా డోన్ బహిరంగసభలో మాట్లాడుతున్న నారాచంద్రబాబునాయుడు

ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే ఎపి లిక్కర్ స్కాం ఇంకా పెద్దదని చెప్పారు. బిసిలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛను ఇస్తామని, తమది సామాజిక న్యాయమని, జగన్ ది సామాజిక ద్రోహమని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో ముస్లింలకు అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ళ గృహప్రవేశాలు చేయిస్తామని, వికలాంగులకు రూ. ఆరువేల పింఛను ఇస్తామని, ఇసుక అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

ఇంటి వద్దే పింఛను ఎందుకివ్వడం లేదు?

ఇంటి వద్దే సామాజిక పింఛను పంపిణీ చేసే సిబ్బంది ఉన్నా ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రశ్నించారు. గూడూరు బస కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.26 లక్షల సచివాలయం సిబ్బంది, 15 వేల మంది పంచాయతీ కార్యదర్శులు, ఐదు వేల మంది వెలుగు సిబ్బంది, ఐదువేల మంది వ్యవసాయ సిబ్బంది, మూడు వేల మంది హార్టికల్చర్ సిబ్బంది గ్రామ స్థాయిలో ఉన్నారని...వీళ్లందరితో పంపిణీ చేయిస్తే ఒక్కొక్కరు 45 మందికి పింఛను పంపిణీ చేసినా ఒక్కరోజులోనే అందరికి పంపిణీ చేయవచ్చన్నారు. వలంటీర్లతో పింఛను పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం చెప్పిందని, కానీ వితండ వాదంతో ప్రభుత్వం పింఛన్ల పంపిణీని రాజకీయం చేస్తోందని చెప్పారు. పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని సిఎస్, గవర్నర్, ఎన్నికల కమిషన్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని, గత ఘటనలు పునరావృతం కాకుండా పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ కూడా చెప్పిందని అన్నారు.

వేధింపులకు నిండు కుటుంబం బలి

- ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య
- వైఎస్ఆర్ జిల్లా చెన్నూరులో విషాదం

ప్రజాశక్తి - వల్లూరు

వైఎస్ఆర్ జిల్లా చెన్నూరులో పెను విషాదం చోటుచేసుకుంది. భర్త ఇంటి వేధింపులను తాళలేక ఒక తల్లి, ఇద్దరు పిల్లలతో సహా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గంగాయపల్లె సమీపంలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం...చెన్నూరు గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి (45) కడప నగర సమీపంలోని చలమారెడ్డిపల్లికి చెందిన శ్రీహరితో 2005లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఫణికుమార్ (18), కుమార్తె ధనలక్ష్మి (17) ఉన్నారు. శ్రీహరి కువైట్ వెళ్లడంతో 12 ఏళ్లుగా



పిల్లలతో సహా ఆమె చెన్నూరులోని తన సోదరుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లోనే ఉండేవారు. అయితే కొద్దికాలం తర్వాత కువైట్ నుంచి భర్త తిరిగిరావడంతో తనను, పిల్లలను ఇంటికి తీసుకెళ్లాలని ఆమె కోరారు. శ్రీహరి అందుకు నిరాకరించడంతో పాటు విడాకుల నోటీసులు కూడా పంపారు. అయితే ఆమెకు రూ.8 లక్షల మేర భరణం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు శ్రీహరి నిరాకరించి వాదులాటకు దిగారు. ఉమామహేశ్వరిపై దాడికి కూడా పాల్పడ్డారు. దీంతో ఆమె తిరిగి సోదరుడి ఇంటికే వెళ్లారు. కాగా గత శనివారం పిల్లలతో కలిసి గుడికి వెళ్లొస్తానని ఆమె సోదరుడి ఇంట్లో చెప్పారు. బయటకు వెళ్లిన తర్వాత 'నేను, పిల్లలూ రైలు కింద పడి చనిపోతున్నాం. మా చావుకు నా భర్త శ్రీహరి, అత్త సరస్వతి, ఆడ పడుచు శశికళ, మరో వ్యక్తి లక్ష్మీపతి కారణం' అని సోదరుడికి వాయిస్ మేసేజ్ పంపారు. దీంతో ఆమె సోదరుడు రాజేంద్రప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రాకింగ్ చేయగా గంగాయపల్లి బోరెడ్డిపల్లి మధ్యలో ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు గంగాయపల్లె సమీపంలోని ఒక చెట్టుకు ఉమామశ్వేరి, ఆమె పిల్లలు ఊరేసుకొని ఉన్న విషయాన్ని గమనించిన ఆ ప్రాంతానికి చెందిన ఒక పాడి రైతు ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో వల్లూరు ఎస్ఐ వెంకటరమణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప డిఎస్‌పి షరీఫ్ తెలిపారు.



ప్రమాదానికి గురైన ఆటో

ఆటోను ఢీకొన్న లారీ : నలుగురు మృతి

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి వద్ద ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల నవీన్ పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించుకునేందుకు ఆదివారం ఎనిమిది మంది ఆటోలో యానాం వెళ్లారు. వేడుకలు అనంతరం తిరిగి అదే ఆటోలో పయనమయ్యారు. ఆటో కాకినాడ రూరల్ మండలం భట్నవిల్లి గ్రామం వద్దకు చేరే సరికి అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నగరం గ్రామానికి చెందిన సాపే నవీన్ (22), కొల్లాబత్తుల జతిన్ (26), పి.గన్నవారానికి చెందిన వల్లూరి అజయ్ (18), మామిడికుదురు మండలం పాసర్లపూడికి చెందిన నల్లి నవీన్ (27) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అమలాపురం రూరల్ సిఐ వీరబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

జూన్ 10, 11, 12 తేదీల్లో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసరు పోస్టులకు పరీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసరు పోస్టులకు జూన్ 10, 11, 12 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధి, శిక్షణశాఖ డైరెక్టరు బి నవ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ జూన్ 6 నుంచి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజినీరింగ్ పరీక్షలు కూడా అదే తేదీల్లో ఉండటంతో రాత పరీక్షల తేదీలు మార్పు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ పోస్టులకు మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఈ పరీక్షల తేదీ మార్పును గమనించాలని కోరారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్ https//employment.ap.gov.inలో తెలుసుకోవచ్చని సూచించారు.

రెండు నుంచి ఎపిఆర్ సెట్ పరీక్షలు

- సెట్ కన్వీనర్ దేవప్రసాదరాజు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

ఎపి ఆర్‌సెట్ 2023-24 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మే రెండు నుంచి ఐదు వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎపి ఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు తెలిపారు. తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వచ్చే రెండు నుంచి ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంకాలం 4.30 గంటల వరకూ రెండు దశలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో వచ్చే పదో తేదీ నుంచి విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్లు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఎంపిక చేసిన 17 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మే 20 నాటికి ఫలితాలు వెల్లడించి, జూన్‌లో ఇంటర్వ్యూలు చేపడతామని వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కుసుమ హరినాథ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

'సమూహ' సదస్సుపై దాడికి సాహితీ స్రవంతి ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన లౌకిక విలువలు-సాహిత్యం అనే అంశంపై జరుగుతున్న సదస్సుపై ఎబివిపి గూండాల దాడిని సాహితీ స్రవంతి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, కె సత్యరంజన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భావజాలంపై చర్చించే ప్రజాస్వామ్య వాదులపై ఎబివిపి దాడులు చేయడం తగదని, తక్షణమే దాడికి పాల్పడ్డవారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మతోన్మాదుల ఫాసిస్ట్ చర్యలను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు తీవ్రంగా ఖండించాలని కోరారు.

3న జర్నలిస్టుల కొవ్వొత్తుల ప్రదర్శన: ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో రాష్ట్రంలో హక్కుల సాధన కోసం మే 3న జర్నలిస్టులంతా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు, ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు వి శ్రీనివాసరావు, కె మునిరాజు, ఎన్‌ఎజె అధ్యక్షులు ఎస్‌కె పాండే, ఎన్ కొండయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఎన్నికల నేపథ్యంలో జర్నలిస్టులపై హింస మరింత పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిజాన్ని కాపాడండి.. జర్నలిస్టులను రక్షించండి అనే నినాదంలో మే 3న చేపట్టనున్న కొవ్వొత్తుల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

అవినీతిలో కూరుకుపోయిన వైసిపి ప్రభుత్వం: ఎన్‌డిఎ కూటమి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఎన్‌డిఎ కూటమి నేతలు బోండా ఉమామహేశ్వరరావు, లంకా దినకర్, రాయపాటి అరుణ విమర్శించారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మూడు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో రూ.8 లక్షల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, మద్యంలో అవినీతి పెచ్చుమీరిందన్నారు.

58 నెలల్లో రూ.2.78 లక్షల కోట్లు

- 85 శాతం మంది లబ్ధిదారులకు అందించాం
- చంద్రబాబు పేరుచెబితే ఒక్క పథకమైనా గుర్తొస్తుందా?
- పొన్నూరు, అంబాజీపేట, కొత్తూరు సభల్లో సిఎం జగన్



గుంటూరు జిల్లా పొన్నూరు సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- యంత్రాంగం

58 నెలల కాలంలో 85 శాతం మంది ప్రజలకు రూ.2.78 లక్షల కోట్లు అందించానని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్లు సిఎంగా చేసిన చంద్రబాబు ఎంత మంది ప్రజలకు మేలు చేశారని ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఒక్క పథకం అయినా పూర్తిగా అమలు చేశారా?, చంద్రబాబు పేరుచెబితే గుర్తుకు వచ్చే ఒక్క మంచిపథకం అయినా ఉందా? అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వస్తేనే ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని చెప్పారు. గుంటూరు జిల్లా పొన్నూరు, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజక వర్గం అంబాజీపేట, అనకాపల్లి జిల్లా చోడవరం కొత్తూరు జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగిం చారు. తనను బచ్చా అని పిలుస్తున్న చంద్రబాబుకు రాజకీ యంగా తగిన సత్తా ఉంటే ఇన్ని పార్టీలతో పొత్తులెందుకని ప్రశ్నించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ హెల్త్ డాక్టర్, నాడు-నేడులో పాఠశాలలు అభివృద్ధి చేశామని, చంద్రబాబు తన 14 ఏళ్ల కాలంలో ఇవ్వన్నీ ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలన్నారు. గత ఐదేళ్లలో 2.34 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చానని, చంద్రబాబు ఇంతమందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తన మంత్రి వర్గంలో 68 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు స్థానం కల్పించానని తెలిపారు. చంద్రబాబును నమ్మితే కొండ చిలువ నోటిలో తలకాయ పెట్టినట్లేనని, సాధ్యం కాని హామీలిచ్చి అమలు చేయకుండా మోసగిస్తారని, ఇది ఆయన గత చరిత్ర చెబుతున్న సత్యమని వివరించారు. గత ఎన్నికల్లో జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి, జాబు వచ్చే వరకు రెండు వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తానని నమ్మించి మోసగించారన్నారు. ఢిల్లీతో రాజీపడి ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీ గోవిందా చేశారని విమర్శించారు. సింగపూర్‌ను మించిన రాజధాని చేస్తానని నమ్మించి, అన్ని హంగులున్న వైజాగ్‌ను వదిలేశారని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోవడంతో పదేళ్ళు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సిన హైదరాబాద్‌ను గోవిందా చేశారని వ్యాఖ్యానించారు. ఆడబిడ్డ పుడితే బ్యాంకు అకౌంట్‌లో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, తరువాత ఒక్క రూపా యి కూడా బ్యాంకులో వేయలేద న్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్న 14 ఏళ్లలో దోచుకోవడం, దోచుకున్నది దాచుకోవడం తప్ప చేసేందేమిలేదన్నారు. కూటమి పేరుతో మోసాల చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ బిజెపితో జతకట్టారని, ఇదే కూటమి 2014లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అన్నీ విస్మరించిందన్నారు. ఇప్పుడు ఇంటికి కేజీ బంగారం, ఒక బెంజ్ కారు ఇస్తామని హామీ ఇస్తారని చంద్రబాబును నమ్మొద్దని తెలిపారు. తమ ప్రభుత్వంలోనే చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో ఎన్నో మార్పులొచ్చాయని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం వరకు అమలు చేశామన్నారు. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్లలో మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని అందుకే ఇంట్లో వాళ్లందరూ కూర్చుని చర్చించుకుని ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఆయా చోట్ల ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిఠాపురం రోడ్‌షోలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రమాదకరం

- తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం
- గణపవరం, తాడేపల్లిగూడెం, పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు, కాకినాడ ప్రతినిధులు, పిఠాపురం

వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అత్యంత ప్రమాదకరమని, తాము అధికారంలోకి వస్తే ఈ యాక్ట్‌ను రద్దు చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గం, కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయన పర్యటించారు. ఆయా చోట్ల పవన్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో నాడు-నేడు పనులు కంటే పేకాట, మద్యం, ఇసుక దోపిడీ భారీగా జరిగాయని ఆరోపించారు. 4709 పాఠశాలలు, ఎయిడెడ్ స్కూల్స్‌ను మూసివేశారన్నారు. ఈ కాలంలో 3.88 లక్షల మంది విద్యార్థులు బడి మానేశారని తెలిపారు. చిక్కీ కవర్లపై ఫొటో వేసుకుని రూ.67 వేల కోట్లు దోచేశారన్నారు. ఆక్వా వల్ల తాగునీటి సమస్యలు ఏర్పడినా ఎవ్వరూ మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికీ పిఆర్‌సిపై ఉపాధ్యాయులు ఉద్యమం చేస్తున్నారని, మాట ఇచ్చిన ప్రకారం సిపిఎస్‌ను జగన్ రద్దు చేయలేదని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిపిఎస్‌పైనే తొలిచర్చ ఉంటుందని తెలిపారు. ఆపరేషన్ కొల్లేరు పేరుతో చెరువులను ధ్వంసం చేసి కనీసం పరిహారం కూడా ఇవ్వడం లేదని చెప్పారు. డెల్టాలో తాగునీరు లేదని, ఇంటింటికీ మద్యం మాత్రం అమ్ముతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఆక్వాకు విద్యుత్ యూనిట్ ఖరీదు రూ.1.50కి ఇస్తే ఈ ప్రభుత్వం ఐదు రూపాయలకు పెంచేసిందన్నారు. ఆక్వా రైతుల నుంచి తీసుకుంటున్న పన్నులు తిరిగి వారికి ప్రోత్సాహకాలుగా అందించాల్సి ఉన్నా అందించడం లేదన్నారు. 30 వేల మంది పిల్లలు అదృశ్యమైతే ఒక్కరోజు కూడా మాట్లాడలేదని, ఇలాంటివారు క్లాస్‌వార్ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులకు టిఎ, డిఎ సరెండర్ లీవ్స్ కింద రూ.750 కోట్లు రావాలని, కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి వ్యతిరేక ఓటు చీలనివ్వబోనని తాను 2021లోనే చెప్పానని, అందులో భాగంగానే మమ్మల్ని మేము తగ్గించుకొని పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు డబ్బులు లేవు అని చెబుతున్నారని, కాని ఒక్క మద్యంలోనే రూ.వేలకోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. తాను గెలిస్తే పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న చిన్న చిన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ.. వైసిపి ఓడిపోతుందని తెలిసే బ్లూ మీడియా వారం రోజులుగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, టిడిపి ఎంపి అభ్యర్థి పుట్టా మహేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు వద్దు

- ఎన్నికల కమిషన్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు టిడిపి తెలిపింది. ఈ నిర్ణయం దుర్మార్గం అని ఎన్నికల కమిషన్‌కు ఆ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సచివాలయంలో సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సిఎం జగన్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆరాటపడుతున్నారని విమర్శించారు. అలాగే మహారాష్ట్ర ఎన్నికల విధుల్లో ఉన్న ఆంధ్ర స్పెషల్ పోలీసు అధికారులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాగా సంపద సృష్టించడంలో సిఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతినెలా అప్పులపై ప్రభుత్వం ఆధారపడుతుందన్నారు.

రూ.119 కోట్ల మద్యం, డ్రగ్స్ సీజ్

● స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక రూ.119 కోట్ల విలువ చేసే మద్యాన్ని, డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, డ్రగ్స్ రాష్ట్రంలోకి రాకుండా 150 చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 68,312 కేసులు నమోదు చేసి, 66,312 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ మద్యాన్ని నివారించేందుకు 39,232 మంది పోలీసులు పనిచేస్తున్నారని తెలిపింది. అక్రమ మద్యం, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకారం అందించాలని కోరింది.

ల్యాండ్ టైటిల్ యాక్టుపై దుష్ప్రచారం

సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టుపై దుష్ప్రచారం తగదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టెక్నాలజీ పెరిగాక ప్రతి వ్యవస్థలో కొన్ని మార్పులు తీసుకురావడం సహజ ప్రక్రియ అని అన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టుతో పేపర్ లెస్ విధానాన్ని తీసుకొస్తున్నామన్నారు. అయితే భూములన్నీ పోతాయని దుష్ప్రచారం మొదలు పెట్టారని, ఒకరి భూమి మరొకరికి ఎలా పోతాయని ప్రశ్నించారు. అలాగే పెన్షన్ల పంపిణీపై చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదని, టిడిపి హయాంలో 2014 నుంచి 2019 వరకు పెన్షన్ లబ్ధిదారులను ఎంత ఇబ్బంది పెట్టారో ముందు తెలుసుకోవాలని సూచించారు. జగన్ ప్రభుత్వం రిక్రూట్ చేసిన 1.2 లక్షల సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని చెప్పేందుకు కూడా అర్హత లేదన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో లబ్ధికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

అప్పారావు మృతి బాధాకరం

● టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మూకల అప్పారావు మరణం బాధాకరమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయునిగా కొనసాగారని, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ఉపాధ్యాయ లోకం మంచి నాయకుడిని కోల్పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపేయాలి

● ఎన్‌జిటి తీర్పును యథాతథంగా అమలు చేయాలి
● రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉన్నత న్యాయ స్థానం ఆగ్రహించింది. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. ఎన్‌జిటి తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అనుమతులు లేకుండా చేపట్టిన ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపేయాలని పేర్కొంది. ఇసుక అక్రమ తవ్వకాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకున్న చర్యలపై మే 9లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను ఆదేశించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తేదీలోపు ఇసుక అక్రమ తవ్వకాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్‌జిటి తీర్పుపైన ఎలాంటి స్టే విధించలేదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

అక్రమాలకు పాల్పడిన వారిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌జిటిని కూడా సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమ తవ్వకాలు జరపడం లేదని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని జెపి వెంచర్స్‌కు కూడా ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ అనుమతులు లేనిచోట ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనుమతులు ఉన్నచోట మాన్యువల్‌గా మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని పేర్కొంది. పిటిషనర్ నాగేంద్ర కుమార్ ఇసుక అక్రమ తవ్వకాలపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించింది.

పిటిషనర్ ఫిర్యాదులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టర్లు పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా.. ఎన్నికలు ఉన్నందున అఫిడవిట్ దాఖలుకు సమయం ఎక్కువ కావాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఎన్నికల కన్నా పర్యావరణ అంశాలే ముఖ్యమని తేల్చి చెప్పింది.

పర్యావరణ అనుమతులు లేకుండా ఎపిలో ఇంకా భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ నివేదికలో నిర్ధారించింది. ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాధారాలతో సహా నివేదికను అందజేసింది. కేంద్ర కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని కేంద్ర పర్యావరణ అటవీశాఖ, ఎన్‌జిటి ఆదేశాలు జారీ చేసింది. యంత్రాలతో ఇసుక మైనింగ్‌కు అనుమతులు లేనప్పటికీ భారీ యంత్రాలతో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు కమిటీ నివేదికలో పేర్కొంది. గతంలో ఇసుక అక్రమాలపై జెపి పవర్ వెంచర్స్‌కు రూ.18 కోట్లు తాత్కాలికంగా జరిమానాను ఎన్‌జిటి విధించింది. ఎపిలో 40 రీచ్‌లలో మ్యాన్యువల్ మైనింగ్‌కు ఇసి అనుమతులుంటే 500కు పైగా రీచ్‌లలో ఇసి అనుమతులు లేకుండా యంత్రాలతో ఇసుక మైనింగ్ చేస్తున్నట్లు కేంద్ర కమిటీ నివేదికలో బయటపడింది. కేంద్ర కమిటీ నివేదిక ప్రకారం.. జెపి పవర్ వెంచర్ కంపెనీ రూ.500 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌జిటి అభిప్రాయపడింది.

మోడల్ స్కూల్స్ ప్రవేశ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. 164 పాఠశాలల్లో ఆరోతరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 31,376 మంది విద్యార్థులు హాజరయ్యారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. cse.ap.gov.in లేదా apms.apcfss.in/studentlogin.do వెబ్‌సైట్ల ద్వారా హాల్ టికెట్ నెంబరుతో ఫలితాలు పొందవచ్చని తెలిపారు. అడ్మిషన్ల కోసం సంబంధిత మోడల్ స్కూల్స్‌లో సంప్రదించాలని కోరారు.

కెన్యాలో డ్యామ్ కూలి 45 మంది మృతి

నైరోబి: ఆఫ్రికా దేశం కెన్యా లో ఘోర ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా సోమవారం ఉదయం ఒక డ్యామ్ కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. ఈ ఘటనలో 45 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. కెన్యాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రిఫ్ట్ వ్యాలీకి చెందిన మాయి మహియు పట్టణంలోని కిజాబె డ్యామ్‌లో నీటి ప్రవాహం పెరిగి గోడలు కొట్టుకుపోయాయి. ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దిగువ ప్రాంతాల్లోకి నీరు ప్రవహించింది. పలు ఇళ్లు, ఒక ప్రధాన రహదారి ధ్వంసమైంది. వరదల్లో పలువురు గల్లంతైనట్లు తెలుస్తోంది. "డ్యామ్ ధ్వంసం కావడం వల్ల 45 మంది వరకు మృతి చెందారు. ఇది ఒక అంచనా మాత్రమే. ఇంకా పలువురు బురదలో చిక్కుకొని ఉన్నారు. వారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి" అని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. కాగా.. భారీ వర్షాలకు ఇప్పటికే ఈ దేశంలో మరణాలు సంభవిస్తుండగా, డ్యామ్ ఘటనతో ఆ సంఖ్య 120కి చేరింది. ఎల్‌నినో వల్లే సాధారణం కంటే భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ఇప్పటికే పాఠశాలలకు ఇచ్చిన మధ్యంతర సెలవుల్ని పొడిగించాల్సి వచ్చింది. ఇదిలాఉంటే.. పొరుగుదేశం టాంజానియాలో కూడా వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దాంతో వరదలు, కొండచరియలు కారణంగా అక్కడ 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లో ఐదుగురు ఓటర్లకు పోలింగ్ కేంద్రం



లడఖ్ : కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లో ఐదుగురు ఓటర్ల కోసం ప్రత్యేకంగా వారి నివాసం దగ్గరలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఒక్కరినీ పోలింగ్‌లో భాగస్వామ్యుల్ని చేసేలా చర్యలు తీసుకున్నామని ఎన్నికల అధికారి మరల్కర్ తెలిపారు. లేహ్ జిల్లా ప్రాంతానికి మారుమూల 170 కి.మీ దూరంలోని వాషీ గ్రామంలో ఓ రైతు కుటుంబం నివసిస్తోంది. వారిలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళా ఓటర్లు ఉన్నారు. లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో ముస్లింలు అధికంగా ఉండే కార్గిల్, బౌద్ధులు అధికంగా ఉండే లేహ్ జిల్లాలు ఉన్నాయి. మొత్తం 1,82,571 మంది ఓటర్లలో 91,703 పురుషులు, 90,868 మంది మహిళా ఓటర్లున్నారు. 577 పోలింగ్ కేంద్రాలను ఇసి ఏర్పాటుచేస్తుండగా వాటిలో 33 పట్టణ, 544 గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో చాలా ప్రాంతాలకు హెలికాప్టర్ల ద్వారా ఎన్నికల సామాగ్రిని, సిబ్బందిని తరలించనున్నారు

ఆరో దశ పోలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఆరో దశలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ దశలో బీహార్, హర్యానా, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఢిల్లీలోని స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 57 లోక్‌సభ స్థానాలకు మే 25న పోలింగ్ జరగనుంది. బీహార్‌లో 8, హర్యానాలో 10, జార్ఖండ్‌లో 4, ఒడిశాలో 6, ఉత్తరప్రదేశ్‌లో 14, పశ్చిమబెంగాల్‌లో 8, ఢిల్లీలో 7 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దేశంలో మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక, ఏడో దశ ఎన్నికలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. ఏడో దశలోనూ దేశంలోని 57 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జూన్ ఒకటిన ఈ చివరి దశ ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కానున్నాయి. ఇప్పటికే దేశంలో తొలి రెండు దశల్లో ఎన్నికలు ముగిశాయి. తొలి దశలో 102, రెండో దశలో 89 స్థానాలకు పోలింగ్ ముగిసింది.



ఈసారి బెంగాల్‌లో లెఫ్ట్ ప్రభ

● 10-12 స్థానాలు గెలుస్తాం ● బెంగాల్‌లో వామపక్షాల విజయావకాశాలపై మహ్మద్ సలీం





కొల్‌కతా: లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో సిపిఎంతో సహా వామపక్షాలకు 10-12 సీట్లు వచ్చే అవకాశముందని మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం అంచనా వేశారు. ఆదివారం నాడు ఆయన ఒక ఆన్‌లైన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం తెలిపారు. బిజెపి బలం తగ్గుతోందని, వామపక్షాలు బలపడుతున్నాయని పంచాయతీ ఎన్నికల అనుభవం తెలియజేస్తోందని సలీం అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఈ విషయం తేటతెల్లమవుతుందని తాము భావిస్తున్నామన్నారు.. .మహ్మద్ సలీం ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.. "రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య కుదిరిన అవగాహన మేరకు సిపిఎం 23 స్థానాల్లో, కాంగ్రెస్ 12 స్థానాల్లో, లెఫ్ట్ ఫ్రంట్‌లోని ఇతర భాగస్వామ్య పార్టీలు 7 స్థానాల్లో పోటీ చేస్తున్నాయని ఆయన తెలిపారు.

సామాజిక భద్రతా పథకాలు దయతో ఇచ్చే కానుకలు కావు, ప్రజల హక్కుగా మేం భావిస్తున్నాం. దేశంలోనే మొట్టమొదటి సారి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు వంటివి ప్రవేశపెట్టింది వామపక్షాలేనని సలీం అన్నారు. మేం అధికారంలోకి వస్తే ఇలాంటి పథకాల పరిధి పెరుగుతుంది.ఎందుకంటే అవినీతి తలుపులు మూసుకుపోతాయి, ప్రజలందరూ వీటి వల్ల లబ్ధి పొందుతారని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం

80 వేల మందికిపైగా మా పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ప్రజల నుండి మమ్మల్ని వేరు చేయాలని చూసిందని సలీం తెలిపారు. తాత్కాలికంగా కొన్ని అవరోధాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి సిపిఎం కార్యకర్తలు తిరిగి ప్రజలతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంటున్నారని ఆయన అన్నారు.


ఎన్నికల తరుణంలో తృణమూల్ -బిజెపి మధ్య బంధం మరోసారి బయటపడిందన్నారు.యావద్దేశం నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు ఆరెస్సెస్, దానికి మిత్రపక్ష పాత్ర పోషిస్తున్న తృణమూల్ నుంచేనని అన్నారు. షోరూమ్‌లు వేర్వేరుగా ఉన్నప్పటికీ బిజెపి, తృణమూల్‌ల గోడౌన్‌లు ఒక్కటేనని అన్నారు. గత పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. లోపాలను విశ్లేషించుకుని పార్టీ పునఃపతిష్టత కోసం కృషి.చేస్తున్నామన్నారు. యువతను ముందుకు తీసుకొచ్చాం.బెంగాల్ పునరుజ్జీవనానికి వామపక్షాలను తిరిగి అధికారంలోకి తేవాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. ఈ అనుభవంతోనే రాష్ట్రంలో వామపక్షాలు కనీసం 10-12 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని చెబుతున్నానన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా దేశంలో వామపక్షాలు నిరంతరం పోరాడుతుంటే, బిజెపి మౌనంగా ఉంది. ఎందుకంటే తృణమూల్ కాంగ్రెస్‌లోని అవినీతిపరులైన నేతలకు ఆ పార్టీ ఆశ్రయం కల్పించింది. తణమూల్ అవినీతిని ఎదుర్కోవడం బిజెపి వల్ల కాదని రాష్ట్ర ప్రజలు గ్రహించారని ఆయన అన్నారు.

కృష్ణానగర్‌పై జాతీయస్థాయి దృష్టి







పశ్చిమబెంగాల్‌లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఆకర్షిస్తున్న నియోజకవర్గాల్లో నదియా జిల్లాలోని కృష్ణా నగర్ ఒకటి. పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తడంలో నైతికత ప్రదర్శించలేదన్న ఆరోపణలతో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన టిఎంసి ఎం.పి. మహువా మొయిత్రా మళ్లీ ఇక్కడ పోటీ చేస్తున్నారు. లోక్‌సభ నుంచి బహిష్కృతురాలైన వెంటనే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆమెను కృష్ణానగర్ అభ్యర్థిగా ప్రకటించారు. అక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని మమత ప్రారంభించారు. బిజెపి అభ్యర్థిగా రాజ కుటుంబానికి చెందిన అమృతా రాయ్ పోటీ చేస్తున్నారు. బెంగాల్ నవాబ్ సిరాజ్ ఉద్ దౌలాకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో కలిసి కుట్ర పన్నిన దివంగత రాజా కృష్ణచంద్ర రాయ్ వారసత్వం అమృతకు ఉందని టిఎంసి ఆరోపిస్తోంది. ఈ విషయంపై ఆందోళన చెందవద్దని ప్రధాని నరేంద్ర మోడీ అమృతారాయ్‌కి ఫోన్ చేసి నచ్చచెప్పినట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం సాది (సిపిఎం) కృష్ణానగర్‌లో పోటీ చేయడంతో టిఎంసి, బిజెపిల లెక్కలు తప్పే అవకాశం ఉందని నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. దీంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. రైతులు, సాధారణ కూలీలు ఉండే కృష్ణానగర్‌లో దాదాపు సగం మంది మైనారిటీ వర్గాలకు చెందినవారే. సిపిఎం అభ్యర్థి సాదీ ప్రచారం జోరుగా సాగుతోంది. రోడ్ షోలతోపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రతి చోటా వేలాది మంది పాల్గొన్న ర్యాలీలు కనిపిస్తున్నాయి. కాగా ఈ నియోజకవర్గంలో నాల్గవ దశలో మే 13న ఎన్నికలు జరుగుతున్నాయి.

ఝార్‌గ్రామ్‌లో సోనా మణి ముర్ము



తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మావోయిస్టులు సృష్టించిన భీభత్సానికి గత దశాబ్దన్నర కాలంలో డజన్ల కొద్దీ సిపిఎం కార్యకర్తలు అమరులైన నేల ఝార్‌గ్రామ్. బెంగాల్‌లో వామపక్ష కూటమి పాలనను పడగొట్టడానికి ప్రణాళికాబద్ధమైన ఎత్తుగడలను ప్రారంభించిన ప్రాంతం. ఇక్కడ టిఎంసి భయోత్పాతాన్ని ప్రతిఘటిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో వామపక్ష కూటమి గట్టి ఉధృత ప్రచారం నిర్వహిస్తోంది. షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేసిన నియోజకవర్గమైన ఝార్‌గ్రామ్ నుండి వామపక్ష అభ్యర్థి సోనా మణి ముర్ము పోటీ చేస్తున్నారు. ఆమె ఎర్ర జెండాలతో నిర్వహిస్తున్న వీర కవాతు స్థానిక ప్రజలను ఆకర్షిస్తోంది. ప్రజా కార్యకర్త, రేడియో జాకీ అయిన సోనామణి, సంతాల్, బెంగాలీ, హిందీ భాషలలో అనర్గళంగా మాట్లాడి గిరిజనులు, గిరిజనేతరులు అనే తేడా లేకుండా అభిమానం సంపాదించుకున్నారు. ఎన్నో హక్కుల పోరాటాల్లో పాల్గొన్నారు. వామపక్ష కూటమి కార్యకర్తలు, నాయకులు సోనామణి విజయం కోసం ఉత్సాహంగా, జోరుగా ప్రచారం చేస్తున్నారు. బిజెపి నుంచి ప్రణత్ తుట్టే, టిఎంసి నుంచి జోరన్, ఇతర ప్రధాన అభ్యర్థులు ఇక్కడ బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మే 25న ఎన్నికలు జరగనున్నాయి.

14 నుండి 6కి తగ్గిపోయిన జాతీయ పార్టీలు


దేశంలో తొలిఎన్నికల్లో అతిపెద్ద పార్టీ కాంగ్రెస్‌తో పాటు ఇతర చిన్న చిన్న జాతీయ పార్టీలు పోటీ చేశాయి. పోనుపోను చిన్న జాతీయ పార్టీలు ఉనికిలో లేకుండా పోయాయి. రాజకీయంగా అంతరించి పోవడమో లేక ఇతర పార్టీల్లో విలీనం వల్లనో అవి కనుమరుగయ్యాయి. లెఫ్ట్ పార్టీలు మాత్రమే నేటికీ మనుగడలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో సిపిఐ(ఎం) జాతీయ పార్టీగా ఇసి గుర్తింపు పొందింది. 1951-52లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 14 జాతీయ పార్టీలు, 39 ఇతర పార్టీలు పోటీ చేశాయి. లెఫ్ట్ పార్టీలు కాక మిగిలిన వాటిలో అత్యధికంగా కాంగ్రెస్ నుంచి ఏర్పడినవే. 1953లో దేశవ్యాప్తంగా నాలుగు పార్టీలు.. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), ప్రజా సోషలిస్ట్ పార్టీ (పిఎస్‌పి), ఆల్ ఇండియా భారతీయ జన సంఘ్ (బిజెఎస్) వంటివి జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందాయి.

తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 364 సీట్లలో విజయం సాధించింది. 16 స్థానాలు గెలుచుకుని రెండో అతిపెద్ద పార్టీగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. జయప్రకాష్ నారాయణ్ ఆధీనంలోని సోషలిస్ట్‌పార్టీ 12 సీట్లను గెలుపొందింది. జె.బి కృపలానీ స్థాపించిన కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తొమ్మిది స్థానాలు, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఏడు స్థానాలను గెలుచుకున్నాయి. హిందూ మహాసభ నాలుగు, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ రాజకీయ విభాగమైన భారతీయ జనసంఘ్ (బిజెఎస్) మూడు స్థానాలను సాధించింది. మిగిలిన 30లు పార్టీ తమ ఖాతాలను తెరవలేకపోయాయి.

1952 ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ, కెఎంపిపిలో విలీనమై ప్రజా సోషలిస్ట్ పార్టీ (పిఎస్‌పి)గా ఆవిర్భవించింది. అయితే 1972 వరకే అది ఉనికిలో ఉంది. ఆ ఎన్నికల్లో డా.భీమ్‌రావు అంబేద్కర్‌కు చెందిన షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (ఎస్‌సిఎఫ్) ఆరు స్థానాలను గెలుపొందింది. తర్వాత రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ)గా అది రూపాంతరం చెందింది. 1977 ఎమర్జెన్సీ తర్వాత జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని ఏర్పాటు చేశారు. బిజెఎస్, భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్‌లోని ఒక వర్గం ఈ పార్టీలో విలీనమయ్యాయి. తర్వాత బిజెపి ఏర్పడినప్పుడు దాని నుంచి బిజెఎస్ విడిపోయింది.

ఓట్ల శాతం లేదా గెలుపొందిన సీట్లను బట్టి జాతీయ పార్టీలుగా ఇసి గుర్తిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్, సిపిఐ(ఎం), బిజెపి, ఆమ్‌ఆద్మీ, బహుజన్ సమాజ్ పార్టీ, నేషనల్ పీపుల్స్ పార్టీ వంటి పార్టీలను ఎలక్షన్ కమిషన్ జాతీయ పార్టీలు గుర్తింపు పొందాయి.

లక్నో నుంచి రాజ్‌నాథ్‌సింగ్ నామినేషన్



లక్నో: కేంద్ర రక్షణ మంత్రి, బిజెపి సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్ లక్నో స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికలకు సోమవారం దాఖలు చేశారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీలతో కలిసి వెళ్లి ఆయన నామినేషన్ పత్రాలు సమర్పించారు. రాజ్‌నాథ్‌సింగ్ నామినేషన్ దాఖలు చేసే ముందు నగరంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. అలాగే స్థానిక దక్షిణ్ ముఖి హనుమాన్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఐదవ దశ పోలింగ్‌లో లక్నో స్థానానికి పోలింగ్ జరగనుంది.

2019లో కూడా లక్నో స్థానం నుంచే రాజ్‌నాథ్‌సింగ్ పోటీ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి పూనమ్ శత్రుఘ్న సిన్హాపై 6.3 లక్షల ఓట్లతో గెలుపొందారు. సాధించారు. అలాగే 2014లో కాంగ్రెస్ అభ్యర్థి రీటా బహుగుణ జోషిపై 2.72 లక్షల ఓట్ల తేడాతో ఆయన గెలుపొందారు.



మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణ గౌడపై అసభ్యకర వీడియోల కేసు దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో దేవెగౌడ ప్రజ్వల్ వారి కుటుంబంతో ప్రధాని మోడీ. (ఈ ఫొటో సోషల్‌మీడియాలో ఇప్పుడు వైరల్ అవుతోంది.)

కలం బాణాలు

ఒక్క ముస్లింకూ అన్యాయం చేయం : చంద్రబాబు




హిందూత్వ పార్టీతో
బతిమలాడి దోస్తీ
దూరమైన ముస్లింలను
వూరడించు కుస్తీ

లౌకిక మను కొలబద్దే
వదిలేసిన పిదప
నమ్మకమిక ఏమున్నది
పావులెన్ని కదుప

దేవెగౌడ మనుమడిపై అసభ్యకర వీడియోల కేసు

మన ప్రధాని పుత్ర పౌత్ర
ఘనకార్యం చూసి
ఛీకొట్టెనులే దేశం
వికృతాల రోసి

విలువలు వదిలేసిన
వైభోగమె దోషి
అమ్మాయిలు బతకలేని
అమానుషపు బూషి



మహారాజులను అవమానించి నిజాముల అరాచకాలపై మౌనమా? : మోడీ

రాజులూ మహరాజులు
నవాబులూ సులతానులు
మతంపేరు ఏదైనా
ఒకటేగా ప్రభువులు

పలికిన మాటలలోని
పరమార్థం వదలిపెట్టి
పెడార్థాలు మోడీజీ
తగవండీ పగబట్టి



- తె.ర



సత్తెనపల్లిలో ఢీ అంటే ఢీ

- ప్రధాన పోటీలో అంబటి, కన్నా, చంద్రపాల్
- విజయంపై ఎవరి ధీమా వారిది !

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


కన్నా లక్ష్మీనారాయణ


అంబటి రాంబాబు


చుక్కా చంద్రపాల్

పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో తాజా ఎన్నికలు రసవత్తరంగా మారాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు (వైసిపి), మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ (టిడిపి), చంద్రపాల్ (ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థి) పోటీ చేస్తున్నారు. మిగతా అభ్యర్థులు రంగంలో ఉన్నా.. ప్రధాన పోటీ వీరి మద్యే జరగనుంది. . వామపక్షాలు ...ప్రధానంగా సిపిఎంకు బలమైన కేంద్రమిది. సత్తెనపల్లి కేంద్రంగా రైతు, వ్యకాసతో పాటు అనేక సామాజిక ఉద్యమాలు జరిగాయి. గతంలో ఇక్కడి నుండి సిపిఎం తరపున ...శాసనసభకు ప్రాతినిధ్యం లభించింది.

కన్నా లక్ష్మీనారాయణ 1989 నుంచి 2009 వరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనానంతరం ..2014లో.ఆయన గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2018లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి... బిజెపిలో చేరి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తూనే నర్సరావుపేట లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2020లో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి కన్నాను తప్పించారు. తరువాత టిడిపిలో చేరారు. బిజెపి పట్ల మైనార్టీల్లో ఉండే భయం వల్ల .కన్నాకు వచ్చే ఓట్లకు గండి పడే పరిస్థితి ఉందని స్థానిక నేతలు చెపుతున్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు జనసేన సానుభూతిపరుల ఓట్లు ఎక్కువగా లభిస్తాయని టిడిపి నాయకులు ధీమాగా ఉన్నారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు నియోజకవర్గంలో తనకు ఉన్న పట్టు వల్ల విజయం లభిస్తుందని కన్నా ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి అంబటి రాంబాబు 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి రేపల్లే ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎపిఐఐసి చైర్మన్‌గా పనిచేశారు. 2009లో వైఎస్ మృతి తరువాత ఏర్పడిన వైసిపిలో చేరారు. వైసిపి నుంచి 2014లో మాజీ స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు చేతిలో ఓడి..... 2019లో ఆయనపైనే గెలుపొందారు. 2022 ఏప్రిల్‌లో జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మంత్రిగా శాఖాపరంగా పెద్దగా పట్టు సాధించకపోగా, నియోజకవర్గంలో కూడా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులపై మాటల దాడి చేయడంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా అధికారాలకు కత్తెర వేయడంతో ప్రజాప్రతినిధుల అసంతృప్తి, సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత, అంబటి నాయకత్వం పట్ల అసమ్మతి ప్రభావం కనిపిస్తోంది. అయినా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని, సిఎం జగన్‌పై ప్రజల్లో విశ్వాసం తగ్గలేదని అంబటి చెపుతున్నారు. ఇండియా బ్లాక్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి చుక్కా చంద్రపాల్ పోటీ చేస్తున్నారు. విద్యావంతుడు అయిన చంద్ర పాల్ తండ్రి పీటర్ పాల్ 1972లో జనరల్ సీటు అయిన ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అలాగే చంద్రపాల్ కూడా జనరల్ సీటులో ఇప్పుడు పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల ఓట్లు చీల్చడం ద్వారా వారి విజయావకాశాలను ప్రభావితం చేయ నున్నారు.

మంగళగిరి బరిలో 40మంది అభ్యర్థులు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పోటీ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి నామినేషన్లు పరిశీలన ఉపసంహరణ అనంతరం 40 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు జంజనం పద్మ , మురుగుడు సత్యం లు ఉపసంహరించినట్లుగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి రాజాకుమారి తెలిపారు. రంగంలో ఉన్న 40 మంది అభ్యర్థులకు గుర్తులను కేటాయించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం లో 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రత్యేకించి వీరి కోసం మూడు ఈవీఎం బ్యాలెట్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్దులు టిడిపి కూటమి నుండి నారా లోకేష్, వైసిపి నుండి మురుగుడు లావణ్య, ఇండియావేదిక బలపరచిన అభ్యర్థి సిపిఎం నుండి జొన్నా శివశంకర్ పోటీలో ఉన్నారు.

భీమిలిలో రసవత్తర పోటీ

- ముత్తంశెట్టి, గంటా
- కాంగ్రెస్ అభ్యర్థి వర్మరాజు ప్రచారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో







రాష్ట్రంలో చారిత్రాత్మక ప్రాధాన్యత గల అసెంబ్లీ నియోజకవర్గాల్లో విశాఖ జిల్లా భీమిలికి ప్రత్యేక గుర్తింపు ఉంది. డచ్, బ్రిటిష్ ప్రభుత్వాలకు ప్రధాన వ్యాపార కేంద్రంగా ఇది విలసిల్లింది. అంతేకాక పాండవులు వనవాస కాలంలో ఈ ప్రాంతంలో కొంతకాలం తలదాచుకున్నట్లు పురాణ కథలు చెబుతున్నాయి. విశాఖ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో భీమిలిలోనే అత్యధికంగా 3.61 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, మధురవాడ ప్రాంతాలు ఈ పరిధిలోకి వస్తాయి. 1983 నుండి 1999 వరకూ 5 దఫాలు టిడిపి ఇక్కడ విజయ కేతనం ఎగరేసింది. పూసపాటి ఆనందగజపతిరాజు ఒకసారి, ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు నాలుగుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2004లో కాంగ్రెస్ గెలిచింది. 2009లో ప్రజారాజ్యం నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 2014లో టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు, 2019లో వైసిపి నుండి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలిచారు. తాజా ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు పోటీపడుతున్నారు. 2019లో విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుండి ఎన్నికైన గంటా....ఇప్పుడు భీమిలికి మారి.... ముత్తంశెట్టితో తలపడుతున్నారు. ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజు...ప్రచారం చేసుకుంటున్నారు.

ఇమేజ్ పెంచుకున్న ముత్తంశెట్టి

స్థానిక శాసనసభ్యునిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మెరుగైన పరిచయాలున్నాయి. గడిచిన ఐదేళ్లుగా ఆయన ప్రజలతో అంటిపెట్టుకుని గంటా బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినేలాగా.. విస్తృతంగా పర్యటనలు చేశారు. ఈ ఎన్నికల్లో గంటాను ఇంటికి పంపిస్తానంటూ ఆయన శపథం చేశారు. గంటాతో పోల్చితే అంగబలంలో ముత్తంశెట్టి తక్కువ వ్యక్తేమీ కాదు. ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. గంటాపై గతంలో విశాఖ జిల్లా ప్రభుత్వ గ్రంథాలయ సంస్థ స్థలం కబ్జా చేసిన కేసు ఉంది. అలాగే టిడిపి హయాంలో భూ కుంభకోణాల్లో సిట్‌లోనూ గంటా శ్రీనివాసరావు పేరుంది. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడే స్వయంగా గంటాపై విమర్శలు గుప్పించేవారు. తగరపు వలస జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్ అనంతరం కార్మికులకు సరైన పరిహారం ఇప్పించడంలో గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉమ్మడిగా విఫలం అయ్యారన్న చర్చ నియోజకవర్గంలో తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరు బలమైన రాజకీయ ఉద్దండుల మధ్య ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థి వెంకట వర్మరాజు ...తనదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు.....ఈ నియోజకవర్గంలో గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.




గెలిచిన చోట ...మళ్లీ పోటీచేయని గంటా

పోటీచేసిన నియోజకవర్గంలో స్థానికంగా గంటా ఉండరు. ఒకవేళ అక్కడ గెలిచినా సరే ఇంకోసారి అక్కడ సీటు కోరుకోరు. ఎందుకంటే ఆయనది ప్రత్యేక మంత్రాంగం. 'సంతలో సరకులను కొన్నట్టుగా హోల్‌సేల్‌గా ప్రత్యర్థి వెనక ఉన్న చిన్నా, పెద్దా లీడర్లను కొనుగోలు చేసే సొంత వ్యూహామే దీనికి కారణం. భీమిలి నియోజకవర్గంలో ఆలస్యంగా గంటా వచ్చినా వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి వెనుక ఉండే కొద్దిమందిని తనవైపు ఇలాగే లాక్కొన్నారనే విమర్శలు ఎదుర్కొటున్నారు. ఎన్నికల మేనేజ్‌మెంట్ బాగా తెలిసిన అతి కొద్దిమందిలో గంటా ఒకరు. ఒకే చోట రెండు మూడుసార్లు గంటా మంత్రాంగం చెల్లదు కాబట్టి ఎన్నిక, ఎన్నికకూ వేరొక చోటకి సునాయాసంగా వెళ్లిపోతారు. ఇప్పటికే భీమిలిలో 8వేల మందిని తనవైపు తిప్పుకున్నట్లు గంటా సొంత సోషల్‌మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. గతంలో అనకాపల్లి ఎంపీగాను, తర్వాత భీమిలి, ఉత్తరంలో ఎంఎల్‌ఏగా కూడా ఈ మంత్రాంగమే గంటాను గట్టెక్కించిందని అనుచరులు చెప్పుకుంటూంటారు. .

కీలకాంశాల్లో రాష్ట్రం ఎక్కడ?

- వైసిపి, టిడిపిలవి ఆర్భాటపు మాటలే
- నీతిఅయోగ్ సర్వేలో తేలిందిదే
- పలు అంశాల్లో వెనుకబాటు
- ఐదింటిలో కేరళ ముందు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తమ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిదంటూ వైసిపి, టిడిపిలు చేస్తున్న అట్టహాసపు ప్రచారం ఎలా ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. నీతిఅయోగ్ గత ఏడాది నీతి అయోగ్ నిర్వహించిన సర్వేలో వివిధ అంశాల్లో రాష్ట్రం వెనకబడి ఉన్నట్లు తేలింది. పౌష్టికాహారం, కౌమర పిల్లల మరణాలు, బాలింతలకు వైద్యసేవలు, పిల్లల పాఠశాలల హాజరు, వంటగ్యాస్, తాగునీరు, గృహ నిర్మాణం, విద్యుత్ అందుబాటు వంటి అంశాలపై ఈ సర్వే చేపట్టింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం అనేక గ్రామాల్లో ఇంటి నుంచి కనీసం 30 నిమిషాలు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపింది. ఈ జాబితాలో పంజాబ్ మొదటి స్థానంలో ఉంటే ఎపి 26వ స్థానంలో ఉంది.

పంజాబ్‌లో 1.93శాతం సురక్షిత తాగునీరు లేని ప్రాంతం ఉంటే రాష్ట్రంలో ఇది 9.3శాతంగా ఉంది. పదేళ్ల దాటిన పిల్లల్లో 16.9శాతం కనీసం ఆరో తరగతి వరకు చదువుకోలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. ఈ పరిస్థితి కేరళలో చాలా తక్కువగా ఉంది. ఆ రాష్ట్రంలో ఈ శాతం 1.78శాతమే నమోదయి మొదటి స్థానంలో నిలవగా ఎపి 22వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో పారిశుద్ధ్య కల్పన అధ్వాన్నంగా ఉంది. రాష్ట్రంలో 22.7శాతం కుటుంబాలకు పారిశుద్ధ్య సౌకర్యాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ సౌకర్యాలు కల్పించే రాష్ట్రంగా కేరళ 1.3శాతంతో మొదటి స్థానంలో ఉంటే ఎపి 15వ స్థానంలో ఉంది. ఆడపిల్లల కౌమార దశ మరణాలు రాష్ట్రంలో 9.66శాతం చోటు చేసుకుంటున్నాయి. కేరళలో 0.19శాతంగా నమోదయి మరణాలు తక్కువగా ఉన్న రాష్ట్రంగా మొదటి స్థానంలో నిలిస్తే రాష్ట్రం 13వ స్థానంలో ఉంది. 0 నుంచి 59 నెలల పిల్లలు, 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు, 15 నుంచి 54ఏళ్ల మధ్య వయస్సు పురుషులకు పౌష్టికాహారం అందే అంశంలో ఎపి 10వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 26.38శాతం మందికి పౌష్టికాహారం అందని పరిస్థితి ఉంది. సిక్కిం రాష్ట్రంలో పౌష్టికాహారం 13.3శాతానికి అందడం లేదు. దీంతో సిక్కిం మొదటి స్థానంలో ఉంటే ఎపి 10వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో 11శాతం మంది కుటుంబాలకు రేడియో, టీవి, టెలిఫోన్, కంప్యూటర్, ఎడ్లబండి, సైకిల్, మోటార్ బైక్, రిఫ్రిజిరేటర్, కారులు లేవు. పంజాబ్‌లో ఈ పరిస్థితి 1.72శాతం మాత్రమే ఉండి మొదటి స్థానంలో నిలవగా ఎపి 9వ స్థానంలో ఉంది. మధ్యలో చదువుమానేస్తున్న పిల్లలు రాష్ట్రంలో 1.7శాతం మంది ఉన్నారు. ఎపి కంటే కేరళ మెరుగ్గా ఉండి 0.3శాతానికి పరిమితమవ్వడంతో ఆ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. వంట చేసుకునేందుకు 16.4శాతం మంది కుటుంబాలకు ఎపిలో ఇప్పటికీ గ్యాస్ కనెక్షన్లు లేవు. ఈ పరిస్థితి గోవాలో 3.1శాతానికే పరిమితమవ్వడంతో ఆ రాష్ట్రం మొదటి స్థానంలో, ఎపి 6వ స్థానంలో నిలాచింది. ఎపిలో 9.66శాతం మంది బాలింతలకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. అన్ని రాష్ట్రాల కంటే మెరుగ్గా కేరళ 1.73శాతంతో మొదటి స్థానంలో ఉంటే ఎపి 5వ స్థానంలో ఉంది. 14.7శాతం మంది కుటుంబాలకు రాష్ట్రంలో ఇళ్లు లేని పరిస్థితి ఉంది. పంజాబ్ 1.72శాతంతో మొదటి స్థానంలో ఉంటే ఎపి 3వ స్థానంలో ఉంది.

వ. స	సూచిక	ఎపి స్థానం	బెస్ట్ స్టేట్
1.	పౌష్టికాహారం	10	సిక్కిం
2.	కౌమార దశ మరణాలు	13	కేరళ
3.	బాలింతలకు వైద్యసేవలు	5	కేరళ
4.	బడివయస్సు పిల్లలు	22	కేరళ
5.	డ్రాపువట్లు	7	కేరళ
6.	వంట ఇంధనం	6	గోవా
7.	పారిశుధ్యం సౌకర్యం	15	కేరళ
8.	తాగునీరు అందుబాటు	26	పంజాబ్
9.	విద్యుత్ సౌకర్యం	6	గోవా
10.	ఆస్తులు కలిగి ఉండటం	9	పంజాబ్
11.	ఇంటి నిర్మాణం	3	గోవా
12.	బ్యాంక్ ఖాతా	7	హిమాచల్ ప్రదేశ్

రెబల్స్‌పై టిడిపి వేటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెబల్స్‌పై టిడిపి వేటు వేసింది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంది. విజయనగరం, ఉండి నియోజకవర్గాలకు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్‌లు దాఖలు చేసిన మీసాల గీత, వి వెంకట శివరామరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారని, వీరితోపాటు అరకు నియోజకవర్గానికి చెందిన సివేరి అబ్రహాం, అమలాపురం నియోజకవర్గానికి చెందిన పరమట శ్యామ్‌కుమార్, పోలవరానికి చెందిన ముడియం సూర్య చంద్రరావును కూడా సస్పెండ్ చేశారు.


వి. వెంకట శివరామరాజు


మీసాల గీత

అమలాపురం పోరు ఆసక్తికరం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలో రాజకీయం రసవత్తరంగా మారింది. మొదట్లో టికెట్ల కేటాయింపుపై ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్ష పార్టీ సైతం జాప్యం చేశాయి. అన్ని స్థానాలనూ ప్రకటించినప్పటికీ అమలాపురం వద్దకు వచ్చేసరికి ఆచితూచి అడుగులు వేశాయి. ఎట్టకేలకు అధికార వైసిపి నుంచి టికెట్‌ను మంత్రి పినిపే విశ్వరూప్‌నకు కేటాయించగా, టిడిపి మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావువైపు మొగ్గు చూపింది. కాంగ్రెస్ పార్టీ అయితాబత్తుల సుభాషిణిని బరిలో నిలిపింది.

కోనసీమకు అంబేద్కర్ పేరును పెట్టడంతో చెలరేగిన అల్లర్లు రాజకీయ నాయకులకు తలనొప్పిగా మారాయి. ఈ అల్లర్లలో మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఇళ్లకు ఆందోళనకారులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వందాలాది మందిపై వైసిపి ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఇళ్లను తగులబెట్టడంతో దళితులతోపాటు బిసి తరగతులవారూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. వారికి మద్దతుగా నిలిచారు. అనంతర కాలంలో ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ గొడవల నేపథ్యంలో కొంత మంది దళిత నాయకులు వైసిపికి దూరంగా ఉన్నారు. కేసులను ఎత్తివేయడంతో ఎంపి మిథున్‌రెడ్డికి ప్రధాన నిందితునిగా ఉన్న బిసిల నాయకుడు వాసంశెట్టి సుభాష్ కృతజ్ఞతలు కూడా తెలిపారు. ఇదంతా రాజకీయంగా కలిసొస్తుందని భావించిన వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమలాపురం వైసిపిలో కీలకంగా ఉన్న నాయకుడు వాసంశెట్టి సుభాష్ ఎన్నికలు వచ్చేసరికి 'సైకిల్' ఎక్కారు. అంతేకాకుండా టిడిపి నుంచి టికెట్ సంపాదించి రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఇప్పుడు బరిలో నిలిచారు. ఈ ఘటనల నేపథ్యంలో సమీకరణలను లెక్కలు చూసుకున్న ప్రధాన పార్టీలు అమలాపురం అసెంబ్లీ స్థానానికి అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాయి. మొత్తంగా అమలాపురం అల్లర్ల ఘటనలు వైపికి మేలు కంటే కీడే ఎక్కువ చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ వ్యవహారంలో టిడిపి, జనసేనను సైతం తప్పుబడుతున్నారు. మొదట్లో అంబేద్కర్ పేరు కోసం ర్యాలీల్లో పాల్గొన్న టిడిపి, జనసేన తరువాత ప్లేటు మార్చడంపైనా పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రచారానికి పదును

నామినేషన్ల ఘట్టం కూడా పూర్తవ్వడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైసిపి అభ్యర్థి పినిపే విశ్వరూప్, కుటుంబ సభ్యులతో కలిసి ఇప్పటికే రెండు పర్యాయాలు నియోజకవర్గాన్ని చుట్టేశారు. ఇంటింటికీ వెళ్లి మరీ



ఓట్లను అభ్యర్థిస్తున్నారు. దళిత, బిసి సంఘాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించి గెలుపునకు బాటలు వేసుకుంటున్నారు. మరోవైపు టిడిపి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు కూడా ప్రచారంలో వేగాన్ని పెంచారు. కూటమిలో భాగంగా ఉన్న జనసేన, బిజెపి నాయకులను కలుపుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

దశాబ్ద కాలం అనంతరం అమలాపురంలో మళ్లీ కాంగ్రెస్ జెండాలు రెపరె పలాడుతున్నాయి. అమలాపురం నుంచి ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థి అయితబత్తుల సుభాషిణి కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. వేదికలో ఉన్న సిపిఎం, సిపిఐ, ఆప్, ఇతర పార్టీలు ఆమెకు మద్దతుగా నిలిచాయి. నామినేషన్లకు వేదిక పార్టీల నాయకులు పెద్దయెత్తున తరలి వచ్చారు. అంతేకాకుండా ఇటీవల వేదిక తరపున సమావేశాన్ని సైతం నిర్వహించారు.

వేదికలో ఉన్న అన్ని పార్టీలూ సభాషిణి గెలుపునకు కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే ప్రచారాన్ని సైతం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పదేళ్ల కాలంలో టిడిపి, వైసిపి, బిజెపి చేసిన అన్యాయాన్ని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దశాబ్ద కాలంగా స్థిరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తిరిగి జెండాలు పట్టడంతో కాంగ్రెస్ శిబిరంలో నూతనోత్సాహం కనిపిస్తుంది.

సంపాదకీయం


పెనం నుండి పొయ్యిలోకి

పింఛన్‌దారులు ఒక ఇబ్బందిని తీర్చమంటే వంద ఇబ్బందులు తెచ్చిపెట్టింది కేంద్ర ఎన్నికల సంఘం (ఇ.సి.). రాష్ట్రంలో ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ల పంపిణీపై ఇ.సి. జారీ చేసిన మార్గదర్శకాలు లబ్ధిదారులకు ఎనలేని కష్టాలు తెచ్చిపెట్టాయి. వాటిని పరిష్కరించాలని పింఛన్‌దారులు, పలు రాజకీయపార్టీలు చేసిన విజ్ఞప్తులతో ఇ.సి. మే నెల పెన్షన్ల పంపిణీపై సరికొత్త గైడ్‌లైన్స్ ఇచ్చింది. పింఛన్ లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని నిర్దేశించింది. వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారు, మంచం పట్టినవారు, వికలాంగులు, సైనిక పింఛన్లు తీసుకునే వారికి మాత్రమే సర్కారీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్ ఇవ్వాలని సూచించింది. ఇ.సి. నిర్ణయం లక్షలాది పింఛన్‌దారుల్లో కొత్త ఆందోళనలకు కారణమైంది. ఏప్రిల్ పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎదురైన ఇబ్బందులను తలచుకొని ఆవేదన చెందుతున్నారు. పెన్షన్ అందదన్న భయంతో వేసవి మండుటెండల్లో వయోభేదం లేకుండా పేదలు కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వచ్చింది. దాంతో 30 మందికిపైగా వృద్ధులు మరణించారు. పేదల క్షోభకు ఇ.సి, ప్రభుత్వ వైఫల్యమే కారణం. గుణపాఠం తీసుకోకుండా, బ్యాంక్ ఖాతాల్లో పింఛన్ వేసే కాఠిన్యానికి పాల్పడటం పేదల ఉసురు తీయడమే కాగలదు.


రాష్ట్రంలో వివిధ కేటగిరీల్లో పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల సంఖ్య 65 లక్షలకు పైచిలుకని, వారిలో 48 లక్షల మందికి బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయని, అకౌంట్లు లేని వారు 16 లక్షలని సర్కారు లెక్కలు తీసింది. బ్యాంక్ ఖాతాల్లేని వారికి సిబ్బంది ఇంటికెళ్లి నగదు అందిస్తారని చెబుతున్నారు. అలాగే వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి కూడా ఇంటికెళ్లి పెన్షన్ ఇస్తామంటున్నారు. ఈ ఫార్ములా వినడానికి బాగానే ఉన్నా అమలు అంత సులభం కాదు. లబ్ధిదారుల అకౌంట్‌లో అమౌంట్ పడాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ)తో, ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ కావాలి. లబ్ధిదారులు తమ అకౌంట్ ఉన్న బ్యాంక్ బ్రాంచికెళ్లి నగదు డ్రా చేయడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయాలకే ఈ మలమల మాడే ఎండల్లో వెళ్లలేని స్థితి ఉండగా, ఎక్కడో మండల కేంద్రంలో కిలోమీటర్ల దూరం వెళ్లి, ఓచర్లు రాయించుకొని, బ్యాంకుల వద్ద లైన్లలో నిలబడి, డబ్బు తీసుకోవడం ఎంత కష్టమో చెప్పతరం కాదు. ఇ.సి, ప్రభుత్వ కొత్త మార్గదర్శకాలతో పింఛనుదారుల్లో 70 శాతం మందికి ఈ దుస్థితి అనివార్యత ఎదురు కావడం ఆందోళనకరం.

ఎ.పి.లో ఉన్న పెన్షన్ లబ్ధిదారుల్లో సగం మంది వృద్ధులేనన్నది ఒక లెక్క. వారూ బ్యాంకులకెళ్లి గంటల కొలదీ పడిగాపులు పడాలి. ఎటిఎంలు ఇచ్చామంటున్నా కొన్నేళ్లుగా నేరుగా చేతికి నగదు ఇస్తున్నందున అకౌంట్లు, ఎటిఎం కార్డులు వర్కింగ్‌లో లేవు. వృద్ధులు, నిరక్షరాస్యులు వాటిని వాడలేరు. పెన్షన్ల కోసం ఒకేసారి గుంపుగా బ్యాంకులకు వెళితే ఎంత అలజడి అవుతుందో మోడీ ప్రభుత్వం రాత్రికి రాత్రి పెద్ద నోట్లు రద్దు చేసిన విపత్కర రోజులు గుర్తుకు తెచ్చుకోవాలి. పింఛన్ వస్తుందన్న ఆశతో పేదలు పప్పు, ఉప్పు వంటి దైనందన అవసరాలకోసం, అనారోగ్యంతో బాధ పడేవారైతే మెడిసిన్స్ కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు వేసుకుంటారు. సమయానికి పింఛన్ అందకపోతే వారి జీవితచక్రం చిందరవందరవుతుంది. ఈ పరిస్థితులను ఇ.సి, సర్కారు పరిగణనలోకి తీసుకోలేదని అర్థమవుతోంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ స్కీం వర్కర్లు లక్షల సంఖ్యలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉండగా, గతంలో మాదిరి ఇంటింటికి పింఛన్లు ఇవ్వకుండా ఎందుకు కొత్త ప్రయోగాలు చేస్తున్నారో ఒక పట్టాన అంతుబట్టదు. ఎన్నికల కోడ్ ఉన్నందున రాష్ట్రంలో రాజకీయ ప్రభుత్వం ఉండదు. ఇ.సి. నియంత్రణలో అధికార యంత్రాంగం పరిపాలన చేస్తుంది. కొత్త నిబంధనలపై పింఛన్‌దారుల్లో నెలకొన్న భయాలను తొలగించి సజావుగా పింఛన్ల పంపిణీకి ఇ.సి, ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. ఆ పని చేయకపోతే, పెన్షన్ల పంపిణీ సందర్భంగా ఎదురయ్యే దుష్పరిణామాలన్నింటికీ ఇ.సి., ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది.

నివాళి



జీవించు నీ జీవితం.
సాధించు నీ ఆశయం.
తల వంచావా అపజయమే.
ఎదిరించావా విజయం నీదే.
- శ్రీశ్రీ
జననం : 30.4.1910
మరణం : 15.6.1983



మోడీ పాలనలో గ్రామీణ శ్రామికుల దుస్థితి



బిజెపి పాలన వర్గ స్వభావం ఎంత ప్రజా వ్యతిరేకమో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగిపోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలంలోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

వ్యవసాయ శ్రామికుల నిజ వేతనాలలో కాని, తక్కిన గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో కాని 2014-2023 మధ్య పదేళ్ళ కాలంలో ఎటువంటి వాస్తవ పెరుగుదలా నమోదు కాలేదన్న వాస్తవాన్ని అనేకమంది అధ్యయనకారులు చేసిన తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ శ్రామికుల వినిమయ సూచీని, గ్రామీణ శ్రామికుల వినిమయ సూచీని పరిగణనలోకి తీసుకుని, ఆ సూచీలలో వచ్చిన ధరల పెరుగుదలకు అనుగుణంగా గ్రామీణ శ్రామికుల వేతనాలలో పెరుగుదల వచ్చిందా అన్న విషయాన్ని వారు పరిశోధించారు.



ప్రభాత్ పట్నాయక్

ఐతే ఇక్కడో సమస్య ఉంది. ఆ రెండు సూచీలూ 1986-87 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని రూపొందించినవి. అంటే, 1986-87 నాటికి, దాదాపు 40 ఏళ్ళ క్రితం నాటి, వినిమయం ఉండిన తీరునే ఇప్పుడు కూడా ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కలు వేసినవి. కాని, ఈ 40 సంవత్సరాల కాలంలోనూ ప్రజల వినిమయంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకపోతే ఈ తరగతుల ప్రజల మీద ధరల పెరుగుదల ప్రభావం ఎంత మోతాదులో ఉందో సరైన అంచనాకు రాలేము. అందుచేత సమీప కాలంలోని వినిమయ ధోరణుల్ని వ్యక్తం చేసే ప్రాతిపదికను ఎంచుకోవడం మంచిది. ఐతే ప్రభుత్వం 2010 ప్రాతిపదికన కొత్త సూచీని రూపొందించింది. శ్రామికుల వేతనాల మీద ధరల పెరుగుదల వాస్తవ ప్రభావం ఎంత ఉంటుందో, దానికన్నా తక్కువ చేసి చూపించడం దీని వెనుక ప్రధాన ఉద్దేశం. ఐనప్పటికీ ఆ 2010నే ప్రాతిపదికగా తీసుకుని చూస్తే అప్పుడు కూడా గ్రామీణ శ్రామికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు సరికదా స్వల్ప తగ్గుదల నమోదైంది. ఉదాహరణకి, 2014-2023 మధ్య కాలంలో పొలాలను దున్నే శ్రామికుల నిజవేతనాలు 2.7 శాతం తగ్గిపోయాయి. ఇదేమాదిరిగా తక్కిన వ్యవసాయ పనులకు చూసినా, తగ్గుదలే కనిపిస్తోం ది తప్ప పెరుగుదల లేదు. దీనిని బట్టి గత దశాబ్ద కాలంలో గ్రామీణ శ్రామికుల నిజవేతనాలు తగ్గిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ ప్రభుత్వం తీరును కొట్టొచ్చినట్టు చూపించే విషయం ఇది. గతంలో ఏ ప్రభుత్వమూ జిడిపి వృద్ధి రేటు గురించి మోడీ ప్రభుత్వం చేసినంత ప్రచారం, హడావుడి చేయలేదు. నిజానికి ఈ జిడిపి కూడా గత ప్రభుత్వాల కాలంతో పోల్చితే మోడీ హయాంలో తక్కువ వృద్ధిరేటునే నమోదు చేసింది. ఎప్పుడు చూసినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతోందంటూ మోడీ వల్లిస్తున్నారు. అతడి భజన బృందాలైతే ఇప్పటికే ఆ 5 లక్షల కోట్ల స్థాయిని దాటేసిందని భావిస్తున్నారు. ఈ జిడిపి వృద్ధి వ్యామోహంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి ఈ దేశ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న తరగతి-అంటే, గ్రామీణ శ్రామికుల జీవన ప్రమాణాలు వాస్తవంగా దిగజారిపోతున్నాయి అన్న వాస్తవం కనిపించడంలేదు.

అంతే కాదు, అధ్యయన బృందం మరొక విషయాన్ని కూడా నిర్ధారించింది. 2014 నాటికే అమలులో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, గర్భిణీ స్త్రీల సంరక్షణ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, అంగన్వాడీ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి 5 సంక్షేమ పథకాలను ఎన్డీయే ప్రభుత్వం దెబ్బ తీసింది. 2011 తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగలేదు. బిజెపి ప్రభుత్వం దానిని నిలిపివేసింది. దానివలన కొత్తగా జనాభాలో ఈ కాలంలో చేరిన కోట్లాదిమంది నిరుపేదలు ప్రభుత్వ లెక్కల్లో లేరు. వారందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకం కింద చెల్లించే వేతనాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఏ విధమైన పెరుగుదలా లేదు. పైగా చేసిన పనులకు చెల్లించవలసిన వేతనాల బకాయిలే నెలల తరబడి పేరుకు పోయాయి. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు చెల్లించే పింఛ ను ఎప్పటినుంచో ఆ రూ.200 దగ్గరే నిలిచిపోయింది. గర్భిణీ స్త్రీలకు వర్తించే సంక్షేమ పథకం ఒక బిడ్డ వరకు మాత్రమే పరిమితం చేశారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో 40 శాతం కోత పెట్టారు.

మొత్తంగా చూసుకుంటే మోడీ పాలనాకాలంలో గ్రామీణ శ్రామికుల నిజవేతనాలు తగ్గిపోవడమే కాక, వారికి వర్తించే సంక్షేమ పథకాలలో కూడా కోతలు పడ్డాయి. కరోనా కాలంలో ప్రతీ కుటుంబానికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టిన మాట నిజం. అది నేటికీ కొనసాగుతోంది. ఐతే దాని వలన కలిగే ఫలితం చాలా స్వల్పం. వేతనాల తరుగుదల, సంక్షేమంలో కోత ప్రభావం చాలా ఎక్కువ.

నిజానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, గ్రామీణ శ్రామికుల నిజవేతనాల్లో ప్రతీ ఏడూ ఎంతో కొంత పెరుగుదల ఉంటూ వచ్చింది. 2014-15 నుంచీ మాత్రం అది తిరుగు ముఖం పట్టింది. కొంతకాలం ఏ పెరుగుదలా లేకుండా స్తబ్దంగా ఉండి, చివర్లో ఏకంగా తగ్గడం ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం పలు అవకతవక ఆర్థిక విధానాలను అనుసరించింది. పెద్ద నోట్ల రద్దు అటువంటి చర్యల్లో ఒకటి. దాని వినాశకర ప్రభావం గ్రామీణ పేదలమీద ఆ తర్వాత కాలంలో స్పష్టంగా కనిపించింది. అదే మాదిరిగా జిఎస్‌టి ని ప్రవేశపెట్టడం కూడా మరో చర్య. దానివలన చిన్న ఉత్పత్తి వ్యవస్థలమీద చాలా ప్రతికూల ప్రభావం పడింది. దాని ఫలితంగా నిరుద్యోగం కూడా పెరిగింది. దాని వలన నిజవేతనాలలో పెరుగుదల లేకుండా పోయింది. కోవిడ్-19 కాలంలో విధించిన దారుణమైన లాక్‌డౌన్ మరొక వినాశకర చర్య. దీని ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా దెబ్బ తింది. నిరుద్యోగం పెరిగింది. నిజవేతనాలు ఎక్కువ మోతాదులో పడిపోయాయి. ఐతే, అంతకు ముందు నుండే (అంటే, 2014 నుండీ) గ్రామీణ శ్రామికుల వేతనాలలో పెరుగుదల లేకుండా పోవడానికి కారణం ఏమిటి?

నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణం. 2008లో అమెరికాలో బద్దలైన రియల్ ఎస్టేట్ బుడగ ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించింది. ఐతే, అప్పటికి అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని పెంచే దిశగా కొన్ని చర్యలు తీసుకుంది. దానివలన ఆ సంక్షోభ ప్రభావం మన దేశం మీద తక్కువగా పడింది. ఐతే, 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. నయా ఉదారవాదం కోరుకున్నట్టు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. దాని ఫలితంగా దేశ స్థూల డిమాండు స్థాయి దెబ్బ తింది. దాని పర్యవసానంగా దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బ ప్రభావం గ్రామీణ భారతం మీదనే అత్యధికంగా పడింది. గ్రామీణుల నిజ వేతనాలు పడిపోయాయి.

నిజ వేతనాలు తగ్గిపోవడం, ఉపాధి అవకాశాలు పడిపోవడం అనే ఈ రెండు ధోరణులూ ఒకదానిని ఇంకొకటి ప్రకోపింపజేస్తాయి. నిరుద్యోగం తక్కువగా ఉంటే, వేతనాలు పడిపోవు. ఎంతో కొంత పెరుగుతాయి. నిజవేతనాలు పడిపోతున్నాయి అంటే అదే కాలంలో నిరుద్యోగం కూడా పెరుగుతోందన్న మాటే.

అంటే ఏక కాలంలో గ్రామీణ పేదలు అటు నిజవేతనాల్లో తగ్గుదలను, ఇటు నిరుద్యోగం పెరుగుదలను చవిచూడవలసి వస్తోందన్నమాట. రోజు కూలీ రేటు నిజ విలువ తగ్గడమే గాక. పనులు దొరికే రోజుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నమాట. అంటే వారి వేతనాల నిజ విలువ మాత్రమే గాక, వారికి లభించే నిజ ఆదాయాలు కూడా పడిపోతున్నాయి. దీనికి తోడు సంక్షేమ పథకాలలో కూడా కోత పడుతోంది. ఇదంతా కలిపి చూస్తే గ్రామీణ పేదలు అనుభవించే పరిస్థితులు ఎంత దుర్భరంగా మారుతున్నాయో పూర్తి చిత్రం కనిపిస్తుంది.

బిజెపి పాలన వర్గ స్వభావం ఎంత ప్రజా వ్యతిరేకమో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగిపోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలంలోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

(స్వేచ్ఛానుసరణ)

సెటైర్

'కళ్లెట్టుకు సూడండ్రా బాబూ...'

"**ఒ**రే సూరిబాబూ ! ఇయ్యాల ఎవురి మీటింగ్ కాడ ఏసేర్రా మన డూటీ?"

" ఈ మద్దేనం మనం సైకిల్ మీటింగ్ కి పోవాలని సెప్పేడ్రా మేస్త్రీ " అని అప్పన్నకి బదులిచ్చేడు సూరిబాబు. "మరి ఆ పేనోళ్ళు (ఫ్యాన్ పార్టీ వాళ్ళు) ఎక్కువ కూలీ ఇస్తన్నారట నిజవే ని నా ?" అని భోగట్టా చేసేడు అప్పన్న. "అయ్యన్నీ మనకు తెల్దు. అయినా మన మేస్త్రీ అయ్యన్నీ సూసుకుంటున్నాడు కదా, ఆడు సెప్పినకాడికి ఎల్లిపోడవే నిమన డూటీ" అంటూ స్పందించేడు సూరిబాబు.

ఈ లోపు అటేపు ఆ ఊరి రిటైర్డ్ టీచర్ సత్యం గారు వచ్చేరు. "ఏమ్రా! ఏంటి సంగతులు?" అని పలకరించేరు. "మరేట్నేదు బాబూ, ఇయ్యాల మా డూటీ ఎక్కడేసేరా అని మాట్టాడుకుంటన్నాం" అని చెప్పేడు అప్పన్న. "అయినా, ఓరోజు సైకిల్ జెండా, ఇంకోరోజు ఫ్యాన్ జెండా పుచ్చుకుని ఊరేగుతున్నారే మీరంతా! ఇదేమైనా బాగుందా? ఏదో ఒక పార్టీకి కట్టుబడాలి కదా?" అనడిగేరు సత్యం మాస్టారు. "అదేటి బాబూ అలాగంతారు? ఆ పోటీలో ఉన్నోల్లకే ఎవులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో, ఎప్పుడు జంపైపోతారో తెల్దం నేదు. మాకేటి బాబూ, రోజు కూలీ, పైగా బిరియానీ, ఓ కోర్టరు మందు ఇచ్చేవోడు ఎవుడు పిలిత్తే ఆడెనకే ఆ రోజుకి ఎల్తాం. ఆరోజుకి ఆడికే జై కొడతాం. ఇందులో తప్పేటుంది?" అని సూరిబాబు సమాధానం ఇచ్చేడు. "మరి ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తార్రా మీరు?" అని సత్యంగారు అడిగేరు.



"అది తెలీకే గద దేశం దేశమంతా బుర్రలు బద్దలు కొట్టుకుంటన్నారు? మావు ఇప్పుడా సంగతి ఆలోసించం. అప్పుడే తేల్చుకుంటాం." అన్నాడు అప్పన్న. "అది సరే కాని, ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వాళ్ళకే ఓటేస్తారట కదా మీరు?" మళ్ళీ అడిగేరు సత్యంగారు. "డబ్బులిస్తే ఎందుకు పుచ్చుకోం బాబూ? ఎవులిచ్చినా తీసుకుంటాం. ఆ టయంకి ఎవులికి ఓటెయ్యాల్లో అప్పుడాలోసిత్తాం." అని సూరిబాబు అనడంతో ఆ ఓటర్ల మనోభావాలేమిటో అర్థం కాక సత్యంగారు ఆలోచనలో పడ్డారు.

★★★

ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. దాంతో అప్పన్న, సూరిబాబు అండ్ కో చాలా బిజీ అయిపోయేరు. ఒక్కోరోజున ఉదయం సైకిల్ జెండా, మధ్యాహ్నం ఫ్యాన్ జెండా పట్టుకోవలసివస్తోంది. డబుల్ డ్యూటీలతో డబుల్ సీసాలతో అలసి సొలసిపోతున్నారు ఈ బ్యాచ్ అంతా.

ఎన్నికలకి 48 గంటలకి ముందు ప్రచారం ఆగిపోయింది. సూరిబాబు అండ్ ఓ కి పనులు లేవు. ఐనా ఇంటిపట్టునే ఉంటున్నారు. ఎప్పుడు ఏ క్యాండిడేట్ మనుషుల్ని మేస్త్రీ తమ పేటకి తెస్తాడో, ఎవరు ఎంతెంత పంచుతారో తెలియాలికదా, పంచింది తీసుకోవాలి కదా. అందుకన్నమాట.

అలా రెండు వైపులా వచ్చే డబ్బుల కోసం ఎదురు చూస్తున్నప్పుడు, ఆ పేటలో ఓ చర్చ మొదలైంది.

"ఒరే సూరిగా ! మళ్లీ పేనోడొస్తే అంతా నాసెనవేని అనంతాడేంట్రా ఆ సైకిలోడు ?" అడిగేడు అప్పన్న. "మరి ఆ పేనోడేట్రా అలాగంతాడు? సైకిలోడొస్తే పెనసన్లన్నీ ఆగిపోతాయంతాడు? వొలంటీర్లనందరినీ పీకేత్తారంటాడు?" అని ఎదురడిగేడు సూరిబాబు. ఇద్దరి మీటింగులకీ వెళ్తున్నందువలన, అటు సైకిలు, ఇటు ఫ్యాను ఒకరినొకరు తిట్టుకుంటున్నవన్నీ వీళ్ళకి బాగా బోధపడ్డాయి.

వొయిజాగు స్టీలు ప్లాంటును అమ్మేత్తూంటే పేనోడేం సేసేడు?

మరి ఆ వొయిజాగు స్టీలు ప్లాంటును అమ్మేసే కమలం తో సైకిలోడు ఎందుకు జెత కట్టినట్టు?

మనకి సెత్త పన్ను, కరెంటు బిల్లు అన్నీ పెంచీసినోడు పేనోడే కదా ?

అలా పెంచి వొడ్డించమని సెప్పింది కమలం పార్టీ. దాంతో ఈ సైకిలోడు ఎందుకు కలిసినట్టు?

పేనోడే మళ్లీ వొత్తే జెనాల నోల్లు నొక్కేత్తాడు.

సైకిలోడు అసలు ఎవులికీ నోరెత్తే శాన్సే ఇవ్వడు కదా

"నయవంచన, నక్కజిత్తుల ముసలోడు"

"రాక్షస పాలన, సర్వ నాశనం"

ఇలా చర్చ చాలాసేపు జరిగింది. ఆ లోగా అక్కడికి వాళ్ళ మేస్త్రీ వచ్చేడు. అందరినీ ఐక్యపరచగలడు గనకే అతగాడు మేస్త్రీగా కొనసాగుతున్నాడు. అతగాడితో తమ చర్చల సారాంశాన్ని చెప్పుకున్నారు ఆ కూలీలంతా.

సైకిలోళ్ళు ఎంత దొంగలో ఫ్యాన్ పార్టీవాళ్ళు చెప్పేరు. అదంతా నిజమే కదా.

అలాగే ఫ్యాన్ పార్టీవాళ్ళు ఎంత దొంగలో సైకిల్ పార్టీవాళ్ళు చెప్పేరు. అదంతా కూడా నిజమే కదా. మరంచాత తెలిసి తెలిసీ ఆ దొంగల్లో ఎవరో ఒకరినెలా ఎన్నుకోడం?- ఇదీ ఆ సారాంశం.

దాంతోబాటు ఇంకో చిక్కు కూడా ఉంది. ఈ ఇద్దర్లో గెలిచేదెవడు? ఎవడు గెలుస్తాడో వాడికి కదా మన ఓటెయ్యాలి? లేకపోతే మన వోటు మురిగిపోయినట్టే కదా?

అప్పుడా మేస్త్రీ ఇలా చెప్పేడు. "ఒరే అబ్బాయిలూ! ముందు మీరు చిక్కు అనుకుంటున్నది చిక్కు కానేకాదు. మనం ఎవులికి ఓటేత్తే ఆడే గెలుత్తాడు తప్ప ఎవుడు గెలుత్తాడో ఆడికి ఓటెయ్యాలనుకోవడం తెలివితక్కువతనం. మనల్ని బోల్తా కొట్టించడానికి మాత్రమే ఈ తప్పుడు వాదన పనికొస్తుంది. ఓట్లేసేది మనం. గెలిపించేది మనం. అది మనిష్టం "

అక్కడున్నవాళ్ళు వెంటనే అడిగేరు. "ఈ ఇద్దరూ దొంగలైనప్పుడు మనం మరి ఎవరికి ఓటెయ్యాలి? "

ఆ సరికి మేస్త్రీ లేచి వెళ్ళడానికి ఉద్యుక్తుడయేడు. ఒక్క క్షణం ఆగి " ఒరే! మీకేటి సొంత బుర్రలు లేనట్టు అడుగుతారేట్రా? ఈ ఇద్దరూ కాపోతే మరి మూడోవోడెవడూ లేనట్టడుగుతున్నారు? "

"ఆ మూడోవోడెక్కడా ఆపడ్డం లేదు కదా?" అని వాళ్ళంతా అడిగేరు.

"జెనం కోసం పేనాలిచ్చేవోడెవడూ వొచ్చి మన కల్లముందు నాటకాలాడడ్రా. మనకోసం పోరాడుతూనే వుంటాడు. కష్టపడుతూనే వుంటాడు. ఆడు కనపడకపోడం కాదు. ఆడిని మనవే ని సరిగా సూడం. మన గోలలో మనం ఉంటాం. కాని ఆడికి జనం గోసే తప్ప వేరే బతుకు ఉండదు. ఆడిని మనవే ని రెండు కల్లెట్టుకు సూడాల. ఆడిని కాపాడుకోవాల. ఆడు మనోడ్రా. కల్లెట్టుకు సరిగ్గా సూడండి. " అని చకచకా వెళ్ళిపోయేడు.

కళ్ళెట్టుకు చూసిన జెనాలకి ఎర్రజెండాల రెపరెపలే కనిపించాయి.

- సుబ్రమణ్యం

★

సినిమాయే ఆయన జీవితం

గడప రఘుపతిరావు

సందర్భం



సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే దాదాసాహెబ్ ఫాల్కే ఆనాడే కోటీశ్వరుడుగా ఉండేవాడు. కానీ సినిమా రంగాన్ని, సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బ తిని, తను మాత్రం కటిక దరిద్రంతో, కడు పేదవాడిగా మరణించాడు. ఒక ఆశయం కోసం మాత్రమే జీవించిన మంచి వ్యక్తిగా చరిత్రకెక్కిన దాదా సాహెబ్ ఫాల్కే జయంతి నేడు.

ప్రపంచంలోనే అతి పెద్ద పరిశ్రమలలో ఒకటి సినిమా ప్రపంచం. భారతీయ సినిమా పరిశ్రమ ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందిస్తున్న ఒక కళారంగం సినిమా రంగం. ఇటువంటి భారత సినీ పరిశ్రమకు ఆరాధ్యునిగా, ఎందరికో ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు దాదా సాహెబ్ ఫాల్కే.

ఫాల్కే అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. మహారాష్ట్ర లోని నాసిక్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలోని త్రయంబకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30న జన్మించాడు. బొంబాయి లోని జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, బరోడాలోని కళాభవన్‌లలో విద్యాభ్యాసం చేశాడు. తండ్రి గోవింద్ సదాశివ్ ఫాల్కే సంస్కృత పండితుడు, పూజారిగానూ పనిచేశారు. తల్లి ద్వారక బాయి సామాన్య గృహిణి. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. తండ్రి బొంబాయిలోని విల్సన్ కళాశాలలో సంస్కృత ప్రొఫెసర్‌గా నియమితులైనప్పుడు, కుటుంబం మొత్తం నివాసాన్ని బొంబాయికి మార్చింది.

ఫాల్కే తన ప్రాథమిక విద్యను త్రయంబకేశ్వర్‌లో పూర్తి చేసి, బొంబాయిలో మెట్రిక్యులేషన్ ముగించాడు. ఫాల్కే 1885లో బొంబాయిలోని సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరి డ్రాయింగ్‌లో ఒక సంవత్సరం కోర్సు పూర్తి చేశాడు. 1886 ప్రారంభంలో అతను తన అన్నయ్య శివరంపంత్‌తో కలిసి బరోడాకు వెళ్ళాడు. బరోడా మహారాజా సయాజీరావ్ విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ ఫ్యాకల్టీ అయిన కళా భవన్‌లో చేరి 1890లో ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్ పెయింటింగ్‌లో కోర్సు పూర్తి చేశాడు. ఆర్కిటెక్చర్, మోడలింగ్‌లో కూడా ప్రావీణ్యం పెంపొందించుకున్నాడు. అదే సంవత్సరంలో ఫాల్కే ఒక ఫిల్మ్ కెమెరాను కొనుగోలు చేసి, ఫోటోగ్రఫీ, ప్రాసెసింగ్, ప్రింటింగ్‌పై ప్రయోగాలు చేయసాగాడు. 1892లో అహ్మదాబాద్‌లో జరిగిన పారిశ్రామిక ప్రదర్శనలో ఆదర్శవంతమైన థియేటర్ నమూనాను రూపొందించినందుకు అతనికి బంగారు పతకం లభించింది. ఓ అభిమాని ఆయనకు బహుమతిగా ఇచ్చిన ఖరీదైన కెమెరాను ఉపయోగిస్తూ, స్టిల్ ఫోటోగ్రఫీలో మరింతగా రాణించడానికి ప్రయత్నించాడు. 1891లో, ఫాల్కే సగం-టోన్ బ్లాక్స్, ఫోటో-లిథియో, మూడు-రంగుల సిరామిక్ ఫోటోగ్రఫీని తయారుచేసే పద్ధతులను తెలుసుకోవడానికి ఆరు నెలల కోర్సు చేశాడు.

1896లో బొంబాయిలోని వాట్సన్ హోటల్‌లో ప్రదర్శించబడిన సినిమాను చూసి, సినిమాలు తీయాలని భావించి, 1913లో తొలి చిత్రం "రాజా హరిశ్చంద్ర"ను రూపొందించాడు. ఈ సినిమానే మొట్టమొదటి భారతీయ చిత్రంగా, భారతదేశ మొట్టమొదటి పూర్తి నిడివి చలన చిత్రంగా పేరుగాంచింది. కానీ ఈ చిత్రం రూపొందడానికి వారి కుటుంబ సభ్యులు పడ్డ కష్టాలు మాత్రం మరువలేనివి. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని ఆ కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశాడు. ఫాల్కే భార్య సరస్వతి బాయి ఫాల్కే భారతీయ తొలి సినిమా 'రాజా హరిశ్చంద్ర' నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. ఆమె తన బంగారు ఆభరణాలనన్నింటినీ అమ్మి డబ్బు సమకూర్చడం వల్లనే 'రాజా హరిశ్చంద్ర' సినిమాను పూర్తిచేయగలిగారు.

'రాజా హరిశ్చంద్ర' చిత్రంతో మొదలైన ఫాల్కే సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే-రచయితగా 95 చిత్రాలను, 26 లఘు చిత్రాలను రూపొందించాడు. సినిమా రంగంలో ఎంతో ధనం సంపాదించినా అదంతా కూడా ఆయన సినీపరిశ్రమ అభివృద్ధికి, నూతన ప్రయోగాలకు తిరిగి ఖర్చు చేశాడు. భారతదేశంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ఫాల్కే ఎంతో కృషి చేశాడు. ఫాల్కే నుండి వెలువడిన ఆణిముత్యాలుగా 1913లో మోహిని భాస్మసుర్, 1914లో సత్యవన్ సావిత్రి, 1917లో లంకా దహన్, 1918లో శ్రీ కృష్ణ జన్మ, 1919లో కాలియా మర్దన్ లాంటివి మేటి చిత్రాలుగా పేరుగాంచాయి. సినీ పరిశ్రమలో వున్నన్నాళ్లు ఫాల్కే శ్రమను ఆ పరిశ్రమ గుర్తుంచుకోవలసిందే. అలాంటి బలమైన పునాది వేశాడు ఫాల్కే.

భారతీయ చిత్ర పరిశ్రమకు విశేష కృషి చేసి, ప్రపంచానికి భారతీయుల గొప్పదనాన్ని తెలియచేసిన దాదా సాహెబ్ ఫాల్కే 1944 ఫిబ్రవరి 16న నాసిక్‌లో...ఒక పేదవాడుగా, కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టిన వాడుగా, కేవలం తనకు ఇష్టమైన సినిమా ప్రపంచం కోసమే బతికినవాడుగా, సినిమా రంగంలోని వారు "మరిచిపోయిన" ఒంటరివాడుగా మరణించడం దురదృష్టకరం.

భారతీయ సినిమాకు పితామహుడుగా భావించబడే దాదాసాహెబ్ ఫాల్కే శతజయంతి సందర్భంగా 1969లో "దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని" భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారతీయ చిత్ర నిర్మాణ ప్రగతిలో ఎంతో కృషి చేసి, అద్భుత ప్రతిభాపాటవాలను కనబరిచే అతి కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే లభించే గౌరవం ఈ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు.

నటీనటులు, సంగీత దర్శకులు, ఛాయాగ్రాహకులు, గాయనీ గాయకులు, పాటల రచయితలు, దర్శకులు, నిర్మాతలు ఇలా చలన చిత్రాభివృద్ధికి విశిష్టంగా కృషి చేసిన ఎవరైనా ఈ అవార్డుకు అర్హులే. అందుకే చాలా అరుదైన వ్యక్తులు, ప్రతి క్షణం సినిమా పరిశ్రమ కోసం ఆలోచించే వారు, తమ జీవితాంతం పరిశ్రమనే నమ్ముకొని ఉన్నవారు మాత్రమే పొందే విశిష్ట పురస్కారమే ఈ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు. మొట్టమొదటి సారిగా 1969లో ప్రకటించిన ఈ పురస్కారాన్ని దేవికా రాణికి అందచేశారు.

1938లో భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదా సాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా ప్రజల్లో కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి, అప్పటికప్పుడు వేదికపై ఐదు వేల రూపాయల పర్స్ అందజేశారు. ఆ డబ్బుతో అందరి ఒత్తిడి వల్ల నాసిక్‌లో ఒక ఇంటిని కొన్నాడు ఫాల్కే. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు. భారతీయ సినీ పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే ఇప్పటికీ ఎందరికో స్ఫూర్తిప్రదాత.

/ వ్యాసకర్త రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సెల్ : 9963499282 /

రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడిని వ్యతిరేకించండి

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాజ్యాంగ మౌలిక స్వరూపాలైన ఫెడరలిజం, సెక్యులరిజం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయవ్యవస్థలపై దాడి జరుగుతుందని, ఇటువంటి వాటిని తిప్పి కొట్టాలని శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని మెడికల్ హాలులో శ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, తణుకు స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ-కర్తవ్యాలు' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2029 నాటికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కొనసాగిస్తారా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రాథమిక హక్కుల ద్వారా ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించాలని, సంక్షేమ రాజ్యస్థాపన జరగాలని, భారతదేశ భిన్నత్వమే సమగ్రతగా కాపాడబడాలని రాజ్యాంగం నిర్దేశించిందన్నారు. కాని ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థలపైనే దాడి జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నేటి కేంద్ర పెద్దలు మాట్లాడుతున్నారన్నారు. మైనార్టీ, దళితులపై దాడులు గత పదేళ్ల కాలంలో పెరిగిపోయాయన్నారు. మణిపూర్‌లో రిజర్వేషన్ల పేరుతో కుకీలు-మొయితీల మధ్య చిచ్చు రాజేయడమే దీనికి ఉదాహరణ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో మతపరమైన విభజన తెచ్చి ఓటు బ్యాంకు రాజకీయాలకు తెగబడుతూ సెక్యులర్ స్వభావానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలని రాజ్యాంగం లౌకికతత్వాన్ని ప్రబోధించిందని, కాని ఏక పౌరసత్వ సిఎఎ, ఎన్ఆర్‌సిల అమలుకు పూనుకుంటుందని విమర్శించారు. సెక్యులర్ అన్న పదాన్నే సహించలేకపోతున్నారని, అందుకే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నాలను మేధావులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు, ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో శ్రీ సేవా విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు పి.దక్షిణామూర్తి, ప్రముఖ సామాజికవేత్త, తణుకు స్టడీ సర్కిల్ కన్వీనర్ దివిటిఎస్.వర్మ, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఉభయగోదావరి జిల్లాల కార్యదర్శి కావూరి మునిస్వామి, ఎండి అబ్దుల్ రహమాన్, పేరూరి మురళీకుమార్, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తోటపల్లి, రామతీర్థ సాగర్‌పై నిర్లక్ష్యం

- అరకొరగా నిధులు కేటాయించిన వైసిపి, టిడిపి ప్రభుత్వాలు
- నేటికీ పెండింగ్‌లోనే పనులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో విజయనగరం జిల్లాను ప్రభావితం చేసే వ్యవసాయం, సాగునీటి రంగాలను తామే ఉద్ధరించామంటూ టిడిపి, వైసిపి నేతలు ఎవరికివారే గొప్పలు చెప్పుకుంటున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో. తోటపల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో రూ.582.21 కోట్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.357.47 మాత్రమే విడుదలయ్యాయి. రామతీర్థసాగర్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.120.3 కోట్లు ఖర్చయ్యాయి. ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో 189.78 కోట్లు విడుదలయ్యాయి. 64 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు కొత్తగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రూ.450 కోట్ల అంచనా వ్యయంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును 2004లో చేపట్టారు. ఇప్పటి వరకు రూ.940.12 కోట్లు ఖర్చయింది. 2004 నుంచి 2014 మధ్య అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ.582.21 కోట్లు ఖర్చు చేశాయి. 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.285.47 కోట్లు వెచ్చించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి మరింత రూ.72 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో, ఏటేటా అంచనా వ్యయం పెరిగిపోయింది. కాలువపై అనేక చోట్ల స్ట్రక్చర్లు, పిల్ల కాలువల నిర్మాణాలు, భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస చర్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో, లక్ష్యానికి అనుగుణంగా సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

24 వేల ఎకరాలకు సాగు నీరు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీటి సరఫరా కల్పించే లక్ష్యంతో 2005లో తలపెట్టిన తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు 310.08 కోట్లు ఖర్చు చేశారు. వైసిపి ప్రభుత్వం రూ.86.2 కోట్లు మాత్రమే ఇచ్చింది. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం రూ.103.58 కోట్లు ఖర్చు చేసింది. మిగిలిన నిధులు అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఖర్చు చేశారు. రామతీర్థసాగర్ పనులు నేటికీ కొనసాగుతున్నాయి.



అసంపూర్తిగా ఉన్న రామతీర్థ సాగర్ ప్రాజెక్టు

అగ్రిగోల్డ్ బాధితులు వైసిపికి ఓటు వేయొద్దు

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులను మోసగించిందని, ఆ బాధితులెవరూ వైసిపి ప్రభుత్వానికి ఓటు వేయొద్దని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇవి నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చి ఇప్పటికీ బాధితులకు న్యాయం చేయలేదన్నారు. చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితులకు ఇంతవరకు కూడా ఒక్కరూపాయి కూడా చెల్లించలేదన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా అగ్రిగోల్డ్ బాధితుల అంశాన్ని లేవనెత్తకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రూ.20 వేల కోట్ల ఆస్తులను సిఐడి అటాచ్మెంట్ చేసి ఉండీ కూడా కనీసం రూ.7 వేల కోట్లు బాధితులకు ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తుందని ప్రశ్నించారు. యజమాన్యానికి తొత్తులుగా వైసిపి ప్రభుత్వం తయారైందని విమర్శించారు. కావున అగ్రిగోల్డ్ బాధితులంతా రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలనే విషయాన్ని త్వరలో రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తుందని, దానికి బాధితులు అంతాకట్టుబడి ఉంటామని అన్నారు. దీనిపై త్వరలో జిల్లా, నియోజకవర్గ కమిటీలు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆర్వీస్ కుమార్, జిల్లా కార్యదర్శి సాలాపు అనంతరావు, పార్వతీపురం బ్రాంచి కార్యదర్శి బివి రమణ, నాయకులు సత్యానంద్ పాల్గొన్నారు.

2,5 తేదీల్లో ...

ఎపిఆర్ సెట్ ప్రవేశ పరీక్షలు : కన్వీనర్

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

ఎపిఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మే 2 నుంచి 5వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎపిఆర్ సెట్ 2023-24 కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తెలిపారు. తిరుపతిలోని ఎస్‌వి యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచీ 4.30 గంటల వరకూ రెండు దశలుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 వ తేదీ నుంచీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్ సైట్ నుంచీ హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చని సూచించారు. హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఎంపిక చేసిన 17 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 10 వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు చెప్పారు. వేసవి తీవ్రతను దష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మే 20 వ తేదీ నాటికి ఫలితాలు వెల్లడించి, జూన్ లో ఇంటర్వ్యూలు చేపడతామని వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కుసుమ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగ

- మూడో విడత ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం : నిపుణులు
- రానున్న ఐదు రోజులు పలు రాష్ట్రాల్లో వేడిగాలులు :ఐఎండి

న్యూఢిల్లీ: దేశంలో మూడో దశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్నది. ఇలాంటి తరుణంలో రానున్న ఐదు రోజుల్లో పలు రాష్ట్రాల్లో వేడిగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. కీలక ఎన్నికల వేళ అధిక ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ పార్టీలు చేసే పోల్ ప్రచారాలలో వేలాది మంది ప్రజలు ఈ తీవ్ర ఎండల్లోనే పాల్గొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సామాజికవేత్తలు అంటున్నారు. మే 7న ఓటింగ్ జరిగే అనేక రాష్ట్రాల్లో, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్, కర్నాటక, కేరళ, గోవా, తూర్పు యూపీలలో వేడిగాలులు ఉండే అవకాశం ఉన్నందున, మూడో దశ ఎన్నికలలో పాల్గొనటానికి భారతీయ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ స్టేషన్ సిబ్బందిని సురక్షితంగా ఉంచేందుకు పార్టీలు, అధికారులు మరింత కృషి చేయాలని ఎన్నికల సంఘం (ఇసి) కోరింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు వడదెబ్బ గురయ్యే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. సోలార్‌లో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్ ఉన్నది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మండుతున్న వేడిగాలులు రోజువారీ జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఉష్ణోగ్రతలు భయంకరమైన స్థాయికి పెరుగుతాయని అంచనా. కేరళలోని కొల్లం, త్రిసూర్, పాలక్కాడ్‌లలోనూ ఐఎండి హీట్ వేవ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఈరోజు చాలా చోట్ల హీట్ వేవ్ పరిస్థితులు ఉంటాయని తెలిపింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మూడో విడత పోలింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ప్రజలు లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. తలపై టోపీ లేదా గుడ్డ కప్పుకోవాలి. ఎండలో ఎక్కువగా ఉండకూడదు. "ఎల్లప్పుడూ పుష్కలంగా ద్రవపదార్థాలు, నీటిని తీసుకోవాలి. రోజువారీ సూచనలతో పాటు భారత వాతావరణ శాఖ సలహాలను గమనించాలి, పాటించాలి" అని భారత వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. కాబట్టి ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలనీ, పాలనా యంత్రాంగాలు ఎండల విషయంలో సీరియస్‌గా దృష్టిని సారించి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మోడీ కాళ్లు మొక్కే పార్టీలను సాగనంపాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇప్పటికే అమ్మకానికి పెట్టిందని, మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలనూ అదానీ, అంబానీలకు అమ్మేందుకు సిద్ధపడుతోందని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు, ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుతున్న వారికి ఈ ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. ప్రత్యేక హోదా కోసం మొదటి నుంచీ సిపిఎం, సిపిఐ మాత్రమే పోరాడుతున్నాయని గుర్తు చేశారు. మోడీ మళ్లీ అధికారంలోకొస్తే భవిష్యత్తులో ఎన్నికలు జరిగే పరిస్థితి ఉండదన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు గతంలో స్టీల్‌ప్లాంట్‌పై ప్రగల్భాలు పలికాయని, ఆ పార్టీల నాయకులు నేడు మోడీకి దాసోహం అయ్యారని విమర్శించారు.

బిజెపిని, దాని అనుకూల పార్టీలను ఓడించాలి

బిజెపిని, దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని వడ్డే శోభనాదీశ్వరరావు కోరారు. గాజువాకలోని ఎస్‌బిటి హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి మళ్లీ గెలిస్తే రాజ్యాంగానికి తీవ్ర హాని తలపెడుతుందన్నారు. గడిచిన పదేళ్లలో విభజన చట్టంలోని ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోను ఏర్పాటు అమలు కాలేదని తెలిపారు. ఇండియా వేదిక అధికారంలోకొస్తే ఇవన్నీ సాధ్యమవుతాయని చెప్పారు. విలేకర్ల సమావేశంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.విజయరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని ప్రాంతంలో తాను కబ్జా చేసేందుకు భూములు లేకపోవడంతో విశాఖకు వెళ్లాలని అనుకుంటున్నారని వివరించారు. సిఎఎకు వైసిపి, టిడిపి రెండూ మద్దతునిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, భూ మాఫియా ఎక్కువైందని, వాటి ద్వారా దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో ప్రలోభాలకు దిగుతున్నారని విమర్శించారు. బిజెపి నాయకులకు దేవుని హుండీపై భక్తి ఎక్కువని ఎద్దేవా చేశారు. బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించాలని కోరారు. మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ దేశ రాజకీయ ప్రస్తుత పరిస్థితులు పోరాడే శక్తులకు ఊతం ఇచ్చేలా ఉన్నాయన్నారు. ఎన్నికల బాండ్ల కుంభకోణం చాలా పెద్దదని, ఇందులో కేంద్ర కేబినెట్ మొత్తం ఉండడం దారుణమని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై ఇడి, సిబిఐ దాడులు ఎక్కువయ్యాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు చాలా కీలకమన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ తిరుపతి ఎంపి అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చి దేశాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. తిరుపతి సిపిఐ అభ్యర్థి పి.మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పిఐ అధ్యక్షులు అంజయ్య పాల్గొన్నారు. దీనికి ముందు తిరుపతి సిపిఐ అభ్యర్థి పి.మురళికి మద్దతుగా సుందరయ్య నగర్‌లో బివి.రాఘవులు ప్రచారం నిర్వహించారు.

రాజస్థాన్‌లో ఇమామ్ దారుణ హత్య

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఓ ఇమామ్‌ను ముగ్గురు దుండగులు దారుణంగా హత్య చేశారు. శనివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌గంజ్‌లోని కంచన్ నగర్‌లో ఉన్న మసీదులో మొహమ్మద్ మహిర్ (30) ఆరుగురు పిల్లలతో కలిసి నిద్రిస్తుండగా, కర్రలతో వచ్చిన ముగ్గురు దుండగులు తీవ్రంగా కొట్టారు. వారు ముసుగులు ధరించి ఉన్నారని, ఇమామ్‌తో పాటు నిద్రిస్తున్న బాలురిని బెదిరించారని పోలీసులు తెలిపారు. మొబైల్ ఫోన్ కూడా తీసుకుని పరారయ్యారని ఆయన చెప్పారు. తర్వాత బాలురు పొరుగువారికి సమాచారం అందించడంతో అతనిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు తెలిపారు. మహమ్మద్ మహిర్ ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పురా ప్రాంతానికి చెందిన వాడని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు.

అఫిడవిట్‌లో తప్పులపై హైకోర్టుకెళ్తాం : ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా)

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అఫిడవిట్‌లో కనబరచని కేసులపై హైకోర్టుకు వెళ్తామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆమె సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సవితమ్మ అఫిడవిట్‌లో 17 కేసులు ఉన్నట్లు ప్రకటించారని, అవికాకుండా సొంత వదిన పద్మనారాయణరెడ్డి మీద గృహహింసకు సంబంధించిన కేసును, ఆమె తల్లి గాయిత్రిదేవి ఆస్తికి సంబంధించి పెట్టిన కేసు వివరాలను అఫిడవిట్‌లో చూపలేదన్నారు. సవితమ్మపై ఆంధ్రాలోనే కాకుండా కర్నాటకలో కూడా కేసులున్నాయని గుర్తుచేశారు. ఛీటింగ్, ఫోర్జరీ, 420 కేసులు ఉన్నట్లు సవితమ్మ తన అఫిడవిట్‌లో స్వయంగా పేర్కొన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. లేపాక్షి, బెంగళూరు, రొద్దం, కియా పోలీస్ స్టేషన్లలో కూడా సవితమ్మపై కేసులు ఉన్నాయన్నారు. సొంత కుటుంబానికి న్యాయం చేయలేని సవితమ్మ నియోజకవర్గ ప్రజలకు ఏమి న్యాయం చేస్తుందని మండిపడ్డారు.

ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలు

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ బెంగళూరులో మాట్లాడుతూ.. ప్రజ్వల్ దేశం విడిచి పారిపోవడం సిగ్గుచేటన్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కావాలని మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేశారని ప్రజ్వల్ ఆరోపించారు.

జెడి(ఎస్) నుంచి సస్పెండ్ చేస్తాం : కుమారస్వామి

ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని జెడి(ఎస్) నాయకులు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి సోమవారం తెలిపారు. 'ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం. రేపు హుబ్బళ్లిలో జరిగే కోర్ కమిటీ సమావేశంలో సిఫార్సు చేయాల్సి ఉంది. ప్రజ్వల్ ఎంపి కాబట్టి ఈ విషయంపై జెడి(ఎస్) జాతీయ అధ్యక్షులు, మాజీ ప్రధానమంత్రి దేవెగౌడకు విజ్ఞప్తి చేశాను' అని చెప్పారు. ప్రజ్వల్ అఘాయిత్యాల విషయం తనకు కాని, దేవెగౌడకు కాని తెలియదని చెప్పారు.

కఠిన చర్యలు తీసుకోండి : ఐద్వా,
ముందే తెలిసినా చర్యలు తీసుకోని బిజెపి

ప్రజ్వల్ దుశ్చర్యలపై ఐద్వా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజ్వల్ దుశ్చర్యల గురించి బిజెపి పెద్దలకు ముందే తెలుసునని పేర్కొంది. అతని పెన్‌డ్రైవ్‌లో మూడు వేలకు పైగా అభ్యంతరకర వీడియోలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో జెడి(ఎస్)తో పొత్తు పెట్టుకుంటే బిజెపికే నష్టమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులకు సీనియర్ నాయకులు దేవరాజ గౌడ డిసెంబరు 23నే లేఖరాశారు. ఇది ఇప్పుడు బయటకు రావడంతో బిజెపి తీవ్ర ఇరకాటంలో పడింది. ముందే తెలిసినా బిజెపి నేతలు దీనిపై నోరుమెదపకపోవడం ప్రజ్వల్ దుశ్చర్యలకు మద్దతు ఇవ్వడమేనని ఐద్వా విమర్శించింది. జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఐద్వా పేర్కొంది. ప్రజ్వల్‌ను వెంటనే స్వదేశానికి తీసుకొచ్చి, అతడిపైన, అతని తండ్రి హెచ్ డి రేవణ్ణ పైనా సత్వరమే కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. లైంగిక నేరస్థులకు ప్రధాన పార్టీలు ప్రాధాన్యత ఇవ్వవద్దని కోరింది.

పన్నూ హత్యకు రా మాజీ అధికారి విక్రమ్ కుట్ర

- వాషింగ్టన్ పోస్ట్ వెల్లడి

న్యూఢిల్లీ : అమెరికా గడ్డపై ఖలిస్తాన్ అనుకూల ఉద్యమ నాయకుడు గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ హత్యకు భారత ప్రభుత్వ అధికారి ఒకరు కుట్ర పన్నారని అమెరికా అధికారులు ఆరోపించిన వ్యక్తి పేరును వాషింగ్టన్ పోస్ట్ తన తాజా రిపోర్టులో వెల్లడించింది. పన్నూ హత్యకు కుట్ర పన్నింది రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) మాజీ అధికారి విక్రమ్ యాదవ్ అని తెలిపింది. పన్నూ హత్యకు కుట్ర జరుగుతున్న సమయంలో రా చీఫ్‌గా ఉన్న సమంత్ గోయల్ తీవ్ర ఒత్తిడిలో ఉండేవారని కూడా వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. 'విదేశాల్లో ఉన్న సిక్కు ఉగ్రవాదులను అంతం చేయాలని గోయల్‌పై తీవ్ర ఒత్తిడి ఉండేది' అని పత్రిక తెలిపింది. విదేశాల్లో ఉన్న సిక్కు నాయకులను అంతం చేయడానికి రా చేస్తున్న కుట్రల గురించి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు సమాచారం తెలిసే ఉంటుందని కూడా పత్రిక పేర్కొంది.

అమెరికా గడ్డపై పన్నూ హత్యకు ఒక గుర్తు తెలియని భారత అధికారి కుట్ర పన్నాడని గత ఏడాది నవంబర్‌లో అమెరికా ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. వారి వాదనల ప్రకారం పన్నూను హత్య చేయడానికి ఒక కిల్లర్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను విక్రమ్ యాదవ్‌కు అతనిపై అధికారులు అప్పగించారు. విదేశాల్లో ఉన్న సిక్కు నాయకులను అంతం చేయడానికి మోడీ ప్రభుత్వం 'రా'ను ఒక ఆయుధంగా వినియోగించుకుందని వాషింగ్టన్ పోస్ట్ ఆరోపించింది. అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలపై విచారణ చేయడానికి ఒక ఉన్నతస్థాయి కమిటీని మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అయితే కమిటీ కూర్పు, దాని దర్యాప్తు స్థితి గురించి ఎవరికీ తెలియదని వాషింగ్టన్ పోస్ట్ విమర్శించింది.




మీ కోసం

మినపప్పలో రెండు చుక్కల నూనె వేసి బాగా కలిపి నానబెడితే పొట్టు త్వరగా ఊడుతుంది.

జీవన సౌరభం

పని చేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు. కానీ, అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

మధురమైన రంగులు



రంగులు రంగులు
ఎన్నో రంగులు
ఆకుపచ్చ నాకెంతో ఇష్టం
ఆకుపచ్చని జామ ఆరోగ్యానిచ్చు!

రంగులు రంగులు
ఎన్నో రంగులు
ఎరుపంటే నాకెంతో ఇష్టం
ఎర్రని రేగుపండు ఎంతో రుచి!

రంగులు రంగులు
ఎన్నో రంగులు
పసుపు రంగు నాకెంతో ఇష్టం
పసుపురంగు మామిడి ఎంతో మధురం!


రంగులు రంగులు
ఎన్నో రంగులు
నారింజ రంగు నాకెంతో ఇష్టం
నారింజరంగు సంత్రాలెంతో తియ్యన!

రంగులు రంగులు
ఎన్నో రంగులు
ఉదా రంగంటే నాకెంతో ఇష్టం
ఉదారంగు నేరేడు వంటికెంతో మేలు!

రంగులు రంగులు
ఎన్నో రంగులు
గోధుమ రంగంటే నాకెంతో ఇష్టం
గోధుమ రంగు సపోట ఎంతో కమ్మన!

రంగులు రంగులు
ఎన్నో రంగులు
తెలుపు రంగంటే నాకిష్టం
తెల్లని తాటిముంజలెంతో చల్లన!

- డా.నీరజ అమరవాది,
9849160055.



e p ar	
o t a mo o	
a m g o n	
t o p ao t	
twelo arnem	
o i n n o	
apine lplep	
n t o cu co	


సరి చేయండి

పిల్లలూ ఇక్కడ కొన్ని పండ్లు, వాటికెదురుగా గజిబిజిగా కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిని సరైన క్రమంలో రాస్తే ఆ పండ్ల పేర్లు వస్తాయి. ట్రై చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



కూండ్రపు మౌనిక,
1వ తరగతి,
ఎంపీపీస్, గొంపవానిపాలెం,
కే.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కష్టజీవి కాళ్లకు చెప్పులు 'జోడి'ద్దాం!



మండే ఎండలో ఎంతసేపు ఉంటాం! ఎండ వేడికి తాళలేక ఏ చెట్టు నీడనో, వంతెన కిందో తలదాచుకునే వారు ఎంతోమంది. కానీ అదే ఎండలో, నిప్పల కొలిమిలా భగభగ మండే సూర్యకిరణాల కింద రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే కార్మికులెంతోమంది. కాసేపు వారి వంక తీక్షణంగా చూస్తే, చాలామందికి భరించరాని ఎండ, వారికి పెద్ద విషయం కానట్లు పనిచేసుకుపోతారు. ఇంకాస్త నిశితంగా పరిశీలిస్తే, చిరిగిన బట్టలు, కమిలిన రంగులో శరీరం, చెమటతో తడిసిన బట్టలు, బొబ్బలెక్కిన చేతులు హృదయాన్ని కదిలిస్తాయి. ఇంకా బాధాకరమైన విషయమేమంటే అంత ఎండలో కాళ్లకు చెప్పుల్లేకుండా పనిచేయడం. ఎప్పుడో ఒకసారి, ఎక్కడో ఓ చోట ఈ దృశ్యం మన కంటపడుతూనే ఉంటుంది. 'అయ్యో పాపం' అనుకుంటామే కానీ, 'అంతకుమించి ఏం చేయలేం' అని మనసుకి సర్ది చెప్పకుని, అక్కడి నుండి ముందుకు కదులుతాం. కానీ ఉత్తరప్రదేశ్‌కి చెందిన కొంతమంది యువకులు అలా చూస్తూ ఊరుకోలేదు. అలాగని వారి జీవితాలలో గొప్ప గొప్ప మార్పులూ తేలేదు. ఆ శ్రామికులకు ఒక్క జత చెప్పలు ఇస్తున్నారంతే. ఇది వినడానికి చాలా చిన్న విషయంలా ఉంటుంది. కానీ దీనిచుట్టూ పెనవేసుకున్న విషయాలు మనసున్న ప్రతి మనిషికీ కన్నీళ్లు పెట్టిస్తాయి.

ఆకాశాన్ని అంటే భవంతుల మధ్యే నేలనంటి పెట్టుకున్న పూరి గుడిసెలు కనిపిస్తాయి. ముప్పై రకాల వంటకాలతో ఎక్కాదిక్కా తిని తేన్పే మనుషుల మధ్యే, కాసిన్ని గంజినీళ్ల కోసం రోజుల తరబడి ఎదురు చూసే ప్రాణులు వుంటారు. ఈ దయనీయ స్థితిలో ఒక్క జత చెప్పులు కొనుక్కోవడం వారికి తీరని కోరిక. పూట గడవని పేదల జీవితాల్లో మార్పు తేవాలని ఎంతోమంది ఎన్నో రకాలుగా కృషిచేస్తారు. విద్య, ఉపాధి ఇస్తుంటారు. అలాంటి వారిలో దివ్యాన్ష ఒకరు. 'హోప్ వెల్ఫేర్ ట్రస్టు' ద్వారా ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా ఆ ప్రజల విద్య, ఉపాధి, మహిళా సాధికారత, ఆరోగ్యం, పరిశుభ్రతపై ఆయన అవగాహన తెస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాల్లో భాగంగా ఆ ప్రాంతాలను తరచూ సందర్శించిన దివ్యాన్ష ఈ వేసవిలో ఒక్క జత చెప్పుల కోసం రూ.వంద విరాళం ఇవ్వండి అని ప్రచారం చేస్తున్నారు. వచ్చిన నిధులతో ఆ ప్రజలకు చెప్పులు పంపిణీ చేస్తున్నారు. పాదరక్షల ఉత్పత్తిలో స్థానిక మహిళలను భాగస్వామ్యం చేసి వారికి ఉపాధి కూడా చూపిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ మిర్జాపూర్‌లో బహరి అటవీ ప్రాంతానికి ఆనుకుని కొన్ని గ్రామాలు ఉన్నాయి. అక్కడ ఎండాకాలం సూర్య కిరణాల తాకిడికి భూమి లావాలా ఉడుకుతుందా అన్నంత వేడిగా ఉంటుంది. అయినా, అంత వేడిలో ఆ గ్రామాల ప్రజలు అడవిలోకి వెళ్లి వంటచెరకు సేకరిస్తారు. మధ్యాహ్న వేళ, సున్నపురాళ్ల క్వారీలో పనిచేస్తారు. రాత్రి వేళ కట్టెలన్నింటినీ మోపులు కట్టుకుని విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళతారు.

70 ఏళ్ల శ్యాంబాబు కొన్ని దశాబ్దాలుగా ఏ మార్పూ లేకుండా ఈ పనే చేస్తున్నాడు. ఉదయం వేళ అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకురావడం, మిట్టమధ్యాహ్నం వేళ కనీసం కాళ్లకి చెప్పుల్లేకుండా రాళ్లు కొట్టడం అతని దినచర్య.

'ఒక జత చెప్పులు కూడా కొనుక్కోలేవా?' అని ఎవరైనా అడిగితే.. 'రోజు మొత్తం కష్టపడితే రూ.80 వస్తాయి. ఆ డబ్బులతో తిండి గింజలే కొనుక్కోనా? చెప్పులే కొనుక్కోనా?' అని ఎదురు ప్రశ్న వేస్తాడు. శ్యాంబాబు లాంటి వృద్ధులు అక్కడ ఎంతోమంది. రెండు పూటలా తిండి తినడం కోసం ముళ్ల పొదల్లో, పదునైన రాతి నేలల్లో పాదాలు రక్తం కారుతున్నా అదే పనిగా పనిచేసుకుపోతారు. 'గాయాలవుతాయని నేను సొంతంగా చెప్పులను తయారుచేసుకుంటాను. ఆకులతో నా పాదాలను చుట్టేసి, తాళ్లతో బంధిస్తాను, అడవిలోకి వెళ్లేంత వరకు ఇవి నాకు







ఉపయోగపడతాయి. ఎప్పుడైతే, ముళ్లపొదలు, రాళ్ల గుట్టలు ఎదురవుతాయో, కాళ్లకు చుట్టుకున్న ఆకులు చిరిగిపోతాయి. మధ్యాహ్నం నాటికి వాటి రూపురేఖలు అసలు ఉండవు. అవి లేవని నా పని ఎలా ఆపను? అందుకే వాటితో సంబంధం లేకుండా పని చేసుకుంటాను' అని బాధనంతా పంటిబిగువున బిగబట్టి పైకి నవ్వుతూ సమాధానమిచ్చాడు శ్యాంబాబు. దశాబ్దాలుగా అతను ఈ పనే చేయడం వల్ల కాళ్లు కొయ్యబారిపోయాయి. బొబ్బలతో అరికాళ్లు రాటుదేలిపోయాయి. పాదాలే కాదు, కాలంతా నల్లగా, పగుళ్లతో కనిపిస్తోంది. ఆ ప్రాంతంలో శ్యాంబాబు లాంటి వాళ్లే కాదు, మహిళలు కూడా కాళ్లకు చెప్పుల్లేకుండా రోజంతా కష్టపడతారు. స్కూలుకు వెళ్లే పిల్లలు కూడా రాళ్ల దారిలో చెప్పుల్లేకుండా నడుస్తారు.

బెనారస్ యూనివర్శిటీలో న్యాయవాద విద్య అభ్యసిస్తున్న దివ్యాన్ష ఉపాధ్యాయ ఈ ప్రాంతం వాడే. చిన్నప్పటి నుండి తన చుట్టూ ఉన్న వారు పడుతున్న బాధలను ప్రత్యక్షంగా చూశాడు. పెద్దాయ్యాక, ఈ పరిస్థితిలో మార్పు తేవాలని లక్ష్యం పెట్టుకున్నాడు. అలా 2015లో తన స్నేహితుడు రవి మిశ్రాతో కలసి 'హోప్ వెల్ఫేర్ ట్రస్ట్'ని నిర్వహిస్తున్నాడు. 9 ఏళ్ల క్రితం ఇద్దరు వ్యక్తులతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమాల్లో, ఇప్పుడు పదుల సంఖ్యలో మిత్రబృందాలు చేతులు కలిపాయి. బెనారస్ హిందూ యూనివర్శిటీ, ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులు కూడా దివ్యాన్ష మిత్రద్వయంతో కలిశారు.

ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టిన తరువాత ఆ యువకులకు ఎన్నో ప్రతిబంధకాలు, మరెన్నో అవరోధాలు. 'ఒక్క జత చెప్పులు ఇచ్చి వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపుతారా?' అన్న వ్యాఖ్యానాలు, వంద రూపాయలకు ఎక్కడి నుండి చెప్పులు తీసుకువస్తారు? ఆ డబ్బంతా ప్రయాణాలకే ఖర్చయిపోతుంది. అన్న సూటిపోటి మాటలు ఎదురయ్యాయి. అయితే ఇవే ప్రశ్నలకు రాళ్ల క్వారీలో శ్యాంబాబుతో పాటు పనిచేస్తున్న 25 ఏళ్ల వికాస్ చాలా ఆవేశంగా సమాధానలు చెబుతున్నాడు. 'ఈ చెప్పులు మా జీవితాలను ఉద్ధరించవు. అయితే ఇవి మమ్మల్ని ముళ్ల పొదల నుండి రక్షిస్తాయి. ఎండకు కాళ్లు మలమల మాడిపోకుండా కాపాడతాయి. రాళ్ల క్వారీలో రాళ్లు గుచ్చుకుంటాయన్న భయం లేకుండా నేను చాలా వేగంగా నడవగలను' అంటూ చెబుతున్న వికాస్ మాటలు వింటుంటే ఆ చెప్పుల జత వారికి ఎంత ముఖ్యమో అర్థమవుతుంది!

1 నుంచి 'గేమ్ చేంజర్' తుది షెడ్యూల్



హీరో రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ మూవీ తర్వాత రామ్ చరణ్ చేస్తున్న సినిమా కావటంతో గేమ్ ఛేంజర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా విడుదల చేసిన 'జరగండి' అనే పాటను విడుదల చేసిన విషయం తెలిసిందే. మే మొదటి వారంలో చెన్నైలో కీలక షెడ్యూల్ ప్రారంభంకానుంది. ఈ షెడ్యూల్‌లో నవీన్ నచంద్ర, సునీల్, కియారా అద్వానిలపై ప్రీ క్లైమాక్స్ ఘట్టాలు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. రాజకీయాల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ ద్విపాత్రాభినయం చేస్తుండగా అంజలి, కియారా జంటగా నటిస్తున్నారు. మే1 నుంచి తుది షెడ్యూల్ చైన్నె ప్రాంతంలో ప్రారంభమవుతుండగా యాక్షన్, కొన్ని కామెడీ సీన్స్ తెరకెక్కించనున్నట్లు సమాచారం. జూలైలో పూర్తి చేసి దసరా లేదా దీపావళికి గాని విడుదల చేయాలని చిత్ర నిర్మాతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కి 'మా ఊరి పొలిమేర-2'



సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, దేవయాని శర్మ, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటించిన 'మా ఊరి పొలిమేర-2' సినిమా ఏప్రిల్ 30, 2024న న్యూ ఢిల్లీలో జరగనున్న ప్రతిష్టాత్మకమైన 14వ దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఎంపికైంది. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంను శ్రీ కృష్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై గౌర్ కృష్ణ నిర్మించారు. గ్యాని సంగీత దర్శకుడుగా వ్యవహరించారు. బాలాదిత్య, చిత్రం శీను, రవివర్మ, రాకేందు మౌళి, సాహితీ దాసరి ఇందులో కీలక పాత్రల్లో నటించారు.

'ఆ ఒక్కటి అడక్కు' ఫ్యామిలీ ఎంటర్ టైనర్



అల్లరి నరేష్ హీరోగా మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఆ ఒక్కటి అడక్కు'. రాజీవ్ చిలక ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తున్నారు. మే 3న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో దర్శకుడు మల్లి అంకం చిత్ర విశేషాలను పంచుకున్నారు. 'ఆ ఒక్కటీ అడక్కు' ఈ కథకు యాప్ట్ టైటిల్. పెళ్లి చుట్టూ ఎలాంటి ఎమోషన్స్ వుంటాయి? ఆ ఎమోషన్స్‌ని కొందరు ఎలా క్యాష్ చేసుకుంటారు? ఇలాంటి అంశాలను చాలా వినోదాత్మకంగా చూపిస్తూనే ఎమోషనల్ కనెక్ట్ అయ్యేలా ప్రెజెంట్ చేశాం. ఇందులో వుండే కంటెంట్ అందరూ కనెక్ట్ అయ్యేలా వుంటుంది. ఇది అందరినీ అలరించే మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్. ఇందులోని కామెడీ, ఎమోషన్ ఆడియన్స్‌ని హత్తుకునేలా వుంటాయి. నరేష్ గారిని అమ్మిరాజు గారి ద్వారా కలిశాను. అప్పటికే ఆయన నాలుగు సినిమాలతో బిజీగా వున్నారు. కామెడీ కథ అనే సరికి మొదట అంత ఉత్సాహం చూపించలేదు. అయితే నేను కథ చెప్పడం మొదలుపెట్టాను. ఫస్ట్ హాఫ్ విని 'ఈ కథ మనం చేసేద్దాం' అన్నారు. నరేష్ గారి క్యారక్టరైజేషన్, పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తాయి. ఫారియా పాత్ర ఇందులో చాలా కీలకంగా వుంటుంది. కథ ఆమె పాత్ర ద్వారానే మలుపు తిరుగుతుంది. ఫరియాలో మంచి కామెడీ టైమింగ్ వుంది. చిలక ప్రొడక్షన్ రాజీవ్ గారు చాలా సపోర్ట్ చేశారు. ఈ కథకు కావాల్సిన బడ్జెట్‌ని సమకూర్చారు. జామీ లివర్ ఇందులో నరేష్ గారి తమ్ముడి భార్య పాత్రలో కనిపిస్తారు. ఆ పాత్ర చాలా హిలేరియస్‌గా వుంటుంది." అని వివరించారు.

ఢిల్లీని కట్టడి చేసిన 'వరుణ్'

ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతా ఘన విజయం



న్యూఢిల్లీ: వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచి జోరుమీదున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు కోల్‌కతా నైట్‌రైడర్స్ కళ్లెం వేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని కేవలం 153పరుగులకే పరిమితం చేసిన కోల్‌కతా.. ఆ లక్ష్యాన్ని 16.3ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఢిల్లీని కట్టడి చేయడంలో వరుణ్ చక్రవర్తి(3/16) కీలకపాత్ర పోషించగా.. వైభవ్ అరోరా(2/29), హర్షిత్ రాణా(2/28) తమవంతు సహకారం అందించారు. ఇక ఛేదనలో కోల్‌కతా ఓపెనర్ సాల్ట్(68; 33బంతుల్లో 7ఫోర్లు, 5సిక్సర్లు) అర్ధసెంచరీతో మెరిసాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తికి లభించింది. అంతకుముందు సొంత వేదికపై భారీస్కోర్ చేయడంలో ఢిల్లీ విఫలమైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు కోల్‌కతా బౌలర్ల ధాటికి 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 153పరుగులు చేసింది. తొలుత పేసర్లు టాపార్డర్‌ను కూల్చగా.. మిస్టరీ వరుణ్ చక్రవర్తి(3/16) ఇక తన వంతు అన్నట్టు మిడిలార్డర్ పని పట్టాడు. అయితే.. చివర్లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (35నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో ఢిల్లీ పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది. ఢిల్లీకి తొలినుంచే కష్టాలు మొదలయ్యాయి. వైభవ్ అరోరా, స్టార్క్ నిప్పులు చెరగడంతో ఓపెనర్ పృథ్వీ షా(13), చిచ్చరపిడుగు జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(12), షాయ్ హోప్(7), యువకెరటం అభిషేక్ పోరెల్(18)లు డగౌట్‌కే చేరారు. ఆ తర్వాత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తొలి బంతికే కెప్టెన్ రిషభ్ పంత్(27)ను బోల్తా కొట్టించాడు. వాళ్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. దాంతో, వంద లోపే సగం వికెట్లు కోల్పోయింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న ట్రిస్టన్ స్టబ్స్(4), అక్షర్ పటేల్(15)లు సైతం స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరారు. ఇంప్యాక్ట్ ప్లేయర్ కుమార్ కుశగ్ర(1)ను ఔట్ చేసిన చక్రవర్తి ఢిల్లీ భారీ స్కోర్ ఆశలకు గండి కొట్టాడు. అయితే.. రసిక్ దార్(8) అండగా కుల్దీప్(35) చివరి దాకా నిలబడి పంత్ సేనకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. కోల్‌కతా బౌలర్లు వరణ్ చక్రవర్తికి మూడు, అరోరా, హర్షిత్ రాణాకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)..

ఢిల్లీ : 153/9 (పంత్-28; చక్రవర్తి(3/16)
కోల్‌తా : 157/3(సాల్ట్ 68; అక్షర్ పటేల్ 2/25)

బిసిసిఐ సమావేశం వాయిదా

టి20 ప్రపంచకప్‌కు తుది జట్టుకు కసరత్తు

న్యూఢిల్లీ: న్యూయార్క్, వెస్టిండీస్ వేదికలుగా ఈ ఏడాది జరిగే టి20 ప్రపంచప్‌కు భారతజట్టు ప్రకటన వాయిదాపడింది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఢిల్లీ-కోల్‌కతా జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ ఓ వైపు జరుగుతుండగా.. మరోవైపు టి20 ప్రపంచకప్‌కు జట్టు సభ్యుల కూర్పుపై సెలెక్షన్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి కోచ్ రాహుల్ ద్రావిడ్, కెప్టెన్ రోహిత్ శర్మతో ప్రత్యక్షంగా హాజరుకాగా.. బిసిసిఐ సెలెక్షన్ కమి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పర్చువల్‌గా హాజరైనట్లు సమాచారం. ఒకరిద్దరి ఆటగాళ్ల పేర్లు మినహా మిగిలిన జట్టు సభ్యులందరినీ సెలక్షన్ కమిటీ సిద్ధం చేసింది. బిసిసిఐ కార్యదర్శి జే షా ఎన్నికల ప్రచారంలో బిజీగా దృష్ట్యా జట్టు ప్రకటన చివర్లో వాయిదా పడింది. మంగళవారం అహ్మదాబాద్‌లో మరో దఫా వీరంతా జే షాతో సమావేశమైన అనంతరం తుది జట్టు ప్రకటించనున్నారు.

న్యూజిలాండ్ జట్టు ఇదే...

టి20 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ క్రికెట్‌బోర్డు(ఎన్‌జడ్‌బి) సోమవారం జట్టును ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్‌కు జట్టు బాధ్యతలు అప్పగించిన బోర్డు.. స్టార్ బ్యాటర్ రచిన్ రవీంద్రకు టి20ల్లో చోటు కల్పించింది. ఇక న్యూజిలాండ్ జట్టు జూన్ 7న తొలి లీగ్ మ్యాచ్‌ను ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ గయానా వేదికగా జరగనుంది.

న్యూజిలాండ్ : విలియమ్సన్(కెప్టెన్), అలెన్, బౌల్ట్, బ్రాస్‌వెల్, చాప్మన్, కాన్వే, ఫెర్గ్యుసన్, హెన్రీ, మిఛెల్, నీషమ్, ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, సాంట్నర్, సోధీ, సౌథీ, రిజర్: బెన్ సీర్స్.

ఘనంగా మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర అవార్డులు



అస్సాం రాష్ట్రం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని మణిపూర్ స్టేట్ ఫిల్మ్ డెవలప్మెంట్ సొసైటీ (ఎంఎస్‌ఎఫ్‌డీఎస్) ప్యాలెస్ ఆడిటోరియంలో 15వ మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర అవార్డులను మణిపూర్ గవర్నర్ అనుసుయా ఉయికే అందజేశారు. ఎంఎస్‌ఎఫ్‌డీఎస్ లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డు 2023ను ప్రముఖ సినీ నటుడు మొయిరంగ్తేమ్ నీలమణి సింగ్‌కు అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీకి మణిపూర్ రాష్ట్ర చలన చిత్ర పురస్కారం లభించింది. సుప్రసిద్ధ మణిపూరి రచయిత ప్రకాష్‌సింగ్ జీవిత సాహిత్యాలపై అకాడమీ రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రానికి ఉత్తమ జీవిత చరిత్ర, కళా సాంస్కృతిక చిత్రాల విభాగంలో పురస్కారం వరించింది. ఆదివారం ఇంఫాల్‌లో జరిగిన మణిపూర్ చలన చిత్ర పురస్కారాల మహోత్సవంలో ఆ రాష్ట్ర గవర్నర్ అనుసూయా ఉయికే కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావునకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డు లభించిన సాహిత్య అకాడమీ డాక్యుమెంటరీ చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రముఖ రచయిత ఆరిబమ్ శర్మకు ఉత్తమ డైరెక్టర్, చోంగ్‌తమ్ కమలాకు ఉత్తమ వాయిస్ ఓవర్ పురస్కారాలు దక్కాయి. వివిధ భారతీయ భాషలకు చెందిన సాహితీ ప్రముఖల జీవన ప్రస్థానంపై ఇప్పటివరకు సాహిత్య అకాడమీ 172 డాక్యుమెంటరీ చిత్రాలను రూపొందించింది. కేంద్ర సాహిత్య అకాడమీకి ఒక రాష్ట్ర ప్రభుత్వ చలన చిత్ర పురస్కారం లభించడం ఇదే తొలిసారి కావటం విశేషం.

థామస్‌కప్ క్వార్టర్స్‌కు భారత్



ఛెంగ్డు(చైనా): థామస్‌కప్ క్వార్టర్‌ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ దూసుకెళ్లింది. సోమవారం జరిగిన గ్రూప్-సి రెండో లీగ్ పోటీలో భారత్ 5-0తో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21-15, 21-15తో హారీ హాంగ్‌ను చిత్తుచేయగా.. డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్-చిరాగ్ 21-17, 19-21, 21-15తో బెన్ లెన్-సీవెన్ వెడీను ఓడించి భారత్‌కు 2-0 ఆధిక్యతలో నిలిపారు. ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-16, 21-11తో నదీమ్‌ను, రెండో డబుల్స్‌లో ధృవ్ జొరెల్-అర్జున్ జంట 21-17, 21-19తో చిత్తుచేసి భారత్‌కు తిరుగులేని 4-0 ఆధిక్యతను సాధించారు. ఇక చివరి సింగిల్స్‌లో కిరణ్ జార్జి 21-18, 21-12తో చోలన్ కళ్యాన్‌ను చిత్తుచేయడంతో భారత్ క్లీన్‌స్వీప్ సాధించింది. ఇక ఉబెర్ కప్‌లో మహిళలజట్టు సింగపూర్‌ను ఓడించి ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే.

చాంపియన్స్ ట్రోఫీ వేదికలను ప్రకటించిన పిసిబి

లాహోర్: పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పిసిబి) 2025 ఛాంపియన్స్ ట్రోఫీ వేదికలను ప్రకటించింది. కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు పిసిబి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. చివరిసారిగా 2017లో నిర్వహించిన చాంపియన్స్ ట్రోఫీకి ఇంగ్లండ్‌లో జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో చాంపియన్స్ ట్రోఫీ జరుగనుంది. ఈ మెగా టోర్నీ కంటే ముందు టి20 వరల్డ్ కప్‌లో జూన్ 9న భారత్, పాక్‌లు తలపడనున్నాయి.

ఐపిఎల్‌లో నేడు

లక్నో × ముంబయి


వేదిక: లక్నో: రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	9	8	1	16	0.69
కోల్‌కతా	9	6	3	12	1.09
చెన్నై	9	5	4	10	0.81
సన్‌రైజర్స్	9	5	4	10	0.07
లక్నో	9	5	4	10	0.05
ఢిల్లీ క్యాపిటల్స్	11	5	6	10	-0.44
గుజరాత్	10	4	6	8	-0.11
పంజాబ్‌కింగ్స్	9	3	6	6	-0.18
ముంబయి	9	3	6	6	-0.26
బెంగళూరు	10	3	7	6	-0.41

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68



రౌండ్ సర్కిల్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి అక్షయ్

మరో 'సూరత్'

- ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉపసంహరణ

ఇండోర్ : బిజెపి అనైతిక రాజకీయ క్రీడ కొనసాగుతోంది. ఇటీవల సూరత్‌లో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి నామినేషన్ తిరస్కరింపజేసి, స్వతంత్ర అభ్యర్థులందరి నామినేషన్లు ఉపసంహరింపజేసి, బిజెపి అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ తతంగంలో కమలం పార్టీ అక్రమాలపై విమర్శలు వెల్లువెత్తినా.... వారి తీరు ఏమాత్రం మారలేదు. తాజాగా ఇండోర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్‌ను సోమవారం ఉపసంహరించుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ధ్రువీకరించింది. బిజెపి ఎమ్మెల్యే రమేష్ మెండోలాతో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లిన బామ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బిజెపి సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మంత్రి కైలేష్ విజయ్ వర్గీయతో కలిసి కారులో వెళ్తున్న ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బామ్‌కు బిజెపిలోకి స్వాగతం పలుకుతూ బిజెపి నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇండోర్‌లో మే 13న ఎన్నికలు జరుగుతాయి. బిజెపికి చెందిన సిట్టింగ్ ఎంపి శంకర్ లాల్వానీపై బామ్‌ను పోటీకి నిలపగా, ఆయన బిజెపి ప్రలోభాలతో నామినేషన్ ఉపసంహరించుకోవడం గమనార్హం.

మోడీ హయాంలో
దిగజారిన ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రతిష్ట

- ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, మైనార్టీలపై దాడులు జరుగుతుంటే చోద్యం చూస్తున్న కమిషన్
- రేపు జెనీవాలో యుఎన్‌హెచ్‌ఆర్‌సి సమీక్ష
- గ్రేడ్ తగ్గింపు గురించి సంకేతాలు

న్యూఢిల్లీ: రాజ్యాంగ సంస్థలను, ప్రజాస్వామిక వ్యవస్థలను ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చివరికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)ని కూడా వదల్లేదు. ఆరెస్సెస్ భక్తులతో నింపేయడంతో ఆ కమిషన్ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. గత పదేళ్లలో దేశంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయించి జైలులో పెడుతున్నారు. గౌరి లంకేష్, దబోల్కర్, పన్సారే వంటివారిని దారుణంగా హత్యచేశారు. ఇంత జరుగుతున్నా జాతీయ మానవ హక్కుల కమిషన్ చోద్యం చూస్తూ కూర్చొందే తప్ప ఎలాంటి జోక్యం చేసుకోలేదు. ఎన్‌హెచ్‌ఆర్‌సి నిష్క్రియా పరత్వం వల్లే మానవ హక్కుల ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ఐరాస మానవ హక్కుల సంస్థ (యుఎన్‌హెచ్‌ఆర్‌సి) పదే పదే హెచ్చరించినా ఎన్‌హెచ్‌ఆర్‌సి తీరు మారలేదు. ఈ ఏడాది మార్చి 26న అమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్‌లతో సహా 9 మానవ హక్కుల గ్రూపులు జిఎఎన్‌హెచ్‌ఆర్ఐకి ఒక లేఖ రాశాయి. ఎన్నికల వేళ భారతదేశంలో పౌర సమాజంపై ఆంక్షలు పెరుగుతున్నాయని, మైనారిటీల పట్ల వివక్ష నెలకొందంటూ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో బుధవారం



గుజరాత్‌లో దళిత యువకులను చిత్రహింసలకు గురిచేస్తున్న దృశ్యం (ఫైల్)

జెనీవాలో జరగనున్న యుఎన్‌హెచ్‌ఆర్‌సి సమావేశంలో భారత్‌లో మానవ హక్కుల పరిస్థితి చర్చకు రానుంది. ఎన్‌హెచ్‌ఆర్‌సి గుర్తింపు రద్దు చేయడమో, లేక దాని గ్రేడ్ తగ్గించడమో చేస్తారన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే రెండు సార్లు ఎన్‌హెచ్‌ఆర్‌సిపై ఐరాస మానవ హక్కుల సంస్థ చర్యలు తీసుకుంది. 2016లో ఎన్‌హెచ్‌ఆర్‌సి గుర్తింపును వాయిదా వేసింది. 2023లో రేటింగ్‌ను నిలిపేసింది. రేటింగ్ తగ్గించే పరిస్థితి ఇలా ఎదుర్కోనాల్సి రావడం మోడీ ప్రభుత్వానికి ఇది రెండోసారి.

దేశంలో మానవ హక్కులను కాపాడడంలో పేలవమైన రికార్డు కలిగివున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి తన వైఫల్యాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై దర్యాప్తుల్లో పోలీసు సిబ్బంది వుండడం, కమిటీల్లో మహిళలకు, మైనారిటీ ప్రాతినిధ్యం కొరవడడం వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి.

ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇనిస్టిట్యూషన్స్ (జిఎఎన్‌హెచ్‌ఆర్ఐ) సబ్ కమిటీ బుధవారం నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి అధికారులు నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో హాజరవుతారు.

1999లో గుర్తింపు పొందినప్పటి నుండి భారత్ 2006, 2011లో ఎ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. 2016లో గుర్తింపును వాయిదా వేశారు. ఏడాది తర్వాత పునరుద్ధరించారు. గతేడాది మార్చిలో ఎస్‌సిఎ ఆరు పాయింట్లతో తన అభిప్రాయాన్ని అందచేసింది. "ప్రభుత్వ జోక్యంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించడానికి" అనువైన పరిస్థితులను నెలకొల్పడంలో ఎన్‌హెచ్‌ఆర్‌సి విఫలమైంది. దర్యాప్తు ప్రక్రియల్లో పోలీసు అధికారుల ప్రమేయం వుంటోందని, ఇది ఆశించిన ప్రయోజనాలకు విరుద్ధమని ఎస్‌సిఎ వ్యాఖ్యానించింది.

కమిషన్ సెక్రటరీ జనరల్, సిఇఒ బాధ్యతల్లో గుజరాత్ కేడర్ మాజీ ఐఎఎస్ అధికారి భరత్ లాల్‌తో సహా ప్రభుత్వ అధికారులు వుండడం వల్ల కమిషన్‌కు సమర్ధత పెరుగుతోందని ఎన్‌హెచ్‌ఆర్‌సి పేర్కొంది. అయితే దీనిని పౌర సమాజ కార్యకర్తలు తోసిపుచ్చారు. ఇప్పటికీ ఎన్‌హెచ్‌ఆర్‌సిలో చాలా మంది సభ్యులు పాలక పార్టీకి రాజకీయంగా విధేయులైన వారే ఉన్నారని, అన్నారు. వారిలో గుజరాత్‌లో బిజెపి ప్రతినిధిగా వున్న జాతీయ ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, మధ్యప్రదేశ్ బిజెపి ఎంఎల్‌ఎ అయిన జాతీయ ఎస్‌టి కమిషన్ ఛైర్‌పర్సన్ అంతార్ సింగ్ ఆర్య, మాజీ బిజెపి ఎంపి, జాతీయ వెనుకబడిన కులాల కమిషన్ ఛైర్‌పర్సన్ హంసరాజ్ అహిర్, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యురాలు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ ప్రియాంక కనూంగు వున్నారు. భారతదేశ అక్రిడిటేషన్ హోదాపై వ్యాఖ్యానించడానికి విదేశాంగ శాఖ, ఎన్‌హెచ్‌ఆర్‌సిలు తిరస్కరించాయి. బుధవారం నాటి సమావేశంలో తిరిగి 'ఎ' హోదా పునరుద్ధరించబడుతుందన్న ధీమాతో ప్రభుత్వం ఉంది.

ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటాం

- సిపిఎం బృందానికి ఇసి హామీ
- బిజెపి అక్రమాలను వివరించిన సుభాషిణీ అలీ, మురళీధరన్

న్యూఢిల్లీ : బిజెపిపైనా, ఆ పార్టీ ప్రధాన ప్రచారకర్తలపైనా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చేసిన పలు ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) సానుకూలంగా స్పందించింది. ఫిర్యాదులను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినవారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.

సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్ సోమవారం సాయంత్రం న్యూఢిల్లీలోని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధానకార్యాలయానికి వెళ్లి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లతో సమావేశమయ్యారు. బిజెపి అధ్యక్షులు, ఆ పార్టీకి చెందిన ఇతర ప్రచారకర్తలపై సిపిఎం ఫిర్యాదులపై ఎన్నికల సంఘానికి వివరించారు. ముఖ్యంగా మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా బిజెపి నేతలు పదేపదే విద్వేష ప్రసంగాలు చేస్తుండటంపైనా, అవాస్తవాలను చెబుతూ ప్రజలను చీల్చి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బిజెపి పన్నుతున్న కుయుక్తులపైనా ఎన్నికల కమిషనర్ల వద్ద సిపిఎం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు వాస్తవాలను తొక్కిపెట్టి అవాస్తవాలను ప్రచారం చేస్తూ బిజెపి విద్వేష పూరిత కుట్రలకు వంత పాడుతున్న కొన్ని టివి వార్తా ఛానెళ్లు, మీడియా సంస్థల పాత్రపైన కూడా సిపిఎం నేతలు ఆందోళన వెలిబుచ్చారు. ఇలాంటి నేతలపైనా, సంస్థలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ ఫిర్యాదుల పట్ల ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని, ఉల్లంఘనలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామన్న హామీ ఇచ్చిందని సమావేశం అనంతరం సిపిఎం నేతలు పేర్కొన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సహా ఆ పార్టీకి చెందిన ప్రధాన ప్రచారకర్తలు ఎన్నికల ప్రచార సభల్లో విద్వేష ప్రసంగాలు చేయడం, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీలు వంటి అణగారిన తరగతులకు చెందిన ప్రజలకు అందుతున్న రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించడం, తొలి, మలి విడత పోలింగ్ జరిగిన త్రిపుర వంటి చోట్ల బిజెపి అక్రమాలకు పాల్పడటం వంటి ఘటనలపై నిర్దిష్ట సమాచారంతో సోదాహరణంగా సిపిఎం ఎన్నికల సంఘానికి పలుమార్లు ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే.

ఇడికి సహకరించకపోవడమే అరెస్టుకు కారణం కాదు

- సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ వాదనలు

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సహకరించకపోవడమే తన అరెస్టుకు కారణం కాదని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. లిక్కర్ పాలసీ కేసులో తన అరెస్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. "ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రకటించిన తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. ఆయన అరెస్టుకు కారణం ఏమిటి? ఆయన కరడుగట్టిన నేరస్థుడా లేక ఉగ్రవాదా? పారిపోయేవాడా? లేదా దోషి అయిన ముఖ్యమంత్రిని ఇన్నాళ్లు స్వేచ్ఛగా తిరిగేందుకు వదిలేశారా?" అని కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఈ కేసులో బెయిల్ కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారా? అని సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అక్రమమని, అందుకే తాము ఎలాంటి పిటిషన్లు వేయలేదని సింఘ్వీ చెప్పారు. సమన్లు ఇచ్చినా హాజరుకాకుండా ఉండే హక్కు కేజ్రీవాల్‌కు ఉందని, ఆ కారణంతో అరెస్టు చేయడం సరికాదని తెలిపారు. ఆయన అరెస్టుకు వేరే కారణాలున్నాయని పేర్కొన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

కేజ్రీవాల్‌ను కలిసిన ఆయన భార్య సునీత

కేజ్రీవాల్‌ను కలిసేందుకు ఆయన భార్య సునీతను అనుమతించడం లేదని ఆప్ సోమవారం ఉదయం విమర్శించింది. అనంతరం జైలు అధికారులు అనుమతించడంతో సోమవారం మధ్యాహ్నం ఆమె తీహార్ జైలులో కేజ్రీవాల్‌ను కలిశారు. అనంతరం రాష్ట్ర మంత్రి అతిషి మీడియాతో మాట్లాడుతూ 'పనులు ఎలా జరుగుతున్నాయి? పిల్లలకు పుస్తకాలు అందుతున్నాయా? మొహల్లా క్లినిక్‌లలో మందులు సరిపడా ఉన్నాయా?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారని చెప్పారు. తాను కచ్చితంగా బయటకు వస్తానని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ప్రజలకు చెప్పాలని సిఎం కోరారని తెలిపారు.

రిజర్వేషన్లపై ఆర్‌ఎస్‌ఎస్ కపటవైఖరి


పొంతన లేని ప్రకటనలతో మభ్యపుచ్చే యత్నాలు

న్యూఢిల్లీ : రిజర్వేషన్లకు ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ మద్దతిస్తూనే వచ్చిందని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. రిజర్వేషన్లకు ఆరెస్సెస్ వ్యతిరేకమంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలపై ఆయన వివరణ ఇస్తూ, రాజ్యాంగం ఇవ్వజూపిన అన్ని రకాల రిజర్వేషన్లకు ఆర్‌ఎస్‌ఎస్ పూర్తి మద్దతును ఇస్తుందన్నారు.. సమాజంలో అసమానతలు ఉన్నంతవరకు ఈ రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని ఆయన సోమవారం చెప్పారు.

ఆ వీడియోలు బూటకమని అన్నారే కానీ, అందులోని సమాచారం నిజం కాదని గట్టిగా ఆయన చెప్పలేక పోయారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపుచ్చేందుకు ఆరెస్సెస్, బిజెపి నేతలు ఇటువంటి ప్రకటనలు చేస్తుంటారు. మోహన్ భగవత్ ఇప్పుడు చెబుతున్న మాటలకు గతంలో ఆరెస్సెస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు చేసిన ప్రకటనలకు ఎక్కడా పొంతనే కుదరడం లేదు. పలు సందర్భాల్లో పలువురు ఆర్‌ఎస్‌ఎస్ నేతలు రిజర్వేషన్లపై ఏమన్నారో చూడండి..

1.మన్మోహన్ వైద్య, 2017 : 'రిజర్వేషన్లకు అంతం పలకాలి'

2017 జనవరిలో ఆర్‌ఎస్‌ఎస్‌కు అప్పట్లో పబ్లిసిటీ చీఫ్‌గా, ప్రస్తుతం సంయుక్త ప్రధాన కార్యదర్శిగా వున్న మన్మోహన్ వైద్య ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, 'ఒక భిన్నమైన సందర్భం'లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని, వాటికి కచ్చితంగా ఒక 'కాల పరిమితి' వుండాలని అన్నారు. 'చారిత్రకంగా జరిగిన అన్యాయానికి చికిత్సగా రాజ్యాంగం రిజర్వేషన్లను అందించింది. అది మన బాధ్యత. రాజ్యాంగం ఏర్పడిన నాటి నుండి వారికి రిజర్వేషన్లు వున్నాయి. కానీ, వీటిని శాశ్వతంగా కొనసాగించడం మంచిది కాదని అంబేద్కర్ కూడా అన్నారు. దీనికి ఒక కాలపరిమితి వుండాలి.' అని వైద్య పేర్కొన్నారు. జైపూర్ సాహితీ



ఉత్సవాల్లో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈ రిజర్వేషన్లను ఇలాగే ఎప్పటికీ కొనసాగించడం వల్ల మతోన్మాదం పెరుగుతుంది' అన్నారు.

2. కె.ఎన్.గోవిందాచార్య, 2016 : 'రాజ్యాంగాన్ని రిజర్వేషన్లకే పరిమితం చేయరాదు'

2016లో వైర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతికవేత్త కెఎన్ గోవిందాచార్య మాట్లాడుతూ రాజ్యాంగానికి కొత్త చట్రపరిధిని రూపొందించాల్సి వుందన్నారు. "రిజర్వేషన్లు కొంతవరకు సాయపడవచ్చు, భావోద్వేగంగా కూడా ముఖ్యమే కావచ్చు. కానీ ప్రజలకు సాయపడేలా ఇంకా ఏం చేయగలమో మనం చర్చించాలి." అన్నారు. "మన రాజ్యాంగం చాలా అస్పష్టంగా వుంది. నిర్దిష్టంగా లేదు, మౌలికంగా పశ్చిమ దేశాల సిద్ధాంతాల కొనసాగింపుగా వుంది. వ్యక్తి కేంద్రంగా, వారి సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించింది. మన నాగరితక నాలుగైదు వేల ఏళ్లనాటిది." అని ఆయన పేర్కొన్నారు. కొత్త రాజ్యాంగం అవసరమనే తన వాదనను సమర్థించుకునేయత్నంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

3.ఎం.జి.వైద్య, 2015 : 'ఇప్పుడు రిజర్వేషన్లు అవసరం లేదు'

2015లో ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతికవేత్త ఎం.జి.వైద్య 'ది హిందూ'తో మాట్లాడుతూ, రిజర్వేషన్లను రద్దు చేయాలన్నారు. 'ఇప్పుడు కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు అవసరం లేదు. ఎందుకంటే ఏ కులం కూడా వెనుకబడి లేదు. అన్నింటికంటే ముఖ్యంగా, ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు పదేళ్లే కొనసాగించాలి. ఆ తర్వాత కుల ప్రాతిపదిక రిజర్వేషన్‌ను పూర్తిగా రద్దు చేయాలి." అన్నారు. కుల ప్రాతిపదిక రిజర్వేషన్ వల్ల కులాల విభజనలు పూర్తిగా పారద్రోలడానికి బదులుగా మరింత బలపడుతున్నాయన్నారు.

4. మోహన్ భగవత్, 2015 : 'రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాలి'

రాజకీయ ప్రయోజనాల కోసమే రిజర్వేషన్ విధానాన్ని వాడుతున్నారని, అందువల్ల దాన్ని సమీక్షించాల్సి వుందని 2015లో మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. "సామాజిక న్యాయానికి కట్టుబడినవారు, యావత్ దేశ ప్రయోజనాల కోసం నిజాయితీగా ఆందోళన చెందే వ్యక్తులు సహా సమాజంలోని కొంతమంది ప్రతినిధులతో కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేసి ఏ కేటగిరీలకు, ఎంతకాలం రిజర్వేషన్లు అవసరమో నిర్ణయించాలి." అని అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల కమిషన్లు వంటి రాజకీయేతర కమిటీలకు దీని అమలు బాధ్యత అప్పగించాలి.. ఆ కమిటీలు నిజాయితీగా, సమగ్రతతో పనిచేస్తున్నాయో లేదో రాజకీయ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.

2019లో ఆయన తన వైఖరేమిటన్నది స్పష్టంగా చెప్పలేదు కానీ రిజర్వేషన్లకు అనుకూలమైనవారు, వాటిని వ్యతిరేకించే వారి మధ్య సామరస్య వాతావరణంలో చర్చలు జరగాలన్నారు.

సమ్మెలు, నిరసనలతో అర్జెంటైనా ఉక్కిరిబిక్కిరి

- మే 6న సమ్మెకు సిద్ధమైన రవాణా కార్మికులు
- ప్రభుత్వ పొదుపు చర్యలపై ఆగ్రహం

బ్యూనస్ ఎయిర్స్ : మే 6వ తేదీన ఆర్జెంటైనా రవాణా రంగ కార్మికులు సమ్మెకు దిగనున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు నిరసనగా అన్ని రవాణా కార్యకలాపాలు నిలిచిపోనున్నాయని యూనియన్ ఆఫ్ డాక్ అండ్ బేకాన్ వర్కర్స్ కార్యదర్శి జువాన్ కార్లోస్ షామిడ్ తెలిపారు. భూ జల, వాయు రవాణా మొత్తంగా ప్రభావితం కానుందని చెప్పారు. మితవాద అధ్యక్షుడు జేవియర్ మిలె అమలు చేస్తున్న తీవ్ర పొదుపు చర్యలు, విధానాలకు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సిజిటి) రెండోసారి సార్వత్రిక సమ్మెకు పిలుపిచ్చింది. దానికి మూడు రోజులు ముందుగా రవాణా రంగ కార్మిక లోకం సమ్మెకు సిద్ధమైంది. దీనికి తోడు, మిలె అనుసరిస్తున్న ఆదాయపన్ను, కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ యూనియన్ ఆఫ్ ఆయిల్ అండ్ సోయాబీన్ వర్కర్స్ ఆధ్వర్యంలో శాన్ లారెంజోలో కార్మికులు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. దీనివల్ల 80శాతం చమురు మిల్లుల కార్యకలాపాలు దెబ్బ తింటాయని యూనియన్ తెలిపింది. ఫుడ్ శానిటరీ క్వాలిటీ వర్కర్లు కూడా దేశవ్యాప్తంగా సోమవారం సమ్మెకు దిగినట్లు ప్రకటించారు.

పోలింగ్ అధికారిపై దాడి కేసులో బిజెపి ఎమ్మెల్యేకు నోటీసులు

అగర్తలా : త్రిపురలో రెండో దశ పోలింగ్ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారిపై చేయి చేసుకున్న బిజెపి ఎమ్మెల్యే లాల్ నాథ్‌కు; జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటీసులు ఇచ్చారు. ఈ ఘటనపై అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో ఎన్నికల అధికారులు ఈ చర్య తీసుకున్నారు. త్రిపుర తూర్పు లోక్‌సభా నియోజకవర్గానికి ఈ నెల 26న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే.ఈ దాడితో ప్రమేయమున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు కంజల్ దాస్‌పైనా ఎఫ్ఐఆర్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి బూత్‌లోకి ఎందుకు ప్రవేశించారు? అధికారిపై ఎందుకు చేయి చేసుకున్నారో తెలియజేయాలంటూ ఎమ్మెల్యేకు ఇచ్చిన నోటీసులో జిల్లా ఎన్నికల అధికారి దేవప్రియ వర్ధన్ ఆదేశించారు.

ప్రిసైడింగ్ అధికారిని బయటకు లాగి కొట్టారు

పోలింగ్ రోజున సాయంత్రం 5గంటల సమయంలో బూత్ వద్ద చెల్లాచెదురుగా నిలబడిన ఓటర్లందరూ లైన్‌లో నిల్చొని టోకెన్లు తీసుకోవాలని, 5 గంటల తర్వాత ఓటు వేయడానికి ఇవి తప్పనిసరని ప్రిసైడింగ్ అధికారి చెబుతున్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కంజల్ దాస్, ఆయన అనుచరులు బూత్ నుండి ప్రిసైడింగ్ అధికారిని బయటకు లాగి చేయి చేసుకున్నారని సంబంధిత అధికారి తెలిపారు.

టీచర్స్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లో సిబిఐ విచారణపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ స్కాంలో ప్రభుత్వ అధికారుల పాత్రపై సిబిఐ జరపాలని కోల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. 25 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలను రద్దు చేస్తూ కోల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. 25,753 ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ కోల్‌కత్తా హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. రిక్రూట్‌మెంట్ స్కాంపై సిబిఐ విచారణ జరిపించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. వీటిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ పిటీషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను మే 6కి వాయిదా వేసింది.

సందేశ్‌ఖలిపై సిబిఐ విచారణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?
బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్న

సందేశ్‌ఖలిలో దురాగతాలపై సిబిఐ విచారణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. 'ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడకు ఎందుకు వచ్చింది' అని జస్టిస్ బిఆర్ గవై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు ఎఎం సింఘ్వి, జైదీప్ గుప్తాలను ప్రశ్నించింది. ఈ కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు వ్యాఖ్యలు చేసిందని గుప్తా సమాధానం ఇచ్చారు. 'అప్పుడు హైకోర్టుకు వెళ్లి వ్యాఖ్యలను తొలగించండి.. ఇక్కడికి ఎందుకు వచ్చారు?' అని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. తదుపరి విచారణను జులైకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సందేశ్ ఖలిలో దురాగతాలపై సిబిఐ విచారణకు కోల్‌కత్తా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును బెంగాల్ ప్రభుత్వం ఆశ్రయించింది



జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

- జాతీయ రహదారిపై విరిగిపడిన కొండచరియలు
- రాకపోకల నిలిపివేత
- పలుచోట్ల నిలిచిన తాగునీటి సరఫరా
- పాఠశాలల మూసివేత

జమ్ము : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై వివిధ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేసినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. కాశ్మీర్‌ను మిగిలిన భారతదేశంతో ఈ జాతీయ రహదారే అనుసంధానం చేస్తుంది. రాంబాన్ జిల్లా కిస్తావరి పథేర్, మామ్ పాసి, గుంగ్రూ, మెహర్ వంటి ప్రాంతాల్లో రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆదివారం నుంచి నిరంతరాయంగా వర్షాలు కురుస్తుండటంతో పునరుద్ధరణ, సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. శిథిలాలను తొలగించే వరకూ జాతీయ రహదారిపై ప్రయాణించవద్దని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

పూంచ్, రాజౌరి జిల్లాలను షోపియాన్ జిల్లాతో అనుసంధానం చేసే ప్రత్యామ్నాయ మార్గమైన మొఘల్ రహదారిని వరసగా మూడో రోజైన సోమవారం కూడా అధికారులు మూసివేశారు. కిష్త్వార్ జిల్లాలో సోమవారం పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. నైగాడ్ నీటి సరఫరా పైపులకు నష్టం కలగడంతో కిష్త్వార్ పట్టణానికి మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. నీటి సరఫరా పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు చెప్పారు. జిల్లాలోని బాషా - సింబూల్ గ్రామంలో కొండచరియలు విరిగిపడ్డంతో రెండిళ్లు ధ్వంసమయ్యాయి. రాంబాన్, సాంబా జిల్లాలో ఆకస్మిక వరదలతో పదుల సంఖ్యలో పశువులు మరణించాయని అధికారులు చెప్పారు. సోమవారం జమ్ముకాశ్మీర్‌లో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.



పాలస్తీనాకు సంఘీభావంగా
వెల్లువలా విద్యార్థుల ఉద్యమం

- అమెరికా నుంచి ఆస్ట్రేలియా దాకా విస్తరించింది
- వేలాదిమంది అరెస్టు

న్యూయార్క్ : పాలస్తీనాకు సంఘీభావంగా అమెరికా యూనివర్సిటీల్లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమం ఇప్పుడు యూరప్, ఆస్ట్రేలియాల్లోని యూనివర్శిటీలకు కూడా విస్తరించింది. ఈ ఉద్యమాల వెల్లువను చూసి బెంబేలెత్తుతున్న ఆయాదేశాల్లోని ప్రభుత్వాలు వీటిపై ఉక్కుపాదం మోపుతున్నాయి. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను ఆపాలని, అమెరికన్లు పన్నుల రూపంలో చెల్లించన డబ్బును దురాక్రమణ దారు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, సాయం రూపంలో మళ్లించే విధానానికి స్వస్తి పలకాలని కోరుతూ విద్యార్థులు యూనివర్సిటీ కేంపస్‌లలో గుడారాలు వేసుకుని ఆందోళన సాగిస్తున్నారు. పోలీసు అణచివేత చర్యలను కూడా లెక్క చేయకుండా ప్రపంచవ్యాప్తంగా ఈ ఆందోళనలు విస్తరిస్తున్నాయి.. ఈ దాడులు, యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుపై దేశీయంగా, అంతర్జాతీయంగా కూడా ఒత్తిడి పెరుగుతోంది. ప్రదర్శనలు జరుపుతున్న విద్యార్థులపై పోలీసులు అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా అమెరికన్ యూనివర్శిటీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. న్యూయార్క్ నుండి కాలిఫోర్నియా వరకు ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల వర్శిటీలను మూసివేసి, ఆందోళనా శిబిరాలను తొలగించారు. అమెరికా కేంపస్‌ల వ్యాప్తంగా గత రెండు వారాల్లో 900మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. అమెరికా కేంపస్‌ల్లో ఎక్కడబడితే అక్కడ మూకుమ్మడి అరెస్టుల దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అమెరికాలో మొత్తంగా 75చోట్ల కాలేజీ కేంపస్‌ల్లో ఆందోళనా శిబిరాలు వేసి విద్యార్థులు నిరసనలు తెలియచేస్తున్నారు. వాషింగ్టన్ యూనివర్శిటీ కేంపస్‌లో అరెస్టయిన వారిలో తాము వున్నామని గ్రీన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జిల్ స్టెయిన్ తెలిపారు. వాషింగ్టన్ డిసి, కాలిఫోర్నియా, పిట్స్‌బర్గ్, బోస్టన్, మసాచుసెట్స్‌ల్లో కూడా పలువురు అరెస్టయ్యారు. కనెక్టికట్‌లోని యేలె యూనివర్శిటీలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. చికాగో ఏరియాలో కూడా వేలాదిమంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

లండన్‌లో 2లక్షల మందితో భారీ ప్రదర్శన

లండన్‌లో శనివారం దాదాపు 2లక్షల మందితో పాలస్తీనా అనుకూల ప్రదర్శన బ్రహ్మాండగా జరిగింది. పార్లమెంట్ స్క్వేర్ వద్దకు చేరుకున్న ఆందోళనకారులు తర్వాత వైట్‌హాల్, డౌనింగ్ స్ట్రీట్ మీదుగా సెంట్రల్ లండన్‌లోని హైడ్ పార్క్ వద్దకు చేరుకున్నారు. అమెరికా సహా ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు చేస్తున్న నిరసనలు, ఆందోళనలతో స్ఫూర్తి పొందిన ఆందోళనకారులు లండన్‌లో ఈ మహా ప్రదర్శన తలపెట్టారు. దేశవ్యాప్తంగా ఇప్పటికి 12సార్లు ఇలాంటి మహా ప్రదర్శనలు నిర్వహించారు.

పారిస్‌లో

పారిస్‌లోప్రఖ్యాత సైన్సెస్ పిఒ యూనివర్శిటీలో సెంట్రల్ కేంపస్ భవనాన్ని దిగ్బంధించారు. తరగతులు ఆన్‌లైన్‌లో పెట్టుకోవాలని కోరారు. కెనడాలోని మెక్‌గిల్ యూనివర్శిటీలో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. యూదు విద్యా సంస్థలతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

సిడ్నీలో

సిడ్నీ యూనివర్శిటీలో చారిత్రక కేంపర్‌డౌన్ కేంపస్‌లో విద్యార్థులు కూడా గత వారంలో పాలస్తీనా అనుకూల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయుధాల తయారీదారులతో సంబంధాలు తెంచుకోవాలని కోరారు. ఇటలీ, ఫ్రాన్స్‌ల వరకు ఈ ఆందోళనలు విస్తరించాయి. పాలస్తీనా కోసం సాగించే పోరాటం ఎక్కడైనా ఒక్కటేనని వారు నినదిస్తున్నారు. బైడెన్, ట్రంప్, బుష్, ఒబామా అందరూ కూడా యుద్ధం కొనసాగాలని కోరుకున్నవారేనని విమర్శిస్తున్నారు. నిరసన తెలియచేసే హక్కును లాగేసుకుంటున్నారని కొలంబియా విద్యార్థి ఒకరు విమర్శించారు. పోలీసుల చర్యలతో తాము భయపడేది లేదని వారు స్పష్టం చేశారు. చాలాచోట్ల ఫ్యాకల్టీ కూడా విద్యార్థులతో చేతులు కలుపుతోంది.


అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలులో ప్రచారం చేస్తున్న పాచిపెంట అప్పలనర్స


నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులో ప్రచారం చేస్తున్న సిపిఎం అభ్యర్థి మూలం రమేష్, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కొప్పుల రాజు

ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించండి

సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం అభ్యర్థులు సోమవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని, తమకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో తమను గెలిపించినట్లయితే ఆయా నియోజవర్గాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న బిజెపికి మరోసారి అవకాశమిస్తే దేశం అంథకారమవుతుందని హెచ్చరించారు. బిజెపిని, దాని తొత్తు, పొత్తు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో పాణ్యం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలపైన భారాలు మోపుతూ సంపన్నులకు దోచిపెడుతోందని విమర్శించారు. మైనార్టీలను అడుగడుగునా అణచివేస్తోందని తెలిపారు. అలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని, వాటిని ఓడించాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళల పక్షాన పోరాటం చేస్తున్న తమను గెలిపించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం అభ్యర్థి మండంగి రమణ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ పాల్గొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు దానికి మద్దతివ్వడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న బిజెపిని ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. గిరిజన సమస్యలపై పోరాడుతున్న కురుపాం అభ్యర్థి మండంగి రమణ, అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు. అనంతరం నీలకంఠాపురంలో సంత వద్ద రోడ్డు పక్కనున్న చిరు వ్యాపారస్తుల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం, వంగర, నోండ్రుకోన పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డు, రంగనాయకులపేట, రామయ్యబడి సెంటర్, మూలాపేట అలంకార్ సెంటర్, శివాలయం సెంటర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నెల్లూరు నగర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్, కాంగ్రెస్ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల రాజు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటినా దళితుల్లో పేదరికం ఇంకా తాండవిస్తోందని తెలిపారు. మోడీ నిరంకుశ విధానాలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందాల్సిన సబ్‌ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 24వ డివిజన్‌లోని కస్తూరిబాయిపేట, గిరిపురం, సీతారాంపురంలో సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు ప్రచారం నిర్వహిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి బిజెపి పబ్బం గడుపుకోవటానికి ప్రయత్నిస్తోందని, దీనికి టిడిపి, వైసిపి వంతపాడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా నగరంలోని వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. మోడీ తెచ్చిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, చిల్లర వర్తకంలోకి బడా కంపెనీల ప్రవేశం వలన చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు, పరిశ్రమలు దెబ్బతిన్నాయన్నారు. ఉపాధి కోల్పోయారని తెలిపారు.

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని వేమండ, ముక్కపాడు, లంకపల్లి, మదిరపాడు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, పొణుకుమాడు, కొత్తూరు, ఉంగుటూరు, ఎలుకపాడు గ్రామాల్లో సిపిఎం గన్నవరం నియోజకవర్గం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమం పేరుతో అభివృద్ధిని విస్మరించిందన్నారు. రాష్ట్రంలో 23 ఎంపి స్థానాలు ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి మోసం చేసిందని వివరించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సాధించలేదని తెలిపారు.

గుంటూరు జిల్లా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మేల్లంపూడిలో మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు రోడ్ షో నిర్వహించారు. తొలుత దళితవాడలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా మోసం చేసిన మోడీని.. టిడిపి, జనసేన, వైసిపి పార్టీలు బలపరచడం సిగ్గుచేటని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపిని, దాని తోకపార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

విశాఖలోని జోగవానిపాలెం, భానోజీ తోట, ఉప్పర కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, బొజ్జనకొండ, దశమకొండలో గాజువాక అభ్యర్థి ఎం జగ్గునాయుడు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం చినలబుడు, తురయిగుడ, హట్టగుడ, డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ సిమిలిగుడ, వసబంధ, హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ ఒంటిపాకలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగాధరస్వామి ప్రచారం చేశారు. రంపచోడవరం, వై.రామవరం, విఆర్.పురం మండలాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు ప్రచారం చేపట్టారు. ఇండియా వేదిక నాయకత్వంలో ప్రజా పరిపాలన వచ్చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.


భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, తదితరులు

నైతిక విలువలే కమ్యూనిస్టుల ఆస్తి

- సుబ్బారావుకు వి.శ్రీనివాసరావు నివాళి

ప్రజాశక్తి-కొల్లూరు (బాపట్ల జిల్లా)

నైతిక విలువలే కమ్యూనిస్టుల ఆస్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మరణించిన బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు ధూళిపాళ్ల సుబ్బారావు భౌతికకాయాన్ని రైతుసంఘం రాష్ట్ర నాయకులు పి.నరసింహారావుతో కలిసి సోమవారం ఆయన సందర్శించి, నివాళులర్పించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలో సుబ్బారావును చూసి నేర్చుకోవాలని, ఈ తరం యువకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సుబ్బారావు పెద్దగా చదువుకోకపోయినప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, నైతిక విలువలకు కట్టుబడి తుది శ్వాస వరకూ వాటికి కట్టుబడి పనిచేశారని కొనియాడారు. మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి మతం పేరుతో లబ్ధి పొందాలని ప్రధాని చూస్తున్నారని, ఇలా అయితే దేశంలో ఐక్యత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. రైతుసంఘం నాయకులు పి.నరసింహారావు మాట్లాడుతూ.. సుబ్బారావు సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమానికి సిపిఎం కొల్లూరు మండల నాయకులు బి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. తదనంతరం సుబ్బారావు పార్థివదేహాన్ని విజయవాడ నిమ్రా మెడికల్ కాలేజీకి దానం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం తెనాలి నాయకులు ములక శివసామిరెడ్డి పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చింది బిజెపినే

- ఎన్నికల్లో లబ్ధికి టిడిపి అసత్య ప్రచారం : ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చింది బిజెపియేనని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి దానిపై అసత్య ప్రచారం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూముల డాక్యుమెంటేషన్, ఎక్కడ నుంచి ఎక్కడికైనా రిజిస్ట్రేషన్, ఆటో మ్యూటేషన్ తదితర ప్రక్రియల కోసం కార్డు 2.0 సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఈ నెల 25న జారీ చేసిన మెమోపై టిడిపి వక్రబాష్యాలు చెప్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి భూములను తీసుకుంటారంటూ పెద్దఎత్తున విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానాల్లో దీనిపై అనేక కేసులు ఉన్నాయని, వాటిపై ఒక స్పష్టత రావడంతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తేనే తామూ ముందుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు టిడిపి దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు.

బిజెపి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థికి నోటీసు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపైనా, వైసిపి ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కెకె.రాజుపైనా గతంలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజుకు పోలీసులు సోమవారం 41 నోటీసు అందజేశారు. సిఎంను దుర్మార్గపు ముఖ్యమంత్రి అని, కెకె.రాజును రౌడీ రాజు అని సంబోధిస్తూ విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలపై విశాఖ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో పోలీసులు తాజాగా నోటీసు అందజేసి విచారణ చేపట్టారు. అనంతరం బయటకు వచ్చిన విష్ణుకుమార్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. వైసిపి నేతలపై ప్రజలు ఏమనుకుంటున్నారో.. తానూ అదే అన్నానని సమర్థించుకున్నారు.

రేవణ్ణను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెడిఎస్ నేత, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై తక్షణమే విచారణ చేపట్టిన కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి డిమాండ్ చేశారు. మహిళలను లైంగికంగా వేధించడంతో పాటు అసభ్యకరమైన వీడియోలతో బ్లాక్ మెయిల్ చేసినట్లు వారిపై ఆరోపణలు వచ్చాయని, దీనిపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇంతలోనే రేవణ్ణ దేశం వదిలి పారిపోయాడన్నారు. అతన్ని వెంటనే రప్పించి, త్వరితగతిన విచారించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జాతీయ మహిళా కమిషన్ ఈ ఘోర దురంతంపై స్పందించకపోవటాన్ని ఖండించారు.

నేడు 224 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం 61 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 173 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, కాకినాడ, బాప్ల, కోనసీమ, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. ఇక సోమవారం నంద్యాల జిల్లా ఆత్మకూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా సింహాద్రిపురంలో 45.9, విజయనగరం జిల్లా రామభద్రపురంలో 45.1, కర్నూలు జిల్లా కోడుమూరులో 44.8, మన్యం జిల్లా సాలూరులో 44.5, శ్రీకాకుళం జిల్లా నర్సుపేటలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర వడగాడ్పుల నేపథ్యంలో వీలైనంత వరకు ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని విపత్తుల సంస్థ ఎమ్‌డి కూర్మనాథ్ సూచించారు.

వివేకా హత్య గురించి మాట్లాడొద్దన్న కేసులో..

విచారణ నుంచి వైదొలిగిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్, ఆ పార్టీ నేతలపై ఏ విధమైన వ్యాఖ్యలూ చేయరాదన్న కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ యు దుర్గాప్రసాదరావు తప్పుకున్నారు. మరో ధర్మాసనం విచారణ చేసే విధంగా పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తికి నివేదించాలని హైకోర్టు రిజిస్ట్రీని జస్టిస్ దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత, పులివెందుల అసెంబ్లీ టిడిపి అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) దాఖలు చేసిన వేర్వేరు వ్యాజ్యాలను గతంలో విచారణ చేపట్టేందుకు జస్టిస్ ఎవి శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఇప్పుడు జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం కూడా అదే విధంగా చేసింది.



గ్రూప్-1 భర్తీ రద్దుపై అప్పీల్ విచారణ వాయిదా

ఎపిపిఎస్‌సి 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం జరిపిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మ్యాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు నివేదించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-1 పరీక్షల్లో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న 167 మందిని తొలగించరాదన్న మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించింది. విచారణను మే 8కి వాయిదా వేస్తూ జస్టిస్ జి నరేందర్, జస్టిస్ ఎన్ హరినాథ్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. .

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ఎపిపిఎస్‌సి, ఆ నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన పలువురు ఉద్యోగులు ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేశారు. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోరాదని సీనియర్ న్యాయవాది జంద్యాల రవిశంకర్, న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదించారు. 2021 డిసెంబరు 5 నుంచి 2022 ఫిబ్రవరి 26 మధ్య మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం చేశాక ఎపిపిఎస్‌సి ఫలితాల్ని ప్రకటించలేదని, మార్చి 25 నుంచి మే 26 మధ్య చేసిన మూల్యాంకనం ఫలితాలనే ప్రకటించిందని అన్నారు. ఎపిపిఎస్‌సి తరపున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ ప్రతివాదన చేస్తూ, 2021 డిసెంబరు 5 నుంచి 2022 ఫిబ్రవరి 26 మధ్య మాన్యువల్ విధానంలో మూల్యాంకనం జరగలేదన్నారు.

హెబిఎస్ కార్పస్ పిటిషన్ మూసివేత

గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి విడదల రజిని అనే ఎస్‌సి మహిళను అధికార పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు విచారణను మూసేసింది. సోమవారం కోర్టులో రజిని, ఆమె భర్త అనురాగారావు హాజరై తమను ఎవరూ అపహరించలేదని చెప్పారు. ఈ వివరాలను జస్టిస్ యు దర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన డివిజన్ బెంచ్ రికార్డు చేసి పిటిషన్‌పై విచారణను మూసివేసింది. నగరంపాలెం పోలీసులు రజినిని అపహరించారని ఆరోపిస్తూ ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచిన పఠాన్ అస్మతులా హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు మూసేసింది.

పులివర్తి నానికి వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ

చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానికి వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ కల్పించాలని రాష్ట్ర పోలీసులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి ఆదేశాలిచ్చారు. తిరుపతి జిల్లా ఎస్‌పి, తిరుపతి రూరల్ పోలీసులకు సెక్యూరిటీ ఇచ్చేలా ఉత్తర్వులివ్వాలంటూ పులివర్తి వెంకట మణి ప్రసాద్ నాని, ఆయన భార్య, కుమారుడు హైకోర్టును ఆశ్రయించారు. సెక్యూటరీ కల్పించాలని న్యాయవాది పివిజి ఉమేశ్ చంద్ర వాదనల తర్వాత వన్ ప్లస్ వన్ సెక్యురిటీ కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సమ్మిళిత వృద్ధిపై దృష్టి పెట్టాలి

- రఘురాం రాజన్



న్యూఢిల్లీ : సంపన్నులపై పన్ను విధించడం ద్వారా మాత్రమే వృద్ధి వేగాన్ని పెంచలేమని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నార్త్‌వెస్టర్న్ యూనివర్శిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాజన్ మాట్లాడుతూ.. సమ్మిళిత వృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా మాత్రమే జిడిపిని వేగంగా పెంచగలమన్నారు. విజయంతమైన వారిని కిందికి లాగడం కంటే క్రింది వారిని ఉన్నత స్థానానికి తీసుకెళ్లడానికి ప్రయత్నించాలన్నారు. అమెరికాలో వారసత్వపు పన్ను అంశంపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజన్ మాట్లాడారు. మణిపూర్‌లో జాతి కలహాల గురించి మాట్లాడుతూ.. భారతదేశంలో జరుగుతున్నది ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు రెండు వర్గాల మధ్య పోరాటం కాదని రాజన్ పేర్కొన్నారు. ఉద్యోగాలు, రిజర్వేషన్‌ల కోసం ఒక వర్గానికి చెందిన వారి కంటే మరో సామాజికవర్గం ఎక్కువ పొందుతున్నట్లు భావించడం వల్లే ఆందోళనలు నెలకొన్నాయన్నారు.

నాలుగు మాసాలకే ఓలా క్యాబ్స్ సిఇఒ రాజీనామా

- 10% మంది ఉద్యోగులకు ఎసరు..!



బెంగళూరు : ప్రముఖ క్యాబ్ సర్వీస్ సంస్థ ఓలా క్యాబ్స్‌లో బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలలకే ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) పదవికి హేమంత్ బక్షి రాజీనామా చేశారు. మరోవైపు సంస్థలో పని చేస్తున్న వారిలో 200 మంది ఉద్యోగుల్ని లేదా 10 శాతం మందిని తొలగించే ప్రక్రియ జరుగుతుందని సమాచారం. సంస్థ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వెళ్తున్నందున పొదపు చర్యలకు పాల్పడుతోంది. ఐపిఒ కోసం మరో రెండు మూడు నెలల్లో సెబీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

బిఎండబ్ల్యు ఐ5 ఎం60 ఎలక్ట్రిక్ సెడాన్ ఆవిష్కరణ



ముంబయి : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు తన బిఎండబ్ల్యు ఐ5 ఎం60 ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఆవిష్కరించింది. తొలిసారి 5 సీరిస్‌లో విద్యుత్ కారును విడుదల చేసినట్లు సోమవారం తెలిపింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1.20 కోట్లుగా నిర్ణయించింది. ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 516 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని తెలిపింది. 3.8 సెకండ్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదని వెల్లడించింది. గంటకు 230 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని తెలిపింది.

ఎండిహెచ్ 31 శాతం ఉత్పత్తులు తిరస్కరణ

- ఆరు నెలల్లో వెనక్కి పంపిన అమెరికా

న్యూఢిల్లీ : గడిచిన ఆరు నెలల్లో 31 శాతం ఎండిహెచ్ మసాల ఉత్పత్తులను అమెరికా తిరస్కరించింది. యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ అధికారులు 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 11 షిప్‌మెంట్లను వెనక్కి పంపారు. ఇటీవల ఎండిహెచ్ ఉత్పత్తులను హాంకాంగ్, సింగపూర్ ప్రభుత్వాలు నిషేధించడంతో తాజాగా అమెరికా చర్యలు కూడా బయటికి వచ్చాయని ఓ ఆంగ్ల పత్రిక రిపోర్ట్ చేసింది. ఎండిహెచ్ ఉత్పత్తుల తిరస్కరణ రేటు రెండింతలు పెరిగిందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ గణంకాల్లో తేలింది. అక్టోబర్ 2022-సెప్టెంబర్ 2023 మధ్య కాలంలో తిరస్కరణ రేటు 15 శాతంగా ఉండగా.. గడిచిన ఆరు నెలల్లో ఇది 31 శాతానికి చేరడం గమనార్హం.

నేడు స్టాండర్డ్ క్యాపిటల్ బోర్డు భేటీ

హైదరాబాద్ : ఆర్థిక సేవల రంగంలో అగ్రగామిగా ఉన్న స్టాండర్డ్ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ బోర్డు ఏప్రిల్ 30న భేటీ కానున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో ప్రత్యేక డివిడెండ్ ప్రకటనను పరిశీలించే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా ప్రిఫరెన్షియల్ ఇష్యూ, రైట్స్ ఇష్యూ, ఏదైనా ఇతర మోడ్ ద్వారా ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ సెక్యూరిటీల జారీని కూడా బోర్డు పరిశీలిస్తుందని ఆ వర్గాల సమాచారం. స్టాండర్డ్ కాపిటల్ విభిన్న శ్రేణి వ్యక్తిగత రుణాలను అందిస్తుంది. ఆర్థిక సహాయాన్ని కోరుకునే వ్యాపారాల కోసం కంపెనీ సౌకర్యవంతమైన ఓవర్‌డ్రాఫ్ట్ ఎంపికలతో వ్యాపార రుణాలను పొడిగిస్తుందని పేర్కొంది.

హైసియా కొత్త అధ్యక్షుడిగా ప్రశాంత్ నందెళ్ల



హైదరాబాద్ : హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) 32వ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ప్రశాంత్ నందెళ్లను ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆయన ఫస్ట్సోర్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. 2024-26 కాలానికి హైసియా అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఇంతక్రితం ఆయన అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ హైదరాబాద్ (సెజ్) అండ్ ఇండోర్ క్యాంపస్ హెడ్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ హెడ్ మనీషా సాబూ నుంచి కొత్త బాధ్యతలను స్వీకరించారు. నూతన వైస్ ప్రెసిడెంట్‌గా బిపిన్ పెండ్యాల, ట్రెజరర్‌గా ఐజాక్ రాజ్ కుమార్, జనరల్ సెక్రటరీగా రామకృష్ణ లింగిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వినయ్ అగర్వాల్ నియమతులయ్యారు.

ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి అసాధ్యం : నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖపట్నం)


గీతం వర్శిటీలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ దేశమైనా ఆర్థికంగా వృద్ధి చెందలేదని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ దృష్టితోనే 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షులు ఎం శ్రీభరత్ అధ్యక్షతన సోమవారం 'వికసిత భారత్ క్యాంపస్ అంబాసిడర్' కార్యాక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1991లోనే ఆర్థిక సంస్కరణలు అమలైనప్పటికీ అవినీతి, నాయకత్వ లేమి కారణంగా అనుకున్నంత అభివృద్ధి సాధించలేకపోయామన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో పదేళ్లలో గణనీయమైన ప్రగతి సాధించామని ఆమె చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్ పాల్గొన్నారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- అనిల్ కుమార్

ప్రజాశక్తి -బద్వేల్/గోపవరం (వైఎస్ఆర్ జిల్లా)

పాపులను తొక్కేయండంటూ తాను రాజకీయ వ్యాఖ్యలు చేసినట్లు కొందరు వక్రీకరించారని, అవన్నీ అవాస్తమని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల భర్త అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర గ్రాండ్ ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల గురించి తాను ఎప్పుడూ మాట్లాడనని, ఏసుక్రీస్తు వాక్యాలను మాత్రమే చెబుతానని పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఓ ప్రార్థన మందిరంలో తాను ఏసుక్రీస్తు సందేశాలను వివరిస్తూ పాములను, తేళ్లను తొక్కే అధికారం యేసయ్య సంఘానికి ఇచ్చాడని పేర్కొన్నానని దానిని కొందరు పాపులను తొక్కేందుకు అంటూ రాజకీయ వ్యాఖ్యలు వచ్చేలా ప్రచారం చేశారనిపేర్కొన్నారు. నేను రాజకీయాల గురించి వారికి సపోర్ట్ చేయండి వీరికి సపోర్ట్ చేయండి అని అర్థం వచ్చేలా ఎప్పుడూ మాట్లాడనని తెలిపారు. దయచేసి తాను చెప్పే వాక్యాలను వేరే అర్థం వచ్చేలా మీడియాలో కథనాలు అల్లవద్దని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్, పాస్టర్ మోసెస్, పాస్టర్ కుమార్, మరి కొంతమంది పాస్టర్లు, క్రైస్తవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టొయోటా ఉంచి కొత్త రుమియోన్



న్యూఢిల్లీ : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తన కొత్త గ్రేడ్ జి-ఎటి టొయోటా రుమియన్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.13 లక్షలుగా నిర్ణయించింది. ముందస్తుగా రూ.11,000తో బుకింగ్స్‌ను తెరిచినట్లు తెలిపింది. కాగా మే 5 నుంచి డెలివరీలను ప్రారంభించినట్లు వెల్లడించింది. 1.5 లీటర్ల కె సీరిస్ పెట్రోల్ ఇంజిన్‌తో ఆవిష్కరించింది.

సెన్సెక్స్‌కు 941 పాయింట్ల లాభం

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలాంశాలతో సోమవారం భారత మార్కెట్లు పరుగులు పెట్టాయి. మార్చి త్రైమాసిక ఫలితాల అనంతరం బ్యాకింగ్, ఫైనాన్షియల్ స్టాక్‌లో బలమైన కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ 941 పాయింట్ల లాభంతో 74,671కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 223 పాయింట్లు లాభపడి 22,643.40 వద్ద ముగిసింది. బిఎస్ఇలో 1,777 షేర్లు రాణించగా.. 1578 షేర్లు పతనాన్ని చవి చూశాయి. నిఫ్టీలో ఐసిఐసిఐ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్‌బిఐ, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్ సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి.